అక్షర కలం తెలుగు దిన పత్రికలో
పదవి విరమణ, కోర్టు నోటీసులు,
జన్మదిన, వ్యాపార అభివృద్ధి కొరకు
మరియు అన్ని రకాల ప్రకటనలు
ప్రచురించబడును.
సంప్రదించండి
93962 18955
aksharakalam@gmail.com
అక్షరకలం
తెలుగు దినపత్రిక

epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

అక్షరకలం
తెలుగు దినపత్రిక
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న 'అక్షర కలం'తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు మండలాల వారిగా, నియోకవర్గాలవారిగా,జిల్లాల వారిగా విలేకరులు, యాడ్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
గమనిక : డిగ్రీ ఉత్తీర్ణులు మరియు వివిధ పత్రికలలో పని చేసిన అనుభవం ఉన్నవారికి ప్రాముఖ్యత కలదు
epaper.aksharakalam.com
aksharakalam@gmail.com
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ :
93962 18955

సంపుటి : 17 సంచిక : 269 | 10-11-2025 సోమవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | హైదరాబాద్ | వరంగల్ | మహబూబ్‌నగర్ | పేజీలు : 12 వెల : రూ.1.00


## కేటీఆర్ జీవితంలో అధికారం అనే రేఖ లేదు...

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కేటీఆర్ జాతకంలో అధికార యోగం అనే రేఖే లేదని, ఆయన దశ బాగోలేనప్పుడు తండ్రి కేసీఆర్ ఎన్ని దిశలు మార్చినా ప్రయోజనం ఉండదని ఎద్దేవా చేశారు. పుత్ర వాత్సల్యంతో కేసీఆర్ ధృతరాష్ట్రుడిలా మారారని ఆయన అభివర్ణించారు. రేవంత్ రెడ్డి ఇవాళ హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో పాల్గొన్నారు.

- శ్రీలీల ఐటమ్ సాంగ్ గుర్తుకొస్తోంది: సీఎం రేవంత్ రెడ్డి
- హైదరాబాదులో మీట్ ది ప్రెస్ కార్యక్రమం
- జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు సీఎం రేవంత్ రెడ్డి సమాధానాలు
- కేటీఆర్ దశ బాగా లేదు... కేసీఆర్ ఎన్ని దిశలు మార్చినా ప్రయోజనం లేదని ఎద్దేవా
- పుత్ర వాత్సల్యంతో కేసీఆర్ ధృతరాష్ట్రుడిలా మారారని విమర్శలు

2 లో..





## ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ పార్టీలకు మద్దతు ఇవ్వదు

- ఏ రాజకీయ పార్టీకి తాము మద్దతు ఇవ్వబోమన్న మోహన్ భగవత్
- రామ మందిరానికి కాంగ్రెస్ మద్దతిచ్చినా అండగా నిలిచేవాళ్లమని వెల్లడి
- కాషాయం మాకు గురువు లాంటిది, అందుకే ఆ జెండాను ఎగరేస్తాం అని వివరణ
- విమర్శలను పట్టించుకోం.. అవే మాకు మరింత ప్రచారం కల్పిస్తాయి అని వ్యాఖ్యలు

వార్త 2లో

## మహిళా సంఘాలను బిఆర్ఎస్ నిర్లక్ష్యం చేసింది : భట్టి



జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్ అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తి అని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఏ పదవి లేకపోయినా.. కొనాళ్లుగా ఎన్నో సేవాకార్యక్రమాలు చేపట్టారని అన్నారు.

వార్త 2లో

## సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి



సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సూచించారు. ఫోన్ కాల్, సోషల్ మీడియా, ఆన్‌లైన్ ఇంటరాక్షన్‌తోనే సైబర్ కేటుగాళ్లు నేరాలు చేస్తున్నారని తెలిపారు. పాత నేరస్థుల మాదిరిగానే కొత్త నేరస్థులు కూడా డేటాను సులభంగా సేకరిస్తున్నారని చెప్పుకొచ్చారు. ఎవరు ధనవంతులు..? ఏ లొకేషన్‌లో ఎవరూ ఉంటారు..? వయస్సు, లింగం వంటి వివరాలు అన్నీ తెలుసుకొని.. వారినే లక్ష్యంగా సైబర్ మోసగాళ్లు ఎంచుకుంటున్నారని పేర్కొన్నారు. ఇది సాధారణ సమస్య కాదని.. ఒక తీవ్రమైన సామాజిక సమస్యగా మారిందని పేర్కొన్నారు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి. హైదరాబాద్ సిటీ పోలీస్ ఆధ్వర్యంలో సైబర్‌క్రైమ్ నియంత్రణపై అవగాహన కార్యక్రమం ఇవాళ(ఆదివారం) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీజీపీ శివధ ర్‌రెడ్డి, హైదరాబాద్ సీపీ సజ్జనార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్‌రెడ్డి మాట్లాడారు. సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమం లాగాకాకుండా, దీనిని ఒక 'మూవ్‌మెంట్'గా తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఇంట్లో ఉన్న మహిళలు, వృద్ధులు, గృహిణులు సైబర్ కేటుగాళ్లకు ప్రధానంగా లక్ష్యంగా మారుతున్నారని చెప్పుకొచ్చారు. మహిళలు ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు ఫోన్లు చేసి భయపెట్టి మోసం చేస్తున్నారని అన్నారు.

## మోదీ సామ్రాజ్యంపై కాంగ్రెస్ పోరాటం

- బ్రిటీషర్లపై గాంధీజీ చేసిన యుద్ధం లాంటిదని వ్యాఖ్య
- ప్రధాని మోదీ భాషపై ప్రియాంక అభ్యంతరం
- బీహార్‌లో 65 లక్షల ఓట్లు తొలగించారంటూ ఆరోపణ
- ఎన్నికల సంఘం అధికారులపైనా తీవ్ర విమర్శలు
- కార్పొరేట్ మిత్రుల కోసమే మోదీ పాలన అని ఫైర్



ప్రధాని నరేంద్ర మోదీ సామ్రాజ్యంపై తమ పార్టీ చేస్తున్న పోరాటం ఒకప్పుడు మహాత్మా గాంధీ బ్రిటిషర్లపై చేసిన స్వాతంత్ర్య సంగ్రామం లాంటిదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా సంచలన వ్యాఖ్యలు చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సీమాంచల్ ప్రాంతంలోని కతిహార్, పూర్ణియా, బరారీలలో నిర్వహించిన సభల్లో ఆమె ప్రసంగించారు.ప్రధాని మోదీ 'కట్టా' (నాటు తుపాకీ) వంటి పదాలు వాడటంపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "ఒకవైపు అహింసకు ప్రతీక అయిన 'వందే మాతరం' అంటూనే, మరోవైపు తన పదవి గౌరవానికి భంగం కలిగించేలా ప్రధాని మాట్లాడుతున్నారు. ఇది ఆయన హోదాకు తగదు" అని ప్రియాంక విమర్శించారు.

వార్త 2లో



2 లో..

## ట్రంప్ వల్లే యుద్ధం ఆగింది..

- మరోసారి ప్రశంసించిన పాక్ ప్రధాని
- ట్రంప్‌పై మరోసారి ప్రశంసలు కురిపించిన పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్
- మే నెలలో భారత్-పాక్ యుద్ధాన్ని ఆపింది ట్రంపేనని వ్యాఖ్య
- లక్షలాది మంది ప్రాణాలను ఆయన కాపాడారని కితాబు

## భారీ ఉగ్రకుట్ర.. గుజరాత్‌లో హైదరాబాదీ అరెస్ట్

హైదరాబాద్: అక్షరకలం ప్రతినిధి



గుజరాత్‌లో భారీ ఉగ్రకుట్రను గుజరాత్ ఎటిఎస్ పోలీసులు భగ్నం చేశారు. ఈ కుట్రకు ప్రయత్నించిన హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్ తో పాటు మరో ఇద్దరిని గుజరాత్ ఎటిఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. మొహియుద్దీన్ ఫ్రాన్స్‌లో ఎంబిబిఎస్ చేసినట్లు గుర్తించారు. ఆది వారం అతడి నివాసంలో సోదాలు జరి పిన గుజరాత్ పోలీసులు.. రెండు గ్లాక్ పిస్టల్స్, 1 బెరెట్టా పిస్టల్, 30 లైవ్ కాట్రిడ్జ్ లు స్వాధీనం చేసుకున్నారు. మొహియుద్దీ న్ ఐఎస్‌కెపి సభ్యులతో చర్చలు జరిపినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడిని కోర్టులో హాజరు పర్చగా.. ఈ నెల 18 వరకు న్యాయస్థానం రిమాండ్ విధించింది.



2 లో..

## 30 శాతం కమీషన్లు... అందుకే ఆ రంగం పడిపోయింది: హరీష్ రావు

## త్వరలో హెచ్ సిఎపై చర్యలు ఉండబోతున్నాయి

హైదరాబాద్:అక్షరకలం ప్రతినిధి

హెచ్ సిఎలో గ్రామీణ స్థాయి క్రికెటర్ల అవకాశం కల్పించట్లేదని తల్లిదండ్రులు తనను కలిశారని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. ఈ విషయంపై స్పంది స్తూ.. బిసిసిఐకి ఫిర్యాదు చేస్తామని అన్నారు. హెచ్ సిఎలో జరుగుతు న్న జూనియర్, సీనియర్ సెలెక్షన్లపై బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సెలక్షన్ కమిటీలో రూ. లక్షలు తీసుకున్నట్లు తల్లిదండ్రులు చెప్పారని, గతంలో బాగా ఆడే వారిని కూడా ఎంపిక చేయలేదని తల్లిదండ్రులు ఆరోపించారని తెలియజేశారు. త్వరలో హెచ్ సిఎపై చర్యలు ఉండబోతున్నాయని బండి సంజయ్ హెచ్చరించారు.



## బిఆర్ఎస్ లో ఉన్నప్పుడు నాపై ఆంక్షలు పెట్టారు: కవిత

హైదరాబాద్:

బిఆర్ఎస్ నుంచి తనను అవమానకరంగా బయటకు పంపారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. ఉరివేసే ఖైదీని చివరి కోరిక అడుగుతారు. కానీ తనకు షోకాజ్ నోటీస్ కూడా ఇవ్వకుండా సస్పెండ్ చేశారని మండిపడ్డారు. హనుమకొండలో కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. బిఆర్ఎస్ లో ఉన్నప్పుడు తనపై ఆంక్షలు పెట్టారని, ప్రొటోకాల్ పేరుతో తనను కట్టేశారని.. అందుకే జనంలో తిరగలేకపోయానని తెలియజేశారు. తాను సిఎం కూతురునైనా బిఆర్ఎస్ హయాంలో తన పనులు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సిఎం కెసిఆర్ పిలిస్తే కూతురిగా ఇంటికి వెళ్తానని, బిఆర్ఎస్ తో తనకు సంబంధం లేదని కవిత పేర్కొన్నారు.



# ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ పార్టీలకు మద్దతు ఇవ్వదు

ఏ రాజకీయ పార్టీకి తాము మద్దతు ఇవ్వబోమన్న మోహన్ భగవత్

రామ మందిరానికి కాంగ్రెస్ మద్దతిచ్చినా అండగా నిలిచేవాళ్లమని వెల్లడి

కాషాయం మాకు గురువు లాంటిది, అందుకే ఆ జెండాను ఎగరేస్తాం అని వివరణ

విమర్శలను పట్టించుకోం.. అవే మాకు మరింత ప్రచారం కల్పిస్తాయి అని వ్యాఖ్యలు

హైద్రాబాద్ అక్షరకలం ప్రతినిధి

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఏ ఒక్క వ్యక్తికి గానీ, రాజకీయ పార్టీకి గానీ మద్దతు ఇవ్వదని, కేవలం దేశ ప్రయోజనాలకు ఉపయోగపడే విధానాలకు మాత్రమే కట్టుబడి ఉంటుందని ఆ సంస్థ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా బెంగళూరులో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన ప్రసంగ కార్యక్రమంలో ఆ యన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.ఓ ప్రశ్నకు భగవత్ బదులిస్తూ, "మేము ఏ రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వం. ఎన్నికల రాజకీయాల్లో పాల్గొనబోము. సమాజాన్ని ఏకం చేసే పనిలో సంఘ్ నిమగ్నమై ఉంది. కానీ రాజకీయాలు స్వభావరీత్యా విభజనకారిగా ఉంటాయి" అని వివరించారు. దేశానికి మేలు చేసే విధానాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని, తమ ప్రభావాన్ని ఉపయోగించి సరైన విధానాలకు అండగా నిలుస్తామని తెలిపారు. "ఉదాహరణకు, అయోధ్యలో రామ మందిరం కావాలని మేము కోరుకున్నాం. ఆ లక్ష్యం కోసం నిలబడిన వారికి మా వలంటీర్లు మద్దతు ఇచ్చారు. ఆ సమయంలో బీజేపీ ఆ ఉద్యమంలో ఉంది కాబట్టి వారికి మద్దతిచ్చాం. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ రామమందిర ఉద్యమానికి మద్దతు ఇచ్చి ఉంటే, మా కార్యకర్తలు ఆ పార్టీతోనే నిలబడేవారు" అని ఆయన తేల్చిచెప్పారు."మాకు ఏ పార్టీ సొంతం కాదు, అలాగని ఏ పార్టీ పరాయిదీ కాదు. ఎందుకంటే అవన్నీ భారతీయ పార్టీలే. మేము 'రాష్ట్ర నీతి'కి మద్దతిస్తాం, 'రాజనీతి'కి కాదు. ఈ దేశం ఏ దిశలో పయనించాలనే దానిపై మాకు ఒక దార్శనికత ఉంది. ఆ దిశగా ఎవరు పనిచేసినా వారికి మా మద్దతు ఉంటుంది" అని భగవత్ పేర్కొన్నారు.




### జెండా వివాదంపై స్పష్టత

జాతీయ జెండాకు బదులుగా ఆర్ఎస్ఎస్ ఎందుకు కాషాయ జెండా (భగవా ధ్వజ్)ను ఉపయోగిస్తుందన్న ప్రశ్నకు ఆయన వివరణ ఇచ్చారు. "సంఘ్ 1925లో ప్రారంభమైంది. మాకు ఒక గురువు అవసరం. కానీ వ్యక్తిని గురువుగా స్వీకరిస్తే, వారికి పరిమిత ఆయుష్షు ఉంటుంది. అందుకే శాశ్వతంగా ఉండే మన సంస్కృతికి, హిందూత్వానికి ప్రతీకగా కాషాయ జెండాను గురువుగా స్వీకరించాం" అని తెలిపారు. జాతీయ జెండాను 1937లో ఖరారు చేశారని, దాని రూపకల్పన జరిగినప్పటి నుంచి తాము త్రివర్ణ పతాకాన్ని గౌరవిస్తూనే ఉన్నామని అన్నారు. "ప్రైవేట్ సంస్థలు జాతీయ జెండాను ఎగురవేయవచ్చని కోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత, జనవరి 26, ఆగస్టు 15న అన్ని శాఖలలో జెండా వందనం చేస్తున్నాం. కమ్యూనిస్ట్ పార్టీకి ఎర్ర జెండా, కాంగ్రెస్‌కు వారి జెండా ఉన్నట్లే, మాకు కాషాయ జెండా ఉంది. ఇందులో వివాదం ఏమీ లేదు" అని స్పష్టం చేశారు.మీడియా విమర్శలపై స్పందిస్తూ, "ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదు. కొందరి పని సంఘ్ గురించి సందేహాలు రేకెత్తించడమే. వారి విమర్శల వల్లే మాకు మరింత ఆదరణ పెరుగుతోంది. నిజం తెలిసినా కొందరు విమర్శిస్తూనే ఉంటారు. మేము వాటిని పట్టించుకోకుండా దేశం కోసం మా పని మేము చేసుకుంటూ పోతాం" అని మోహన్ భగవత్ అన్నారు.

# ట్రంప్ వల్లే యుద్ధం ఆగింది..

మరోసారి ప్రశంసించిన పాక్ ప్రధాని

ట్రంప్‌పై మరోసారి ప్రశంసలు కురిపించిన పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్

మే నెలలో భారత్-పాక్ యుద్ధాన్ని ఆపింది ట్రంపేనని వ్యాఖ్య

లక్షలాది మంది ప్రాణాలను ఆయన కాపాడారని కితాబు

హైద్రాబాద్ అక్షరకలం ప్రతినిధి

భారత్, పాకిస్థాన్ మధ్య గత మే నెలలో తలెత్తిన తీవ్ర ఉద్రిక్తతలను చల్లార్చి, యుద్ధాన్ని నివారించింది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంపేనని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మరోసారి ప్రశంసించారు. ఆయన 'ధైర్యవంతమైన, నిర్ణయాత్మక నాయకత్వం' వల్లే కాల్పుల విరమణ సాధ్యమైందని కొనియాడారు. శనివారం అజర్‌బైజాన్ రాజధాని బాకులో జరిగిన 'విక్టరీ డే' పరేడ్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.తన ప్రసంగంలో షెహబాజ్ మాట్లాడుతూ "ట్రంప్ జోక్యంతో దక్షిణాసియాలో శాంతి పునరుద్ధరించబడింది. ఒక పెద్ద యుద్ధం నివారించబడింది, తద్వారా లక్షలాది మంది ప్రాణాలు నిలిచాయి" అని పేర్కొన్నారు. వాషింగ్టన్ మధ్యవర్తిత్వంతో జరిగిన చర్చల అనంతరం మే 10న ఇరు దేశాలు 'పూర్తి, తక్షణ కాల్పుల విరమణ'కు అంగీకరించినట్లు ట్రంప్ అప్పట్లో ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి పాకిస్థాన్ ఈ ఘనతను ట్రంప్‌కు ఆపాదిస్తుండగా, భారత్ మాత్రం ఈ వాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ విషయంలో ఏ మూడో వ్యక్తి ప్రమేయం లేదని, నాలుగు రోజుల పాటు సరిహద్దుల్లో డ్రోన్లు, క్షిపణులతో దాడులు జరిగిన అనంతరం ఇరు దేశాలు ద్వైపాక్షిక చర్చల ద్వారానే ఒక అవగాహనకు వచ్చాయని న్యూఢిల్లీ మొదటి నుంచి స్పష్టం చేస్తోంది. ఇదే కార్యక్రమంలో షెహబాజ్ షరీఫ్ కశ్మీర్ అంశాన్ని కూడా ప్రస్తావించారు. కరబాఖ్‌లో అజర్‌బైజాన్ సాధించిన విజయం "కశ్మీర్ వంటి అణచివేతకు గురైన అన్ని దేశాలకు ఆశాకిరణం" అని ఆయన అభివర్ణించారు. పాకిస్థాన్ శాంతిని కోరుకుంటుందని, అయితే తమ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోదని తేల్చిచెప్పారు.ఈ విక్టరీ డే పరేడ్‌లో అజర్‌బైజాన్ సైనిక దళాలతో పాటు పాకిస్థాన్, తుర్కియే సైనికులు కూడా కవాతు నిర్వహించారు. పాకిస్థాన్‌కు చెందిన జేఎఫ్-17 థండర్ జెట్ల వైమానిక ప్రదర్శనతో ఈ కార్యక్రమం ముగిసింది.

# మహిళా సంఘాలను బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది : భట్టి

హైదరాబాద్: అక్షరకలం ప్రతినిధి

జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్ అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తి అని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఏ పదవి లేకపోయినా.. కొనాళ్లుగా ఎన్నో సేవాకార్యక్రమాలు చేపట్టారని అన్నారు. ఈ సందర్భంగా భట్టి మీడియాతో మాట్లాడుతూ.. నవీన్ యాదవ్ ను గెలిపించుకుని జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలని, పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ను కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తోందని తెలియజేశారు. పదేళ్లపాటు బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదని, ఈ ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డులు ఇచ్చి.. సన్నబియ్యం కూడా ఇస్తోందని అన్నారు. మహిళా సంఘాలను బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇస్తోందని, బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్కసారి కూడా గ్రూప్-1 పరీక్షలు జరగలేదని భట్టి విమర్శించారు.

# కేటీఆర్ జీవితంలో అధికారం అనే రేఖ లేదు...

శ్రీలీల ఐటమ్ సాంగ్ గుర్తుకొస్తోంది: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాదులో మీట్ ది ప్రెస్ కార్యక్రమం

జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు సీఎం రేవంత్ రెడ్డి సమాధానాలు

కేటీఆర్ దశ బాగా లేదు... కేసీఆర్ ఎన్ని దిశలు మార్చినా ప్రయోజనం లేదని ఎద్దేవా

పుత్ర వాత్సల్యంతో కేసీఆర్ ధృతరాష్ట్రుడిలా మారారని విమర్శలు

హైద్రాబాద్ అక్షరకలం ప్రతినిధి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కేటీఆర్ జాతకంలో అధికార యోగం అనే రేఖే లేదని, ఆయన దశ బాగోలేనప్పుడు తండ్రి కేసీఆర్ ఎన్ని దిశలు మార్చినా ప్రయోజనం ఉండదని ఎద్దేవా చేశారు. పుత్ర వాత్సల్యంతో కేసీఆర్ ధృతరాష్ట్రుడిలా మారారని ఆయన అభివర్ణించారు. రేవంత్ రెడ్డి ఇవాళ హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేటీఆర్ ఎన్నికల ప్రచారం చూస్తుంటే 'పుష్ప' సినిమాలోని శ్రీలీల ఐటమ్ సాంగ్ గుర్తుకొస్తోందని అన్నారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అధోగతి పాలు చేశారని ఆరోపించారు. "వ్యవసాయం, విద్య, వైద్యం.. ఇలా ఏ రంగంలోనూ బీఆర్ఎస్ ప్రభుత్వం విజయం సాధించలేదు. వేల కోట్లు ఖర్చు పెట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఒక్క ఎకరానికైనా నీళ్లు ఇచ్చారా? కానీ మా ప్రభుత్వం కాళేశ్వరం లేకుండానే రికార్డు స్థాయిలో వరి ఉత్పత్తి చేసి చూపించింది" అని తెలిపారు. కల్వకుర్తి, ఎస్ఎల్‌బీసీ, భీమా, నెట్టెంపాడు వంటి కీలక ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని, ప్రజలకు ఉపయోగపడని కమాండ్ కంట్రోల్ సెంటర్, ప్రగతిభవన్, సచివాలయం వంటి భవనాలు మాత్రమే నిర్మించారని విమర్శించారు.తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రవేశపెట్టిన ఏ పథకాన్నీ రద్దు చేయలేదని, వాటిని కొనసాగిస్తూనే కొత్త హామీలను అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఎస్సీ వర్గీకరణ, కుల గణన, రాష్ట్ర గీతం వంటి హామీలను నెరవేర్చామని గుర్తుచేశారు. దేశంలో ఎస్సీ వర్గీకరణ చేపట్టిన తొలి రాష్ట్రంగా తెలంగాణను నిలిపామని, ఎవరూ సాహసించని కులగణనను ప్రారంభించామని గర్వంగా చెప్పారు.రాష్ట్రంలోని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై కూడా రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఈ రెండు పార్టీలది ఫెవికాల్ బంధమని, రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలను గుజరాత్‌కు తరలించేందుకు బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సెమీ కండక్టర్ కంపెనీ తరలింపునకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణకు ఆదేశించినా, కేంద్రం ఎందుకు దర్యాప్తు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ డిపాజిట్ తెచ్చుకుంటే దేశం మొత్తం గెలిచినట్లేనని సవాల్ విసిరారు. "రాసిపెట్టుకోండి.. తెలంగాణలో మరో 8 ఏళ్ల పాటు మా కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుంది. 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు రావు, 2029 జూన్‌లో దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలు వస్తాయి. 2034 జూన్ వరకు మేమే పాలిస్తాం" అని రేవంత్ రెడ్డి పూర్తి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పలువురు జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

# మోదీ సామ్రాజ్యంపై కాంగ్రెస్ పోరాటం

బ్రిటిషర్లపై గాంధీజీ చేసిన యుద్ధం లాంటిదని వ్యాఖ్య

ప్రధాని మోదీ భాషపై ప్రియాంక అభ్యంతరం

బీహార్‌లో 65 లక్షల ఓట్లు తొలగించారంటూ ఆరోపణ

ఎన్నికల సంఘం అధికారులపైనా తీవ్ర విమర్శలు

కార్పొరేట్ మిత్రుల కోసమే మోదీ పాలన అని ఫైర్

హైద్రాబాద్ అక్షరకలం ప్రతినిధి

ప్రధాని నరేంద్ర మోదీ సామ్రాజ్యంపై తమ పార్టీ చేస్తున్న పోరాటం ఒకప్పుడు మహాత్మా గాంధీ బ్రిటిషర్లపై చేసిన స్వాతంత్ర్య సంగ్రామం లాంటిదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా సంచలన వ్యాఖ్యలు చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సీమాంచల్ ప్రాంతంలోని కతిహార్, పూర్నియా, బరారీలలో నిర్వహించిన సభల్లో ఆమె ప్రసంగించారు.ప్రధాని మోదీ 'కట్టా' (నాటు తుపాకీ) వంటి పదాలు వాడటంపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "ఒకవైపు అహింసకు ప్రతీక అయిన 'వందే మాతరం' అంటూనే, మరోవైపు తన పదవి గౌరవానికి భంగం కలిగించేలా ప్రధాని మాట్లాడుతున్నారు. ఇది ఆయన హోదాకు తగదు" అని ప్రియాంక విమర్శించారు.బీహార్‌లోని ప్రస్తుత దుస్థితికి ఎన్డీయే ప్రభుత్వమే కారణమని ప్రియాంక ఆరోపించారు. "రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్లే యువత ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తోంది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీని తప్పుగా అమలు చేయడం వల్ల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కుప్పకూలిపోయి ఉద్యోగాలు లేకుండా పోయాయి" అని ఆమె అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రధాని మోదీ తన ఇద్దరు కార్పొరేట్ మిత్రులకు కట్టబెడుతున్నారని ఆమె ఆరోపిం చారు."70 ఏళ్ల కాంగ్రెస్ పాలన గురించి మాట్లాడే ఎన్డీయే నేతలు ఒకటి గుర్తుంచుకోవాలి. దేశంలో ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలను నిర్మించింది కాంగ్రెస్ ప్రభుత్వాలే" అని ప్రియాంక స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందు మహిళలకు రూ.10,000 ఇచ్చి ఓట్లు కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, ఇది వారికి లంచం ఇవ్వడమేనని ఆమె విమర్శించారు. "కార్పొరేట్ సంస్థల రుణాలను మాఫీ చేస్తున్నారు, కానీ పేదలు మాత్రం తమ పిల్లల చదువుల కోసం తీసుకున్న అప్పులకు జీవితాంతం వడ్డీలు కడుతూనే ఉన్నారు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రజలు బీజేపీ, దాని మిత్రపక్షాలపై విసిగిపోయారని, అందుకే అధికారంలో నిలిచేందుకు ఆ పార్టీ ఎన్నికల అక్రమాలకు పాల్పడుతోందని ప్రియాంక ఆరోపించారు. బీహార్‌లో ఏకంగా 65 లక్షల మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారని ఆమె సంచలన ఆరోపణ చేశారు. ఈ 'ఓట్ల దొంగతనం'లో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు వివేక్ జోషి, ఎస్ఎస్ సంధులకు కూడా భాగస్వామ్యం ఉందని, ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తున్నందుకు ప్రజలు వారిని కూడా జవాబుదారీ చేస్తారని హెచ్చరించారు.ఇదిలా ఉండగా, కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల తొలి దశలో ఎన్డీయే భారీగా నష్టపోయిందని, విపక్ష కూటమి 75 నుంచి 80 స్థానాలు గెలుచుకోబోతోందని ధీమా వ్యక్తం చేశారు. చాలా మంది బీజేపీ అభ్యర్థులు ఓటమి పాలవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.

# 30 శాతం కమీషన్లు... అందుకే ఆ రంగం పడిపోయింది: హరీష్ రావు

హైదరాబాద్:

జూబ్లీహిల్స్ ఉప్ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో ఓటమి ఫ్రస్ట్రేషన్ కనిపిస్తోందని మాజీ మంత్రి హరీష్ రావు తెలిపారు. రేవంత్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శించారు. బిజెపి, రేవంత్ మధ్య ఫెవికాల్ బంధం ఉందని, రేవంత్ సర్కార్‌ను బిజెపి కాపాడుతోందని ఆరోపణలు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎర్రగడ్డలోని మోతి నగర్ కాలనీ వాసవి బృందావనం అపార్ట్ మెంట్ వాసుల ఆత్మీయ సమ్మేళనం హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ మీడియాతో మాట్లాడారు. రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని బండి సంజయ్ ప్రయత్నిస్తున్నారని విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో యూరియా కొరత వస్తే సంజయ్ ఎక్కిడికెళ్లారని ప్రశ్నించారు. కన్నీళ్లను కూడా రాజకీయం చేయడం చిల్లర రాజకీయమని దుయ్యబట్టారు. చిల్లర మాటలు మాట్లాడితే ప్రజలు సహించరని, కాంగ్రెస్ ఓడిపోతుందని తెలిసిన తరువాత అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చారని ఎద్దేవా చేశారు. హైదరాబాదులో రియల్ ఎస్టేట్ పూర్తిగా కుప్పకూలిపోయిందని, పిల్లల పెళ్లిళ్లకు, చదువులకు భూమమ్ముదామంటే ధర లేక నష్టపోతున్నారని, రేవంత్ రెడ్డి అసమర్థత పాలన వల్ల రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక: ముగిసిన ప్రచారం..

నవంబరు 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్


బరిలో 58 మంది అభ్యర్థులు

ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య పోటీ

నవంబరు 14న ఓట్ల లెక్కింపు

హైదరాబాద్: అక్షరకలం ప్రతినిధి

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారానికి నేటితో తెరపడింది. గత కొన్ని రోజులుగా హోరాహోరీగా సాగిన ప్రచార పర్వం ఆదివారం సాయంత్రంతో ముగిసింది. ఎల్లుండి (నవంబరు 11, మంగళవారం) పోలింగ్ జరగనుండగా, ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.ఈ ఉప ఎన్నికలో ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య ముక్కోణపు పోటీ నెలకొంది. బీఆర్ఎస్ తరపున మాగంటి సునీత, కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బీజేపీ అభ్యర్థిగా దీపక్ రెడ్డి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. వీరితో పాటు మొత్తం 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ప్రధాన పార్టీల నేతలంతా చివరి రోజు వరకు విస్తృతంగా ప్రచారం నిర్వహించి ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేశారు.జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకోసం ఎన్నికల సంఘం 407 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ముఖ్యంగా 139 సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్లతో నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. నవంబరు 11న పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం, ఈ నెల 14న ఓట్ల లెక్కింపు చేపట్టి అదే రోజు ఫలితాన్ని వెల్లడిస్తారు. దీంతో అభ్యర్థుల భవితవ్యం తేలిపోనుంది.



# ఐదేళ్ల అడ్డగోలు దోపిడీని ప్రశ్నిస్తూనే ఉంటా

## ఎన్ని విమర్శలు చేసినా ఊరుకునేది లేదు

## బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి హెచ్చరిక

**విజయవాడ,**

వైకాపా నాయకులు జగన్ మెప్పు కోసం నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని భాజపా ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి విమర్శించారు. విజయవాడలో శనివారం మీడియాతో మాట్లాడుతూ... అభివృద్ధిని ఓర్చుకోలేని జగన్.. రాష్ట్రం, ప్రజలపై కుట్రలు చేస్తున్నారు. వైకాపా అంతరించిపోయే పార్టీ.. అందుకే అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరి హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో ధైర్యం ఉంటే చర్చకు రండి. వైకాపా నాయకులు ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోలేరు. వివేకా హత్య కేసులో దోషులను జగన్ వెనకేసుకొస్తున్నారని ఆదినారాయణరెడ్డి ఆరోపించారు. గత ఐదేళ్లలో వైసిపి అడ్డగోలుగా దోచుకున్న అవినీతి వ్యవహారాన్ని మొత్తాన్ని బయటపెడుతానంటూ ఆదినారాయణ రెడ్డి హెచ్చరించారు. టైంపాస్ రాజకీయాలు చేయనని.. రాష్ట్రం, ప్రజలకు మంచి జరగాలన్నదే తన ఆకాంక్ష అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ మేరకు మాజీ సీఎం జగన్‌పై ఆదినారాయణ రెడ్డి ఫైర్ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధి, వైసీపీ చేసిన అవినీతిపై ఇటీవల జరిగిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడానని.. గత వైసీపీ ప్రభుత్వంలో చేసిన అరాచకాలు, మోసాలను, దోపిడీని ప్రస్తావించినట్లు తెలిపారు. దీంతో కొంతమంది వైసీపీ నేతలు, ఎమ్మెల్యేలు తనపైన వ్యక్తిగత దూషణలు చేశారని మండిపడ్డారు. వైసీపీ సోషల్ మీడియా వేదికగా తనపై అబద్దాలు ప్రచారం చేశారని ఫైర్ అయ్యారు. జగన్ మెప్పు పొందేందుకు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని విరుచుకుపడ్డారు. అనవసరంగా, అన్యాయంగా, వ్యక్తిగతంగా విమర్శలు చేశారన్నారు. తనపై అనవసరంగా నోరు పారేసుకున్న నాయకులకు తప్పకుండా సమాధానం చెబుతానని వార్నింగ్ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంతో పోల్చుకుంటే కూటమిలో అభివృద్ధి జరుగు తుందనేది వాస్తవమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రధాని మోడీ సహకారంతో ఏపీ అన్ని విధాల అభివృద్ధి చెందుతోందన్నారు. నాలుగో సారి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు కేంద్రం సహకారంతో రాష్టాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. దేశంలో ఉన్న పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారన్నారు. బనకచర్ల ద్వారా గోదావరి నీళ్లు రాయలసీమకు కూడా అందిస్తున్నారని తెలిపారు. మోడీ సహకారం, చంద్రబాబు పట్టుదల వల్ల అనేక ప్రాజెక్టులు పూర్తి అయ్యేలా పనులు వేగవంతంగా జరుగుతున్నాయని వెల్లడించారు. అమరావతి, విశాఖలో మెట్రో రైలు ప్రాజెక్టులు, ఎయిర్ పోర్ట్‌ల ఆధునీకరణ, జాతీయ రహదారుల నిర్మాణం వేగవంతంగా జరుగుతోందన్నారు. సూపర్ సిక్స్.. సూపర్ హిట్ అనేది వాస్తవమని తెలిపారు. ఇటువంటి అభివృద్ధిని ఓర్చుకోలేని జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రం మీద, ప్రజలపైన కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలందరూ ఆనందంగా ఉన్నారని.. వైసీపీ అన్యాయాలు, అక్రమాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. వైసీపీ అంతరించిపోయే పార్టీ అని అందుకే అబద్దాలు ప్రచారం చేస్తున్నారని బీజేపీ నేత ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అమెరికాలో తెలుగు విద్యార్థి మృతి

## ఆకస్మిక మృతితో శోకసంద్రంలో కుటుంబం

**బాపట్ల,**

అమెరికాలో మరో తెలుగు జ్యోతి ఆరిపోయింది. బాపట్ల జిల్లాకు చెందిన అమ్మాయి మృత్యువాత పడింది. ఉన్నత విద్యనభ్యసించి కుటుంబాన్ని ఆదుకోవాలనే లక్ష్యంతో ఎన్నో ఆశలతో అమెరికాలో అడుగుపెట్టిన ఆ విద్యార్థిని ఆశలు అడియాశలయ్యాయి. చదువు పూర్తి చేసుకుని.. కొద్దిరోజుల్లో కొలువులో చేరుతుందని ఆశగా ఉన్న ఆ కుటుంబ ఆశల దీపాన్ని విధి వెక్కిరించింది. అనారోగ్యం రూపంలో ఆమెను బలిగొంది. బాపట్ల జిల్లా కారంచేడుకు చెందిన యార్లగడ్డ రామకృష్ణ, నాగమణి దంపతుల కుమార్తె రాజ్యలక్ష్మి (23) విజయవాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తి చేసింది. ఉన్నత చదువుల కోసం అమెరికాలోని ఓ యూనివర్సిటీలో ఎంఎస్ కంప్యూటర్స్ విభాగంలో 2023లో చేరింది. ఇటీవల విద్యాభ్యాసం కూడా ముగియడంతో అక్కడే స్నేహితులతో కలిసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉంది. మూడు రోజుల క్రితం జలుబు, ఆయాసంగా ఉందని.. చికిత్స కోసం ఈనెల 9కి వైద్యుల అపాయింట్‌మెంట్ తీసుకున్నానని గురువారం రాత్రి కుటుంబ సభ్యులకు తెలిపింది. అదే రోజు రాత్రి స్నేహితులతో కలిసి నిద్రపోయింది. రాజ్యలక్ష్మిని ఉదయం స్నేహితులు నిద్రలేపేందుకు ప్రయత్నించగా.. ఎలాంటి స్పందన లేదు. వెంటనే ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మరణవార్త విన్న కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. తల్లిదండ్రులిద్దరూ అచేతన స్థితిలో ఉండిపోయారని మృతురాలి సోదరుడు రాజా తెలిపారు. రాజ్యలక్ష్మి మరణంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. అమెరికాలో రాజ్యలక్ష్మి మృతి చెందడంపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు. రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించి అన్ని విధాలా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. మృతదేహాన్ని అమెరికా నుంచి తీసుకొచ్చేందుకు ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

# దాశరథిని బందించిన జైలును సందర్శించిన కవి బృందం

**నిజామాబాద్,**

నిజాబాద్‌లో కవి దాశరథిని బందించిన జైలును కవి బృందం సందర్శించింది. ఇక్కడ ఆనాటి జైలు జీవితం అనుభవించిన కవి దాశఃరథి గురించి తెలుసుకోవడం మరచిపోలేనిదని బృందం సభ్యులు అన్నారు. ప్రముఖ పద్య కవి, నాటక కర్త దూరవేటి మాట్లాడుతూ దాశరథిని బంధించిన జైలును సందర్శించడం తమ పూర్వజన్మ పుణ్యమన్నారు. ఇక్కడ అగ్నిధారలో కురిపించిన దాశరథి పద్యాలను గుర్తు చేసుకుంటూ పాడుకుంటూ పులకించిపోయారు. వికారాబాద్ కేంద్రంగా సాహిత్య వికాసానికై కృషి చేస్తున్న అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక రాష్ట్రస్థాయి కవి బృందం శనివారం నిజామాబాద్ ఖిల్లా జైలు, రఘునాథ ఆలయాన్ని సందర్శించింది. అంతకుముందు బాసర కవి యాత్ర జిల్లా కేంద్రానికి చేరుకుంది. అందులోని సుమారు 40 మంది కవులు ఖిల్లా రామాలయాన్ని సందర్శించారు. అక్కడ దాశరథిని బంధించి ఉన్న జైల్లోకి వెళ్లి.. వారిని దర్శించుకున్నారు.

# జూబ్లీహిల్స్ పరిధిలో పోలీస్ ఆంక్షలు

## ప్రకటన జారీచేసిన కమిషనర్ సజ్జన్నార్

**హైదరాబాద్,**

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్ దృష్ట్యా ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. ఆదివారం సాయంత్రం నుంచి పోలింగ్ జరుగనున్న మంగళవారం సాయంత్రం వరకు అమల్లో ఉంటాయి. ఈ మేరకు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ కీలక ఆదేశాలు జారీ చేశారు. నియోజకవర్గం పరిధిలో 9వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి పోలింగ్ జరగనున్న 11వ తేదీ మంగళవాం సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు అమల్లోకి వస్తాయి. అలాగే తిరిగి ఓట్ల లెక్కింపు జరిగే 14న ఉదయం 6 గంటల నుంచి 15 సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. నిర్దేశించిన సమయాల్లో మద్యం దుకాణాలన్నీ మూసి వేయాలని, హోటళ్లు, రెస్టారంట్‌లు, క్లబ్బులు మూసివేయాలని ఆదేశించారు. శాంతిభద్రతల నేపథ్యంలో నియోజకవర్గం వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఐదుగురు, అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం నిషేధమన్నారు. ఓట్ల లెక్కింపు రోజున రహదారులు, జనావాసాల్లో టపాసులు పేల్చడం నిషేధమని, ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.

# భైరవానితిప్ప ప్రారంభించింది టీడీపీయే

## పూర్తి చేసేది కూడా తామే

## భక్త కనకదాసు జయంతిలో మంత్రి లోకేశ్

**అనంతపురం**



భైరవానితిప్ప ప్రారంభించింది టీడీపీయేనని.. పూర్తి చేసేది కూడా టీడీపీనేనని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. భక్త కనకదాస జయంతి సందర్భంగా అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరై ఆయన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. భక్త కనకదాస జయంతి సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక తత్వవేత్తగా, స్వరకర్తగా భక్త కనకదాస సమాజ చైతన్యానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. తన కీర్తనలు, రచనలతో ఆధ్యాత్మిక విలువలు పెంపొందించారని చెప్పారు. ఆ మహానీయుని జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. భగవాన్ కృష్ణుడిని కూడా కనకదాసు తన వైపు తిప్పుకున్నారని కొనియాడారు. అహంకారం ఎప్పుడు తగ్గుతుందో ఆరోజే మోక్షం కల్గుతుందని కనకదాస చెప్పారు. కల్యాణదుర్గంలో రాష్ట్ర స్థాయి భక్త కనకదాస జయంతిలో పాల్గొనడం, భక్త కనకదాస విగ్రహాన్ని ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆర్డీటీకి త్వరలోనే ఎఫ్ సీఆర్‌ఏ రెన్యూవల్ చేయిస్తున్నామని లోకేష్ తెలిపారు. ఆర్డీటీ సంస్థకు మరింత ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాకు తెలుగుదేశం పార్టీకి అండగా ఉంటుందని చెప్పారు. తమ తాత, మామయ్యలను గెలిపించి అసెంబ్లీకి పంపారని గుర్తుచేశారు. ఈ నేలకు తాము ఎంత చేసినా తక్కువే అని చెప్పారు. జీవితాంతం జిల్లా ప్రజలకు రుణపడి ఉంటామన్నారు. కురుబలు ఎప్పటికీ తెలుగుదేశం పార్టీ వైపు ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. కురుబలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 300కోట్లు ఇచ్చామన్నారు. కురుబలకు రాజకీయంగా, ఆర్థికంగా స్వాతంత్రం తెచ్చింది టీడీపీనేనని చెప్పారు. 2019 నుంచి 24 వరకు చీకటి రోజులు చూశామని లోకేష్ విమర్శించారు. అనేక మంది బీసీలపై దాడులు, హత్యలు చేశారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అందుకే బీసీలు 94 శాతం ఓట్లు వేసి టీడీపీని అధికారంలోకి తీసుకొచ్చారని చెప్పారు. భక్త కనకదాసుకు ఆలయాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పూజారులకు గౌరవ వేతనం కూడా ఇస్తామన్నారు. వచ్చే 12నెలల్లో కురుబ భవనాలన్నీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. తనకు సోదర సమానమైన పవన్ కళ్యాణ్ తో మాట్లాడి కురుబలకు న్యాయం చేస్తామన్నారు. మంత్రి సవిత తనతో పోట్లాడుతుంటారని.. బీపీ బిల్లలు వేసుకోమని చెప్పానన్నారు. ఆమె శాఖ పరంగా ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారని చెప్పారు. నవంబర్ 8న భక్త కనకదాసు జయంతిని రాష్ట్ర పండుగగా కూటమి ప్రభుత్వం నిర్వహిస్తోంది. కర్ణాటకలోని బాడా గ్రామంలో 1509లో జన్మించిన భక్త కనకదాస అసలు పేరు తిమ్మప్ప నాయకుడు. చిన్నతనం నుంచే శ్రీకృష్ణుడికి పరమ భక్తుడు. సాధారణ ప్రజలకూ అర్థమయ్యేలా ఎన్నో కీర్తనలు, గ్రంథాలను రాశారు. తన జీవితాన్ని శ్రీ కృష్ణ పరమాత్మ సేవకు వినియోగించారు. ఈయన జయంతిని సెలవుదినంగా ప్రకటించి కర్ణాటక ప్రభుత్వం పండుగలా నిర్వహిస్తుంది. కురబలు ఎక్కువగా ఉన్న మన రాష్ట్రంలోనూ వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు.

# ఇండస్ట్రియల్ హబ్‌గా కుప్పం

## కుప్పం దశ మార్చేలా ప్రాజెక్టులు

## 22,330 మందికి ఉపాధి కల్పన

## ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

## పలు పరిశ్రమలకు శంకుస్థాపన

## వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం

**అమరావతి,**



ముఖ్యమంత్రి చంద్రబాబు తన సొంత నియోజకవర్గమైన కుప్పం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట వేస్తూ, ఒకే రోజు ఏకంగా ఏడు భారీ పరిశ్రమలకు వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. రూ.2,203 కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చే ఈ పరిశ్రమల కోసం 241 ఎకరాల స్థలం కేటాయించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 22,330 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఒకప్పుడు అత్యంత వెనుకబడిన ప్రాంతంగా ఉన్న కుప్పాన్ని పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు కానున్న ఈ ఏడు సంస్థల్లో దేశంలోని దిగ్గజ కంపెనీలు ఉన్నాయి. ఆదిత్య బిర్లా గ్రూప్‌కు చెందిన హిందాల్కో సంస్థ రూ.586 కోట్లతో మొబైల్, ల్యాప్‌టాప్ వంటి టెక్ పరికరాల విడిభాగాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. శ్రీజా డైరీ రూ.290 కోట్లతో సమీకృత డెయిరీ, పశువుల మేత ప్లాంటును, ఏస్ ఇంటర్నేషనల్ సంస్థ రూ.525 కోట్లతో గ్రీన్ ఫీల్డ్ డెయిరీ ఉత్పత్తుల కాంప్లెక్స్‌ను, ఎస్వీఎఫ్ సోయా రూ.373 కోట్లతో వంట నూనెల తయారీ యూనిట్‌ను స్థాపించనున్నాయి. వీటితో పాటు మదర్ డైరీ రూ.260 కోట్లతో పండ్ల రసాల యూనిట్‌ను, ఇ-రాయిస్ ఈవీ రూ.200 కోట్లతో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కేంద్రాన్ని, అలీప్ సంస్థ రూ.27 కోట్లతో మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక పార్కును అభివృద్ధి చేయనుంది. ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు పూర్తి సహకారం అందిస్తున్నామని తెలిపారు. సింగిల్ విండో విధానం ద్వారా పరిశ్రమలకు త్వరితగతిన అనుమతులు ఇస్తున్నామని, భవిష్యత్తులో స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, ఏరో స్పేస్ సిటీలను ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు కూడలిగా ఉన్న కుప్పం భౌగోళిక ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. ఈ పరిశ్రమల రాకతో కేవలం యువతకు ఉద్యోగాలే కాకుండా, స్థానిక రైతులు, మహిళలకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరనుంది. శ్రీజా డెయిరీ రోజుకు నాలుగు లక్షల లీటర్ల పాలను, మదర్ డైరీ పండ్లను, ఎస్వీఎఫ్ సోయా స్థానిక పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తాయని, దీనివల్ల పాడి, వ్యవసాయ రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని సీఎం తెలిపారు. ప్రత్యేకంగా మహిళల కోసం అలీప్ సంస్థ నిర్మిస్తున్న 'మహిళా శక్తి భవన్' ద్వారా 4,000 మందికి ఉపాధి, శిక్షణ లభిస్తాయని చెప్పారు. ఈ ఏడాదిలో డ్వాక్రా, మెప్మా సంఘాల నుంచి లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. "వన్ ఫ్యామ్లీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్, వన్ ఫ్యామ్లీ-వన్ ఏఐ నిపుణుడు అనే పాలసీలతో చరిత్రను తిరగరాస్తాం" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ ఏడు కంపెనీలే కాకుండా త్వరలోనే రూ.6,339 కోట్ల పెట్టుబడితో మరో 8 సంస్థలు కుప్పానికి రానున్నాయని, వాటి ద్వారా అదనంగా 43 వేల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని చంద్రబాబు శుభవార్త చెప్పారు. దీంతో బ్యాటరీ టెక్నాలజీ, మెడికల్ డివైసెస్, ఫుడ్ లాజిస్టిక్స్ వంటి రంగాల్లో కుప్పం కీలక కేంద్రంగా మారనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కరవును దూరం చేసేందుకు 700 కిలోమీటర్ల దూరం నుంచి హంద్రీ-నీవా జలాలను కుప్పానికి తీసుకొచ్చామని, దీంతో తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలకు నీటి కొరత ఉండదని హామీ ఇచ్చారు. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ, సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని ఆయన పునరుద్ఘాటించారు.

# ఎమ్మెల్యేలు సరిగ్గా పనిచేయడం లేదు

## 48 మంది ఎమ్మెల్యేలలో నిర్లక్ష్యం

## ప్రభుత్వ కార్యక్రమాల పట్ల తీవ్ర అశ్రద్ధ

## వికపోవడంతో నోటీసులు జారీ చేస్తాం


## పెన్షన్ల పంపిణీకీ దూరం ఉంటున్నారు

## పనితీరు మారకపోతే పక్కనపెట్టేస్తాం

## ఎమ్మెల్యేలపై సీఎం చంద్రబాబు సీరియస్

**అమరావతి,**

టీడీపీ ఎమ్మెల్యేల్లో 48 మంది పూర్తిగా దారి తప్పారని చంద్రబాబునాయుడు గుర్తించారు. ఎన్నిసార్లు చెప్పిన వికపోవడంతో నోటీసులు జారీ చేయాలని నిర్ణయించుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనకపోవడం, ప్రవర్తనలో లోపాలు ఉన్న 48 మంది ఎమ్మెల్యేలకు వెంటనే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. తీరు మారకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశమైన సీఎం, పెన్షన్ల పంపిణీ, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత వంటి కార్యక్రమాలపై సమీక్షించారు. ప్రజల సమస్యలను పరిష్కారానికి ఎమ్మెల్యేలు ఎంత మంది అందుబాటులో ఉంటున్నారో తెలుసుకున్నారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు కాల పరిమితి తీరిపోయే వరకూ పంపిణీ చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పెన్షన్ల పంపిణీ, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసే కార్యక్రమాల్లో 48 మంది ఎమ్మెల్యేలు పాల్గొనకపోవడం సీఎం దృష్టికి వచ్చింది. బ్యాక్ ఆఫీసు, ప్రోగ్రాం కమిటీకి ఆదేశాలు జారీ చేస్తూ, ఆ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చి వివరణ కోరాలని సూచించారు. వివరణ సంతృప్తికరంగా లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేదల సేవలో భాగంగా పెన్షన్ల పంపిణీలో మంత్రులు, ఎమ్మెల్యేలు తప్పకుండా పాల్గొనాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని, కార్యకర్తలు, ప్రజలతో మాట్లాడాలని సూచించారు. టీడీపీ కార్యకర్తలకు ఇన్సురెన్స్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో కూడా ఎమ్మెల్యేలు తప్పకుండా పాల్గొనాలి. పనిచేసిన వారందర్నీ కలుపుకుని వెళ్లాలన్నారు. ప్రతి శుక్రవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయాల్లో జరిగే ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాల్గొనాలి. పాల్గొనకపోతే పార్టీ కేంద్ర కార్యాలయం వివరణ తీసుకోవాలి ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు గతంలో కంటే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పేదలకు ఎన్నోకష్టాల్లో ఉంటే సీఎంఆర్‌ఎఫ్ కు దరఖాస్తు చేసుకుంటారు. వారికి మంజూరు అయిన డబ్బులు కూడా ఇవ్వడానికి ఎమ్మెల్యేలకు తీరిక లేకపోతే ఇక వారికి ప్రజా సేవ చేయడానికి అర్హత ఏముంటుందన్న ప్రశ్నలు వస్తున్నాయి. సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులకు మూడు నెలల పరిమితి ఉంటుంది. ఇష్యూ చేసిన తేదీ నుంచి మూడు నెలల పాటు చెక్కులు పంపిణీ చేయకపోవడం వల్ల అవి తిరిగి వస్తున్నాయి . కొత్తగా చెక్కులు జారీ చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఇది సీఎంను అసహనానికి గురి చేసింది. ఇప్పటి వరకూ చూశామని ఇక పనితీరు మార్చుకోకపోతే పక్కన పెట్టాలని నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# ప్రభుత్వ సంక్షోభ హాస్టళ్లు !

సంక్షేమ హాస్టళ్లు సంక్షోభ హాస్టళ్లుగా మారుతున్నాయి. ఉమ్మడి ఎపిలో ఎలా ఉన్నాయో..ఇప్పుడు రాష్ట్రం రెండుగా విడిపోయాక కూడా వాటి స్వరూప స్వభావాలు మారలేదు. పిల్లల పేరు చెప్పి కొందరు పందికొక్కుల్లా బలుస్తున్నారు. వార్డెన్లు భయం లేకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. అన్నింటికి మించి సంక్షేమ హాస్టళ్లో కాలం వెళ్లదీస్తున్న పిల్లల జీవితం ఎప్పుడు ఎలా ముగుస్తుందో తెలియడం లేదు. అమ్మాయిలైతే బలవంతపు అత్యాచారాలకు గురవుతున్నారు. ఇదో రకమైన హింస. ఇందులో బయటకు వచ్చే కేసులు కొన్ని మాత్రమే. ఇకపోతే సరైన ఆహారం ఉండదు. సరైన వసతి ఉండదు. నాసిరకం ఆహారంతో వాంతులు విరేచనాలతో ఆస్పత్రి పాలు కావడం, అందులో కొందరు మృత్యువాత పడడం... తలంలిదండరులకు క్షోభ మిగల్చడం అన్నది భేతాళ కథల్లా సాగుతున్నాయి. ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ హాస్టళ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. హాస్టళ్లలో ఉండే పిల్లలను పురుగుల్లా చూస్తున్నారు. ఎలాంటి రక్షణ ఉండదు. తల్లిదండ్రులకు దూరంగా ఇక్కడ ఇంత తింటూ చదువుకుందామని వచ్చిన వారికి ఈసడింపులు షరామామూలే. పదేళ్లపాటు తెలంగాణను ఏలిన కల్వకుంట్ల కుటుంబం హాస్టళ్లను బాగుచేసివుంటే ఇవాళ జరుగుతున్న ఘోరాలు జరిగేవా అన్నది ఆలోచించాలి. కానీ వారు చేయలేదు. తమ కాలంలో జరిగిన అనర్థాలే ఇప్పుడూ జరుగుతున్నాయి. వీటిపై గగ్గోలు పెట్టడం కెటిఆర్, హరీష్ రావులకు అలవాటయ్యింది. ఎపిలో కూడా ఇంతకుమించి ఘటనలు జరుగుతున్నాయి. ఘనత వహించిన చంద్రబాబు పాలనలో కూడా వాటి రూపురేఖలు ఏమీ మారడం లేదు. విద్య,వైద్యానికి పెద్దపీట వేయాల్సిన పాలకులు ఓట్ బ్యాంకు రాజకీయాలతో డబ్బు వృధా చేసే పథకాలను మోస్తున్నారు. ఇకపోతే అక్షరాస్యతలో బాగా వెనుకబడిన గిరిజన ప్రాంతాలపై ప్రేమ ఒలకబోయడమే తప్ప నిజంగానే వారిని ఉద్ధరించే కార్యక్రమాలు శూన్యం. గిరిజన ప్రాంతాలలో అక్షరాస్యత పెంచాలనే లక్ష్యంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 46 గిరిజనులకు విద్య, రక్షణ, సదుపాయాలు కల్పించాలని పేర్కొంది.గిరిజనుల విద్య కోసం చేసిన కృషిని కూడా విస్మరించలేం. అయితే అది వారు స్వయంగా ఎదిగేలా చేయడం లేదన్నదే బాధ. ఈ క్రమంలో ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, గిరిజన ప్రాథమిక పాఠశాలలను నెలకొల్పి అక్షరాస్యత కోసం, విద్య కోసం సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేసినా వాటిని బలోపేతం చేయడంలో ఇరు రాష్ట్రాల్లో పాలకులు విఫలం అయ్యారు. గిరిజనులకు విద్యను అందిస్తూ వారిని అన్ని విధాలా సామాజిక వివక్షతల నుంచి, దోపిడీ నుంచి రక్షించాల్సి ఉంది. వారు చదువుసంధ్య లేక కేవలం గూడేలకు పరిమితం కాకుండా చూడాలి. షెడ్యూలు ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాలను ప్రకటించింది. అయినా వారి గూడాలకు నేటికీ రోడ్డు లేదు. సరైన చదువు, వైద్యం లేదు. అనేక ప్రాంతాల్లో గిరిజన హాస్టళ్లు బాలారిష్టాలతోనే కొనసాగుతున్నాయని ఆయా ప్రాంతాలలో జరిగే సంఘటనలే నిరూపిస్తున్నాయి. నేటికీ గిరిజన ప్రాంతాల నుండి ఆసుపత్రికి రావాలంటే డోలీ మోతలు చూస్తున్నాము. ఆ ప్రాంత ప్రజలపైగల బాధ్యతా రాహిత్యం విద్యార్థులు చదువుకునే సంక్షేమ గృహాలపై కూడా కొనసాగుతున్నది. ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్నపుడు తాగునీరు లేక, మరుగుదొడ్లు లేక రోగాల బారినపడి చనిపోయిన ఘటనలను చూశాం. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లోని కురుపాం మండల కేంద్రంలోగల గురుకుల బాలికల పాఠశాలలో జరిగిన ఘటన వరకు రాష్ట్రాన్ని కుదిపివేశాయి. ఇద్దరు బాలికలు చనిపోవడం, 138 మంది పచ్చ కామెర్లతో ఆసుపత్రిపాలు కావడం సంక్షేమ హాస్టళ్ల పట్ల ప్రభుత్వం ఏ విధంగా శ్రద్ధ చూపుతున్నదో అర్థం అవుతున్నది. క్వాంటం కంప్యూటింగ్, ఎఐ అంటూ నిత్యం వ్లలె వేస్తున్న చంద్రబాబు ఈ హాస్టల్ల దుస్తజతి తెలుసుకోక పోవడం దురదృష్టకరం. తెలుగు రాష్ట్రాల్లో గిరిజన సంక్షేమ హాస్టళ్లు ఎక్కువ శాతం సౌకర్యాల లేమితో కునారిల్లుతున్నాయి. బాలికల వసతి గృహాలు సరిపడినన్ని లేక అత్యంత దయనీయంగా వున్నాయి.. పాఠాలు బోధించడానికి, బాలికలు నిద్రించడానికి, సామానులు భద్రపరచడానికి, భోజనాలు చేయడానికి అన్నింటికీ ఒకటి రెండు గదులతో సరిపుచ్చు తున్నారు. చెప్పాలంటే గురుకులాలు సమస్యల నిలయాలుగా ఉన్నాయి. బాలికల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ఒక్క ఆశ్రమ పాఠశాలలో కూడా ఎ.ఎన్.ఎం లు లేరు. గురుకులాలలో ఉన్నప్పటికీ తగిన మందులు, సౌకర్యాలు కల్పించడంలేదు. ఆశ్రమ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు భయపడి ఆందోళనతో స్వంత డబ్బులతో ఆరోగ్య కార్యకర్తలను నియమించుకుంటున్నారు. రెండు దశాబ్దాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. పాలకులు మారుతున్నా పరిస్థితులు మారడం లేదు. వార్డెన్ పోస్టులు శాశ్వత ప్రాతిపదికన లేనందున ఉపాధ్యాయులే ఒకవైపు బోధన మరోవైపు, పిల్లల బాధ్యత చూడటం జరుగుతోంది. వైద్యపరమైన సేవలు అందించడానికి సిబ్బంది లోపం కూడా విద్యార్థులకు శాపంగా మారుతున్నది. విద్యార్థుల అనారోగ్య పరిస్థితులలో మెడికల్ ఖర్చు భరించేందుకు తగిన నిధిని సమకూర్చడం లేదు. సంక్షేమ హాస్టళ్లలో చిన్నపిల్లల ఆలనా పాలన చూసే ఆయాలు గాని, టీచర్లు గాని ప్రత్యేకంగా లేకపోవడం వలన పిల్లల మానసిక, శారీరక, విద్యాపరమైన అంశాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నిజానికి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలను ఏర్పాటు చేసి గుణాత్మక విద్యను అందివ్వాలి. తద్వారా సామాజికంగా, ఆర్థికంగా మెరుగైన జీవన పరిస్థితులు కల్పించాలి. బడులు లేక, ఉన్నాబడుల్లో టీచర్లు లేక, అసంపూర్ణ భవనాలు, చాలీచాలని వసతులు ఎక్కడికి వెళ్లినా దర్శనమిస్తున్నాయి.



తాగునీటిది పెద్ద సమస్య. గిరిజన సంక్షేమ హాస్టళ్లలో పిల్లలు రోగాల బారినపడి పిట్టల్లా రాలిపోవడం చూస్తున్నాం. విషజ్వరాలు, పచ్చకామెర్లు, మలేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే ఈ రంగంపై నిర్లక్ష్యం తగదు. ఎప్పటికప్పుడు మౌలిక వసతులు కల్పించే విషయంలో బ్జడెట్ కేటాయింపులు పెంచాలి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా, మరమ్మతులు, వైద్య అవసరాలు, పోషక విలువలతో కూడిన మెనూ చార్జీల పెంపునకు నిధులు వుండాలి. పేదరికం, దోపిడీ, వెనుకబాటుతనం నుండి విముక్తి జరగాలంటే హాస్టళ్లను బలోపేతం చేయాలి. పాఠశాలలకు ఆయా హాస్టళ్లను అటాచ్ చేయాలి. ప్రత్యేకించి నిధులు పెంచాలి. అప్పుడే పేదలకు విద్య అందుతుంది.

# వైఎస్ వివేకానంద హత్య కేసులో కీలక మలుపు

## ఇద్దరు పోలీసు అధికారులపై కేసు నమోదు

**అమరావతి,**

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో మరో కీలక మలుపు చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించి వివేకా కుమార్తె వైఎస్ సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర రెడ్డి, సీబీఐ ఎస్పీ రామ్ సింగ్‌లపై తప్పుడు కేసులు నమోదు చేయించిన ఇద్దరు పోలీసు అధికారులపై పులివెందుల పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ రామకృష్ణారెడ్డి, విశ్రాంత ఏఎస్పీ రాజేశ్వర్ రెడ్డి అనే ఇద్దరిపై ఈ కేసులు నమోదయ్యాయి. సుప్రీంకోర్టు తాజా తీర్పు వెలువడిన తర్వాత కేసులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వివేకా హత్య కేసు 2019 మార్చి 15న కడప జిల్లా పులివెందులలో జరిగింది. ఆయన ఇంట్లోనే మృతదేహం కనుగొన్నారు. ఈ కేసు సీబీఐకి హైకోర్టు అప్పగించింది. విచారణ సమయంలో ఆరోపణలు, సాక్షుల మరణాలు, తప్పుడు కేసులు చాలా వచ్చాయి 2019-2021 మధ్య, వివేకా హత్య కేసు దర్యాప్తులో సునీత, ఆమె భర్త రాజశేఖర్ రెడ్డి, సీబీఐ ఎస్పీ రామ్ సింగ్‌లపై రాజేశ్వర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి నేతృత్వంలో తప్పుడు కేసులు నమోదు చేయించారని ఆరోపణ. ఇవి కేసు దర్యాప్తును ప్రభావితం చేయడానికి, సాక్షులను బెదిరించడానికి ఉద్దేశించినవని ఆరోపణలు ఉన్నాయి. సుప్రీంకోర్టు ఇటీవల వివేకా కేసు ట్రాన్స్‌ఫర్, మరిన్ని దర్యాప్తులపై తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు ఆధారంగా, తప్పుడు కేసులపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మొత్తం 22 మంది సాక్షుల విచారణలో ఈ అధికారుల పాత్ర బయటపడినట్లుగా తెలుస్తోంది. పులివెందుల పోలీసులు శుక్రవారం ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఇది %ఖూజ% సెక్షన్లు 211 (తప్పుడు కేసు నమోదు), 506 (బెదిరింపు) కింద కేసు రిజిస్టర్ చేశారు. సీబీఐ వివేకా హత్య కేసులో దూకుడుగా దర్యాప్తు చేస్తున్న సమయంలో వివేకా పీఏ కృష్ణారెడ్డి తనను వైఎస్ సునీత, ఆమె భర్త రాజశేఖర్ రెడ్డితోపాటు సీబీఐ ఎస్పీ రాంసింగ్ బెదిరిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాంసింగ్ తప్పుడు వాంగ్మూలం ఇవ్వాలని అవినాష్ రెడ్డికి వ్యతిరేకంగా చెప్పాలని బెదిరించారని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ సంచలనాత్మకమైన హత్య కేసులో దర్యాప్తు జరుపుతున్న అధికారిపై నేరుగా రివర్స్ లో పోలీసులు కేసు పెట్టడం అప్పట్లోనే కలకలం రేపింది. అప్పటి ప్రభుత్వం వివేకా కేసులోసీబీఐపై ఆరోపణలు చేస్తూ రావడతో .. విచారణకు సహకరించలేదని తేలిపోయింది. సీబీఐని తప్పు పట్టడానికి, విచారణను స్లో చేయడానికి ఈ తప్పుడు కేసుల వ్యూహం ఎంచుకున్నారని అనుమానిస్తున్నారు. సుప్రీంకోర్టు ఆ కేసులన్నీక్వాష్ చేసి.. తప్పుడు కేసులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో ఇప్పుడు కేసులు నమోదు చేశారు. ఒకరు ఇప్పటికే రిటైర్ అయ్యారు. మరొకరు సర్వీసులో ఉన్నారు. ఆ అధికారిని సస్పెండ్ చేసే అవకాశం ఉంది.

# బీహార్‌లో ఎన్టీఏ తరపున నారా లోకేష్ ప్రచారం

**అమరావతి,**

ఆంధ్రప్రదేశ్ ఐటీ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ అభ్యర్థుల తరపున ప్రచారం చేయబోతున్నారు. బీహార్‌లో 243 నియోజకవర్గాలకు రెండు దశల్లో జరుగుతున్న ఎన్నికల్లో మొదటి దశ నవంబర్ 6న పూర్తి అయ్యింది. రెండో దశలో 122 నియోజకవర్గాలకు పోలింగ్ నవంబర్ 11న జరగనుంది. తొమ్మిదో తేదీ అంటే ఆదివారం సాయంత్రం ప్రచారం ముగుస్తుంది. ఈ సమయంలో నారా లోకేష్ చివరి రెండు రోజులు బీహార్ లో ప్రచారంచేయాలని నిర్ణయించారు. శనివారం సాయంత్రం రెండు సమావేశాల్లో పాల్గొంటారు. ఆదివారం పట్నాలో ఎన్‌డీఏ అభ్యర్థులకు మద్దతుగా బహిరంగసభలో ప్రసంగిస్తారు. ఎన్డీఏ పార్టీలు యువతకు ఉద్యోగాల కల్పన, ఉపాధి విషయంలో ఎక్కువ భరోసా ఇవ్వాలనుకుంటున్నారు. యువకులు తాము వలస పోకుండా బీహార్ లోనే ఉండేలా ఉద్యోగాలు చేసుకోవాలనుకుంటున్నారు. ఏపీకి పరిశ్రమలు తీసుకు వచ్చేందుకు నారా లోకేష్ చేస్తున్న కృషి, గూగుల్ డేటా సెంటర్ విషయంలో ఆయనకు వచ్చిన ప్రచారం బీహార్ యూత్ లో నమ్మకం కలిగించిందని అంటున్నారు. అందుకే నారా లోకేష్ తో.. ఎన్డీఏ ఉద్యోగ, ఉపాధి అవకాశాలను ఘనంగా సృష్టిస్తుందని చెప్పించాలని భావించినట్లుగా తెలుస్తోంది. నిజానికి ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకు ఉత్తరాదిన మంచి గుర్తింపు ఉంది. సుదీర్ఘ కాలంగా రాజకీయాల్లో ఉండటమే కాకుండా.. అభివృద్ధి రాజకీయాలకు పెద్దపీట వేస్తారని హిందీ ప్రజల్లో చంద్రబాబుకు పేరుంది. అందుకే గతంలో పలు చోట్ల ఇతర పార్టీల కోసం ప్రచారం చేశారు కూడా. అదే సమయంలో పవన్ కల్యాణ్‌కూ బీహార్ ప్రజల్లో గుర్తింపు ఉంది. సినీ హీరోగా ఆయన సినిమాలో భోజుపురిలోకి డబ్బింగ్ అయ్యాయి.హిందీలోకీ డబ్బింగ్ అయ్యాయి. ఆయన వచ్చినా జన సమీకరణ బాగానే జరుగుతుంది. అయితే ఎన్డీఏ పెద్దలు జన సమీకరణ కన్నా.. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకా లోకేష్ ప్రజలకు వివరించే అవకాశం ఉంది. బీహార్‌లో యువతకు స్థానికంగా ఉద్యోగాలు ఇవ్వడంపై దృష్టి పె ఎన్‌డీఏ ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు అమలు చేస్తుందని ప్రచారం చేసే అవకాశం ఉంది. కేంద్ర-రాష్ట్ర డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు అభివృద్ధికి ఎలా దోహదపడతాయో వివరిస్తారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ఎన్‌డీఏ బలపడితే బీహార్‌కు మరిన్ని ప్రయోజనాలు వస్తాయని హైలైట్ చేస్తారు. ఎన్‌డీఏ ప్రతిపాదించిన స్కిల్స్ సెన్సస్ ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని, బీహార్ యువతకు ప్రత్యేక ప్రయోజనాలు ఉన్నాయని ప్రచారం చేసే అవకాశం ఉంది.

# కాకినాడ జిల్లాలో కారు బీభత్సం

## ముగ్గురు మృతి, చిన్నారులకు గాయాలు

**కాకినాడ,**

కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం వద్ద 216 నెంబర్ జాతీయ రహదారిపై శనివారం ఉదయం కారు బీభత్సాన్ని సృష్టించింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, ఏడుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అన్నవరం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపునకు వెళ్తున్న పెళ్లి బృందం కారు టైరు ఫంక్చర్ అయ్యింది. దీంతో అదుపుతప్పిన ఆ కారు హైవే బస్ స్టాప్ వద్ద బస్సు కోసం చూస్తున్న వారిపైకి దూసుకుపోయింది. అంతటితో ఆగకుండా హైవే పక్కన బైకును, మూడు చక్రాల రిక్షాను ఢీకొట్టింది. దీంతో సోమవరం గ్రామానికి చెందిన మోర్త ఆనందరావు (60) మోర్త కొండయ్య (30), ఏలేశ్వరం గ్రామానికి చెందిన బొప్పాయి కాయలు అమ్ముకునే కాకాడ రాజు (60) మృతి చెందారు. అలాగే బస్సు కోసం వేచి చూస్తున్న కొండ్రపు చైతన్య, చీపురుపల్లి స్రవంతి, బత్తిన భద్రరావు తీవ్రగాయాలు కాగా, మరో నలుగురుకి గాయాలయ్యాయి.ఘటన స్థలానికి ఎంఎల్ఏ జ్యోతుల నెహ్రూ చేరుకుని క్షతగాత్రులను ప్రత్తిపాడు ఆసుపత్రికి పంపించారు. మెరుగైన వైద్యం అందించాలని ఎంఎల్ఏ అధికారులను ఆదేశించారు.

# రియాజ్ ఎన్‌కౌంటర్ ఫేక్

## రియాజ్‌ది ఎన్‌కౌంటర్ కాదు లాకప్‌డెత్

## పోలీసులే రియాజ్ కొట్టి చంపేశారు

## ఎన్‌కౌంటర్‌గా కట్టుకథలు అల్లుతున్నారు

## ఘటనపై సమగ్ర విచారణ జరిపించండి

## పోలీసులపై రియాజ్ ఫ్యామిలీ ఆరోపణలు

**హైదరాబాద్,**

తెలంగాణలో సంచలనం సృష్టించిన రియాజ్ ఎన్‌కౌంటర్ కేసు మరో మలుపు తిరిగింది. ఇది కచ్చితంగా ఫేక్ ఎన్‌కౌంటర్ అని రియాజ్ ఫ్యామిలీ ఆరోపిస్తోంది. ఆయన్ని కాల్చేసి తర్వాత ఎన్‌కౌంటర్‌గా కట్టుకథలు అల్లుతున్నారని విమర్శిస్తున్నారు. ప్రమోద్‌ను కూడా హత్య చేసింది రియాజ్ కాదని అనుమానం వ్యక్తం చేశారు. కానిస్టేబుల్ ప్రమోద్ హత్యపై లోతుగా విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. కానిస్టేబుల్ ప్రమోద్‌ను నిజంగా హత్య చేసిన వాడిని అరెస్ట్ చేసి.. ప్రమోద్ కుటుంబానికి న్యాయం చేయాలని అంటున్నారు. రియాజ్ కుటుంబంపై ఇప్పటికి వేధింపులు జరుగుతున్నాయని... ఆ కుటుంబంలోని చిన్న పిల్లలను రోడ్ల మీద వేధిస్తున్నారని... దీనిపై వాళ్ళకు న్యాయం జరగాలి అభ్యర్థిస్తున్నారు. మొత్తం కేసులో ఆసిఫ్ పాత్ర ఉందని రియాజ్ కుటుంబ సభ్యులు అనుమాన పడుతున్నారు. అతనిపై లోతుగా విచారణ చేయాలన్నారు. ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌లో భాగమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పోలీసులకు తాము వ్యతిరేకం కాదని ఈ ఎన్‌కౌంటర్‌ను కొందరు పోలీసులు కుట్రపూరితంగా చేశారని మండిపడుతున్నారు. సీబీఐతో విచారణ జరిపించాలని తెలంగాణ ప్రభుత్వానికి అభ్యర్థించామని వారు వినకపోయే సరికి జాతీయ స్థాయిలో పోరాడుతున్నామని అన్నారు. మీడియాతో మాట్లాడిన సందర్భంగా రియాజ్ తల్లి భావోద్వేగానికి గురయ్యారు. "నా కొడుకు మెడ విరిచేశారు. పొట్టలో నుంచి పేగులు బయటకు వచ్చాయి. దారుణంగా చంపేశారు. నా కొడుకు నిజంగా హంతకుడు అయితే ఆ ఆధారాలు చూపించండి. నాకు మనశ్శాంతిగా ఉంటుంది. ఏ తల్లికైన కొడుకు కొడుకేగా.. నా కొడుకుకు జరిగినట్లు ఎవరికి జరగకూడదు. నా కొడుకు చనిపోయినప్పుడు, అంతిమ యాత్రలో తీసుకెళ్తుంటే పటాకులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. నా కొడుకు అంతిమ యాత్రలో పోలీసులు వచ్చి ఎక్కడా ఆగనివ్వకుండా పంపించేశారు. శ్మశాన వాటికలో అంత్యక్రియలు చేస్తుంటే, ఇక్కడ చేయకూడదు అని వెళ్లగొట్టారు. ఎవరి కొడుకుకైనా ఇలాంటి పరిస్థితి రాకూడదు." అని కంటతడి పెట్టుకున్నారు. రియాజ్ ఎన్‌కౌంటర్ ఘటనపై సోషల్ యాక్టివిస్ట్ మాట్లాడుతూ... రియాజ్ ఒక పోలీస్ అధికారిని నిజంగా చంపితే అతను నిజామాబాద్‌లో ఉంటాడా.. వాళ్ళ ఫ్యామిలీని తీసుకొని పారిపోడా? పోలీసులు తన కుటుంబాన్ని హింసిస్తున్నారని రియాజ్ తానే స్వయంగా లొంగిపోయాడు. లొంగిపోయిన తరువాత పోలీసులు అతనిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి, చిత్రహింసలు పెట్టారు. అతను కస్టడీలోనే చనిపోయాడు. రియాజ్ చనిపోయాక అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి, 407 ఖైదీల రూంలో పెట్టారు, 4వ ఫ్లోర్‌లో ఉన్న రోగులు అందరిని ఖాళీ చేయించారు. చేతులు కట్టేసి ఉంటాయి.. రియాజ్ మెడ విరిగిపోయింది, శరీరం మీద తీవ్ర గాయాలు ఉన్నాయి. అలాంటి మనిషి పోలీసులను ఎదిరించి గన్ లాక్కుంటాడా?. అలా చెప్పి, పోలీసుల ఉన్నతాధికారుల సమక్షంలో మృతదేహానికి మూడు బుల్లెట్లను కాల్చారు. రియాజ్ కస్టడీలో బతికే ఉంటే ఆసుపత్రికి తీసుకెళ్లినప్పుడు నడుచుకుంటునో, వీల్ చైర్‌లోనో తీసుకెళ్తారు కదా.. ఆ సీసీటీవీ ఫుటేజ్ చూపించడం లేదు. మృతదేహం చూశాక అతని మెడ ఊగిపోతోంది, ముక్కు విరిగిపోయింది, పెదాలు పగిలిపోయాయి. దీనిపై సీబీఐ ఎంక్వేరీ వేసి నిజానిజాలు బయటకు చెప్పాలి. అని అన్నారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో క్వాంటమ్ కంప్యూటింగ్

## రూ.1,772 కోట్లతో మైక్రోసాఫ్ట్ ఏర్పాటు!

## 1,200 క్యూబిట్ సామర్థ్యముతో నిర్మాణం

## 50 ఎకరాలు కేటాయించిన సీఆర్డీఏ

## జనవరి నాటికి కార్యకలాపాలకు సిద్ధం!?

**అమరావతి,**

ప్రముఖ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో క్వాంటమ్ కంప్యూటింగ్ స్థాపనకు శ్రీకారం చుట్టింది. ఏకంగా రూ.1,772.08 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టేందుకు ప్రతిపాదించింది. ఇందులో భాగంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీలో 1,200 క్యూబిట్ సామర్థ్యమున్న (50 లాజికల్ క్యూబిట్స్) భారీ క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయనుంది. క్వాంటం వ్యాలీ భవనానికి ఆనుకుని 4 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ప్రత్యేక భవనంలో మైక్రోసాఫ్ట్ ఈ సౌకర్యాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి, ఈ భవనానికి క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ 50 ఎకరాలు కేటాయించింది. ప్రభుత్వ ప్రకటన మేరకు క్వాంటం వ్యాలీ టెక్ పార్క్ జనవరి 1, 2026 నాటికి కార్యకలాపాలకు సిద్ధంగా ఉంటుంది. ఇది దేశీయ, విదేశీ క్లయింట్‌లకు సేవలందించడానికి దశలవారీగా 90,000 చదరపు అడుగుల అంతర్నిర్మిత ప్రాంతంలో సూపర్ కంప్యూటర్‌లను ఉంచనుంది. 133 క్యూబిట్ సామర్థ్యంతో క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటుకు ఇప్పటికే ఐబీఎం సంస్థ ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది.'అమరావతి క్వాంటం వ్యాలీ డిక్లరేషన్'ను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూపొందించింది. ఇది జనవరి 1, 2029 నాటికి ఈ రంగంలో 1 బిలియన్ డాలర్ల పెట్టుబడులను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. క్వాంటం టెక్నాలజీలను అభివృద్ధి చేయడం, సిలికాన్ వ్యాలీ తరహాలో శక్తివంతమైన ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థను సృష్టించడంపై దృష్టి సారించడానికి అమరావతిని దేశంలోని మొట్టమొదటి క్వాంటం వ్యాలీగా మార్చడం ఈ ప్రకటన లక్ష్యం. మరోవైపు క్వాంటమ్ వ్యాలీలో పెట్టుబడులు పెట్టేందుకు మరిన్ని సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. జపాన్‌కు చెందిన ఫుజిసు 64 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇనీషియేటివ్ కింద అందించే నిధులకు మరో 50 శాతం వెచ్చించి ఫ్యాబ్రికేషన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తెచ్చింది. క్వాంటమ్ వ్యాలీలో పరిశోధనలకు దశల వారీగా 90 లక్షల చదరపు అడుగుల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని ప్రభుత్వం యోచిస్తుంది. ప్రస్తుతం నిర్మించనున్న ఐకానిక్ టవర్ వల్ల 40 వేల చదరపు అడుగులు అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు దేశంలోనే మొట్టమొదటి ఫుల్ స్టాక్ క్వాంటం వ్యాలీ టెక్ పార్క్‌ను స్థాపించడానికి ప్రభుత్వంతో సహకరించడానికి ఐబీఎం ఇప్పటికే తేసీఎస్, ఎల్ఎన్టీ లతో అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. ఇటీవల జరిగిన క్వాంటం వ్యాలీ వర్క్‌షాప్‌లో ఐబీఎం దాని తాజా 156-క్విట్ హెూరాన్ ప్రాసెసర్ మోడల్‌ను కూడా ప్రదర్శించింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న క్వాంటం సైన్స్, దాని అనువర్తనాలపై అవగాహన కల్పించడానికి ఐక్యరాజ్యసమితి ఇప్పటికే 2025 ను అంతర్జాతీయ క్వాంటం సైన్స్ అండ్ టెక్నాలజీ సంవత్సరంగా ప్రకటించింది. క్వాంటం అనేది గేమ్-ఛేంజింగ్ టెక్నాలజీ. ఇది 2030 నాటికి వేగంగా అభివృద్ధి చెందనున్నట్లు నిపుణులు భావిస్తున్నారు.

# వ్యోమగామి శిక్షణకు ఎంపికైన నిడదవోలు యువతి

## 2029లో అంతరిక్ష యాత్రకు సిద్ధమవుతున్న కైవల్య

## ఫ్లోరిడాలో నాలుగేళ్ల పాటు కొనసాగనున్న శిక్షణ

**అమరావతి,**

ఏపీకి చెందిన ఓ యువతి అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. అంతరిక్షంలోకి అడుగుపెట్టే తన కలను సాకారం చేసుకునే దిశగా కీలక మైలురాయిని దాటింది. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన కుంచల కైవల్య రెడ్డి, అమెరికాలో నిర్వహించే ప్రతిష్ఠాత్మక వ్యోమగామి శిక్షణకు ఎంపికైంది. ఫ్లోరిడాలోని 'టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్' ఆధ్వర్యంలో జరిగే ఈ శిక్షణ కోసం ప్రపంచవ్యాప్తంగా 36 దేశాల నుంచి వేలాది మంది పోటీ పడగా, కేవలం 150 మంది మాత్రమే అర్హత సాధించారు. వారిలో కైవల్య రెడ్డి ఒకరిగా నిలవడం విశేషం. ఈ శిక్షణ నాలుగేళ్ల పాటు కొనసాగనుంది. దీనిని విజయవంతంగా పూర్తి చేసిన వారు 2029లో అంతరిక్ష యాత్రకు వెళ్లనున్నారు. ఈ యాత్రలో భాగంగా వ్యోమగాములు భూమి నుంచి 300 కిలోమీటర్ల ఎత్తులో కక్ష్యలో పరిభ్రమించనున్నారు. మొత్తం 5 గంటల పాటు సాగే ఈ మిషన్‌లో సుమారు 3 గంటల పాటు జీరో గ్రావిటీలో గడుపుతారు. కైవల్యకు నాసా మాజీ వ్యోమగామి, 224 రోజులు అంతరిక్షంలో గడిపిన విలియం మెక్‌ఆర్థర్, బ్రెజిల్ తొలి వ్యోమగామి మార్కోస్ పోంటెస్ వంటి ప్రముఖ నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు. కైవల్య రెడ్డి తండ్రి కుంచాల శ్రీనివాసరెడ్డి, నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఆమె తల్లి విజయలక్ష్మి గృహిణి. తనకు చిన్నప్పటి నుంచే అంతరిక్షం, ఖగోళ శాస్త్రంపై ఆసక్తి ఉండేదని కైవల్య తెలిపింది. భవిష్యత్తులో జర్మనీలో ఆస్ట్రోఫిజిక్స్ చదివి ఖగోళ శాస్త్రవేత్త కావాలన్నదే తన లక్ష్యమని పేర్కొంది. 17 ఏళ్లకే ఈ ఘనత సాధించిన కైవల్య, గతంలోనూ తన ప్రతిభను చాటుకుంది. 2023లో నాసా ఆధ్వర్యంలో జరిగిన 'అంతర్జాతీయ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రాం' కు కూడా ఎంపికైంది. ఆ కార్యక్రమంలో భాగంగా ఆమె అమెరికాలోని అలబామాలో 15 రోజుల పాటు శిక్షణ పొందింది. సైన్స్ పట్ల ఆమెకున్న ఆసక్తి, పట్టుదలే ఈ అరుదైన అవకాశాలను అందిస్తున్నాయని పలువురు అభినందిస్తున్నారు.

# స్వాతంత్ర్య పోరాటంలో రణనినాదంగా వందేమాతరం

**అమరావతి,**

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో యావత్ దేశాన్ని ఏకతాటిపై నడిపించిన 'వందేమాతరం' గేయం స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈ చారిత్రక గేయం రచించి శుక్రవారంతో 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ దీనిని ఆలపించాలని ఆయన పిలుపునిచ్చారు. బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గేయం, కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు స్వాతంత్ర్య పోరాటంలో ఒక రణనినాదంలా పనిచేసిందని పవన్ కొనియాడారు. సమరయోధులకు మనోబలాన్ని, దేశ ప్రజలకు ఉద్యమ స్ఫూర్తిని అందించిందని గుర్తుచేశారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# స్పోర్ట్స్



## ఆస్ట్రేలియాపై అత్యధిక వికెట్లు తీసిన బౌలర్

### జస్‌ప్రీత్ బుమ్రాకు అరుదైన ఘనత

టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అరుదైన ఘనత సాధించాడు. టీ20ల్లో ఆస్ట్రేలియాపై అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. నవంబర్ 6న క్వీన్స్‌లాండ్ వేదికగా ఆసీస్‌తో జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో ఓ వికెట్ పడగొట్టడం ద్వారా బుమ్రా ఈ ఘనత





అందుకున్నాడు. ఈ క్రమంలో అతడు పాకిస్తాన్ మాజీ స్పిన్నర్ సయీద్ అజ్మల్ ను అధిగమించాడు.ఆసీస్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌ల్లో అజ్మల్ 11 ఇన్నింగ్స్‌ల్లో 19 వికెట్లు తీశాడు. ఇక బుమ్రా 17 ఇన్నింగ్స్‌ల్లో 20 వికెట్లు సాధించాడు. ఈ జాబితాలో వీరిద్దరి తరువాతి స్థానాల్లో పాక్ ఆటగాడు మహ్మద్ అమీర్, న్యూజిలాండ్ స్పిన్నర్ మిచెల్ సాంట్నర్ ఉన్నారు.ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. భారత బ్యాటర్లలో శుభ్‌మన్ గిల్ (46), అభిషేక్ శర్మ (28), శివమ్ దూబె (22), అక్షర్ పటేల్ (21 నాటౌట్) రాణించారు. ఆసీస్ బౌలర్లలో ఆడమ్ జంపా, నాథన్ ఎల్లిస్‌లు చెరో మూడు వికెట్లు తీశారు. జేవియర్ బార్ట్‌లెట్, మార్కస్ స్టోయినిస్ తలా ఓ వికెట్ సాధించారు.అనంతరం 168 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్ 18.2 ఓవర్లలో 119 పరుగులకు ఆలౌటైంది. ఆసీస్ బ్యాటర్లలో మిచెల్ మార్ష్ (30), మాథ్యూ షార్ట్ (25) లు పర్వాలేనిపించగా.. జోష్ ఇంగ్లిష్ (12), టిమ్ డేవిడ్ (14), జోష్ ఫిలిప్ (10), గ్లెన్ మాక్స్‌వెల్ (2)లు విఫలం అయ్యారు. టీమ్ఇండియా బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ మూడు వికెట్లు, అక్షర్ పటేల్, శివమ్ దూబెలు చెరో రెండు వికెట్లు తీశారు. వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రాలు తలా ఓ వికెట్ పడగొట్టారు.

టీ20ల్లో ఆసీస్ పై అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లు వీరే..

1. జస్‌ప్రీత్ బుమ్రా (భారత్) %-% 20 వికెట్లు (17 ఇన్నింగ్స్‌ల్లో)
2. సయీద్ అజ్మల్ (పాకిస్తాన్) %-% 19 వికెట్లు (11 ఇన్నింగ్స్‌ల్లో)
3. మహ్మద్ అమీర్ (పాకిస్తాన్) %-% 17 వికెట్లు (10 ఇన్నింగ్స్‌ల్లో)
4. మిచెల్ సాంట్నర్ (న్యూజిలాండ్) %-% 17 వికెట్లు (12 ఇన్నింగ్స్‌ల్లో )

## శ్రీచరణికి గ్రూప్-1 ఉద్యోగం, ఇంటి స్థలం

2025 వరల్డ్‌కప్‌లో విజయం సాధించిన జట్టులో ఉంటూ కీలక పాత్ర పోషించిన శ్రీచరణికి ఆంధ్రప్రదేశ్‌లోకి గ్రాండ్ వెల్కం లభించింది. ఆమె ప్రతిభను మెచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ నజరానా ప్రకటించింది. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని మరికొందరు క్రీడాకారులు ఛాంపియన్‌లుగా మారి దేశానికి ఖ్యాతిని తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. గ్రూప్-1 ఉద్యోగం, ఇంటి స్థలం, రెండున్నర కోట్ల నగదు ఇవ్వాలని నిర్ణయించారు. 2025 వరల్డ్‌కప్‌లో విజయం సాధించిన జట్టులో ఉంటూ కీలక పాత్ర పోషించిన శ్రీచరణికి ఆంధ్రప్రదేశ్‌లోకి గ్రాండ్ వెల్కం లభించింది. ఆమె ప్రతిభను మెచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ నజరానా ప్రకటించింది. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని మరికొందరు క్రీడాకారులు ఛాంపియన్‌లుగా మారి దేశానికి ఖ్యాతిని తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. గ్రూప్-1 ఉద్యోగం, ఇంటి స్థలం, రెండున్నర కోట్ల నగదు ఇవ్వాలని నిర్ణయించారు. ఉమెన్ వరల్డ్ కప్ విజయంలో ఆంధ్ర అమ్మాయి శ్రీచరణి కీలకపాత్ర పోషించటం రాష్ట్ర ప్రజలకు ఎంతో గర్వ కారణమని ఏసీఏ ప్రెసిడెంట్ కేశినేని శివనాథ్ అభిప్రాయపడ్డారు. ఆమెకు స్వాగతం పలికేందుకు అభిమానులు కూడా ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. గన్నవరం నుంచి శ్రీచరణిని ఉండవల్లిలోని నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేష్ నివాసానికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెకు అత్యున్నతస్థాయిలో గౌరవం లభించింది. ఆమె ప్రతిభను చంద్రబాబు, లోకేష్ కితాబు ఇచ్చారు.అనంతం మంగళగిరి క్రికెట్ స్టేడియంలో ఏ.సి. ఏ ఆధ్వర్యంలో శ్రీ చరణి మీడియా సమావేశం నిర్వహించారు. " ఏసీఏ నాకు అన్ని విధాలుగా తోడుగా నిలిచింది. ప్రభుత్వం గ్రూప్ 1 జాబ్ ఇస్తామని సీఎం చెప్పారు.2.5 కోట్ల నగదు , కడపలో స్థలం ఇస్తామని సీఎం చెప్పారు. మోడీతో సమావేశం జరిగినప్పుడు మరింత ముందుకు ఎలా వెళ్లాలనే విషయం చెప్పారు." అని అన్నారు. అందరి అభిమానం చూస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు శ్రీచరణి. "నాకు కుటుంబం నుంచి చక్కటి ప్రోత్సాహం ఉంది.. మా మామ నన్ను క్రికెట్ ఆడిరచేవారు. నేను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌లో శిక్షణ పొందాను. ఇది మొదటి అడుగు మాత్రమే. ముందు చాలా ఉంది. సీఎంను కలిసినప్పుడు చరణికి క్రికెట్‌పై మరింత దృష్టి పెట్టాలని చెప్పారని ఏసీఏ ప్రెసిడెంట్ కేశినేని శివనాథ్ తెలిపారు. "ఏసీఏ తరపున అన్ని సదుపాయాలు ఆటగాళ్లకు కల్పిస్తున్నాం. చరణి పేరుని విశాఖ స్టేడియంలో ఒక వింగ్‌కు పేరు పెడుతాం. మహిళా క్రికెటర్ అకాడమి త్వరలో ప్రారంభిస్తాం. మహిళా క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా అవార్డ్స్ కూడా ఇస్తాం." అని ప్రకటించారు.

## చరిత్ర సృష్టించిన ఆర్చర్? శీతల్ దేవీ

ఒలింపిక్ మెడల్ విన్నర్, భారత స్టార్ పారా ఆర్చర్ శీతల్ దేవి కెరీర్‌లో మరో మైలురాయిని సాధించింది. ఇటీవల జాతీయ ట్రయల్స్‌లో అద్భుతమైన ప్రదర్శన తర్వాత, జెడ్డాలో జరగనున్న ఆసియా కప్ స్టేజ్- 3 పోటీలకు శీతల్ ఎంపికైంది. అయితే ఈ పోటీలో ఆమె, శారీరకంగా ఫిట్? గా ఉన్న అథ్లెట్లను ఎదుర్కోనుండడం విశేషం. సౌదీ అరేబియా జెడ్డా వేదికగా వచ్చే నెలలో వివిధ ఈవెంట్లలో స్టేజ్- 3 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు శీతల్ దేవి, శారీరక సామర్థ్యం ఉన్న జూనియర్ జట్టుకు ఎంపికైంది. ఈ జట్టులో పారా అథ్లెట్ అయిన శీతల్ చోటు దక్కించుకోవడం చరిత్రాత్మకం. శారీరక సామర్థ్యం ఉన్న జూనియర్ జట్టుకు ఎంపికైన మొదటి భారతీయ పారా ఆర్చర్‌గా కూడా ఆమె ఘనత సాధించింది. ఈ మేరకు శీతల్ సోషల్ మీడియాలో ఆనందం వ్యక్తం చేసింది. "నేను విలు విద్య ప్రారంభించినప్పుడు, నాకు ఒక కల వచ్చింది. ఏదో ఒక రోజు నేను ఉత్తమ ఆర్చర్లతో పోటీ పడాలనుకున్నాను. నేను నా శాయశక్తులా ప్రయత్నించాను. కానీ, నేను నా కలను ఎప్పుడూ వదులుకోలేదు. ప్రతి ఓటమి నుంచి నేను పాఠాలు నేర్చుకున్నాను. ఫలితంగా ఈ రోజు నా కల నిజమైంది" అని శీతల్ దేవీ పోస్టులో రాసుకొచ్చింది. హరియాణాలోని సోనిపట్‌లో రీసెంట్?గా జరిగిన జాతీయ ఎంపిక ట్రయల్స్‌లో 18ఏళ్ల శీతల్ పోటీ పడింది. దాదాపు 60 మందికి పైగా ఉత్తమ ఆర్చర్లతో పోటీపడిన ఆమె మూడో స్థానం దక్కించుకుంది. అర్హత రౌండ్‌లో ఆమె మొత్తం 703 పాయింట్లు (352 ం 351) సాధించింది. 15.75 అదనపు పాయింట్లతో తేజల్ మొదటి స్థానం, వైదేహి జాదవ్ 15 పాయింట్లతో రెండవ స్థానంలో నిలిచింది. 11.75 పాయింట్లతో శీతల్ మూడో స్థానంలో దక్కించుకుంది. మహారాష్ట్రకు చెందిన జ్ఞానేశ్వరి గాధే (11.5) నాలుగో స్థానంలో నిలిచింది.

## పాక్ ఆటగాళ్లను మరోసారి చేదు అనుభవం

క్రికెట్ మైదానంలో భారత్-పాకిస్తాన్ మ్యాచ్ అంటేనే ఉత్కంఠ. అయితే గత కొంతకాలంగా ఈ రెండు దేశాల ఆటగాళ్ల మధ్య ఆట ముగిసిన తర్వాత కూడా ఒక రకమైన వివాదం కొనసాగుతోంది. తాజాగా హాంగ్ కాంగ్ సిక్స్ 2025 టోర్నమెంట్?లో భారత్, పాకిస్తాన్‌పై 2 పరుగుల తేడాతో విజయం సాధించిన తర్వాత మరోసారి ఇదే పరిస్థితి రిపీట్ అయింది. మ్యాచ్ ముగిశాక భారత ఆటగాళ్లు పాకిస్తాన్ ఆటగాళ్లతో హ్యాండ్ షేక్ చేయడానికి ముందుకు రాలేదు. ఈ పరిణామం ఆసియా కప్ 2025లో మొదలైన ఒక నూతన సంప్రదాయాన్ని కొనసాగించినట్లైంది. హాంగ్ కాంగ్ సిక్స్ 2025 టోర్నమెంట్‌లో నవంబర్ 7న జరిగిన భారత్-పాకిస్తాన్ మ్యాచ్‌ను వర్షం కారణంగా డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ద్వారా భారత్ 2 పరుగుల తేడాతో గెలుచుకుంది. అయితే, మ్యాచ్ ఫలితం ప్రకటించిన తర్వాత ఆటగాళ్ల మధ్య ఉండాల్సిన క్రీడా స్ఫూర్తి కనిపించలేదు. మ్యాచ్ ముగిసిన తర్వాత సాధారణంగా జరిగే విధంగా ఇరు జట్ల ఆటగాళ్లు బయటకు వచ్చి షేక్ హ్యాండ్ చేసుకోలేదు. భారత ఆటగాళ్లు పాకిస్తాన్ ఆటగాళ్లతో చేతులు కలపడానికి ముందుకు రాకపోవడం ఈ వివాదానికి కారణమైంది. ఆసియా కప్ 2025 నుంచి మహిళల ప్రపంచ కప్ 2025లో కూడా భారత జట్లు పాకిస్తాన్ జట్లతో షేక్ హ్యాండ్ చేయడాన్ని నిరాకరించాయి. హాంగ్ కాంగ్ సిక్స్ టోర్నమెంట్‌లో కూడా ఇదే విధానాన్ని కొనసాగించినట్లు తెలుస్తోంది. భారత్,పాకిస్తాన్ మధ్య ఈ హ్యాండ్‌షేక్ వివాదం ఆసియా కప్ 2025 నుంచి తీవ్రమైంది. సెప్టెంబర్ 14న భారత్-పాక్ మ్యాచ్‌కు ముందు టాస్ సమయంలో సూర్యకుమార్ యాదవ్, సల్మాన్ ఆఘా హ్యాండ్‌షేక్ చేసుకోలేదు. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా భారత జట్టు డ్రెస్సింగ్ రూమ్ నుంచి బయటకు వచ్చి పాకిస్తాన్ ఆటగాళ్లతో చేతులు కలపలేదు. సెప్టెంబర్ 28న ఫైనల్‌లో భారత్, పాకిస్తాన్‌ను ఓడించిన తర్వాత, టీమిండియా ఆటగాళ్లు పీసీబీ ఛీఫ్ మోహ్సిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ తీసుకోవడానికి నిరాకరించారు. ఈ ట్రోఫీ వివాదం ఇప్పటికీ పరిష్కారం కాలేదు. ట్రోఫీ నఖ్వీ వద్దే ఉన్నట్లు సమాచారం. నవంబర్ 7న జరిగిన ఈ హాంగ్ కాంగ్ టోర్నమెంట్ మ్యాచ్‌లో భారత్ అద్భుత ప్రదర్శన చేసింది. భారత్ బ్యాటింగ్ మొదలుపెట్టింది. రాబిన్ ఉతప్ప కేవలం 11 బంతుల్లో 28 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో నిర్ణీత 6 ఓవర్లలో టీమిండియా 86 పరుగులు చేసింది. 87 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్, 3 ఓవర్లలో 41 పరుగులు చేసింది. అయితే, వర్షం కారణంగా మ్యాచ్‌ను నిలిపివేశారు. వర్షం తగ్గకపోవడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం భారత్‌ను 2 పరుగుల తేడాతో విజేతగా ప్రకటించారు.

## ప్రతీకా రావల్‌కు దక్కనున్న గౌరవం

025 మహిళల వన్డే వరల్డ్?కప్?లో భారత ఓపెనర్ ప్రతీకా రావల్ అద్భుతంగా రాణించింది. అయితే సెమీఫైనల్?కు ముందు బంగ్లాదేశ్?తో మ్యాచ్?లో గాయపడిన ప్రతీక జట్టుకు దూరమైంది. ఆమె స్థానంలో షెఫాలీ వర్మ జట్టులోకి వచ్చింది. దీంతో ఫైనల్ మ్యాచ్ అనంతరం ప్రతీకకు వరల్డ్?కప్ విన్నర్ మెడల్ ఇవ్వలేదు. . ఫైనల్ మ్యాచ్ దాకా జట్టులో ఉన్నవాళ్లకే మెడల్ అందిస్తారు. ఈ కారణంగానే ప్రతీకకు మెడల్ అందలేదు. దీంతో నెటిజన్లు అసంతృప్తి చెందారు. టోర్నీ ఆసాంతం ఆడిన ప్లేయర్?కు మెడల్ ఇస్తే బాగుండేది అన్న వాదనలు వినిపించాయి. అయితే తనకు కూడా ఐసీసీ వరల్డ్?కప్? విన్నర్ మెడల్ రానున్నట్లు ప్రతీక తాజాగా ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించింది. ఐసీసీ ఛైర్మన్ జైషా చొరవతో తనకు మెడల్ లభించనున్నట్లు చెప్పింది. అలాగే ఇటీవల ప్రధాని మోదీతో మీటింగ్?లో తాను మెడల్ ధరించి కనిపించింది. దీంతో ఆమెకు మెడల్ వచ్చేసిందేమో అని అంతా అనుకున్నారు. కొంతమంది మాత్రం అది టీమ్?మేట్ అమన్?జోత్ కౌర్? మెడల్ అని పోస్టులు షేర్ చేశారు. కానీ, ఈ మెడల్ సపోర్టింగ్ స్టాఫ్ మెంబర్?ది అని ప్రతీక తాజా ఇంటర్వ్యూలో పేర్కొంది. 'ఈ విషయంలో ఛైర్మన్ జై షా చొరవ తీసుకున్నారు. నాకు మెడల్ తీసుకురావడానికి



ప్రయత్నాలు చేస్తున్నట్లు మా మేనేజర్?కు మెసేజ్ పంపారు. అలా ఎట్టకేలకు నేను నా మెడల్?ను పొందబోతున్నాను. ప్రస్తుతం సపోర్టింగ్ స్టాఫ్ మెడల్? ఇచ్చారు. ఈ మెడల్?ను తొలిసారి చూడగానే ఎమోషనల్ అయిపోయా, కళ్లలో నీళ్లు తిరిగాయి. నా మెడల్ రావడానికి కొంచెం టైమ్ పట్టొచ్చు. త్వరలోనే నేను దాన్ని అందుకుంటాను' అని ప్రతీకా రావల్ వెల్లడించింది.కాగా, ఈ టోర్నమెంట్?లో ప్రతీకా రావల్, స్మృతి మంధానతో కలిసి ఓపెనర్‌గా ఆడింది. ఆమె 6 ఇన్నింగ్స్‌లలోనే 1 సెంచరీ, 1 హాఫ్ సెంచరీ సహా 308 పరుగులు చేసింది. మొత్తం 37 ఫోర్లు, 4 సిక్సర్లు కొట్టింది. ఆమె అత్యధిక స్కోరు 122. దీంతో టోర్నమెంట్?లో అత్యధిక పరుగులు చేసిన నాలుగో బ్యాటర్?గా నిలిచింది. ఇక భారత్?లో స్మృతి తర్వాత ఎక్కువ పరుగులు బాదింది ప్రతీకనే. అయితే బంగ్లాదేశ్‌తో లీగ్ చివరి మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా మోకాలికి తీవ్ర గాయమైంది. దీంతో ఆమె జట్టుకు దూరమైంది. అయినా ఫైనల్? మ్యాచ్?కు ప్రతీక స్టేడియానికి వచ్చింది. డగౌట్? నుంచే టీమ్ఇండియా ప్లేయర్లను ప్రోత్సహించింది.రీసెంట్?గా దిల్లీలో మోదీను కలిసిన టీమ్ఇండియా జట్టులో ప్రతీక కూడా ఉంది. నడవలేని స్థితిలో ఉన్న ఆమె ప్రధాని దగ్గరకు వీల్ చైర్?లోనే వెళ్లింది. ఇక స్నాక్స్ టైమ్?లో ఆమె నడవలేదని గుర్తించిన మోదీ, స్వయంగా ఆమెకు ఫుడ్ అందించారు.

## రాబిన్ ఉతప్ప మెరుపు ఇన్నింగ్స్

క్రికెట్ అభిమానులను ఉర్రూతలూగించే మరో లీగ్, హాంగ్ కాంగ్ సిక్స్ 2025 టోర్నమెంట్ ఈ రోజు నుంచే మొదలైంది. ఈ టోర్నీలో భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్ నువ్వా నేనా అన్నట్టు సాగింది. మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో భారత్ 86 పరుగుల భారీ స్కోరు చేసింది. అయితే, వర్షం కారణంగా మ్యాచ్‌కి అంతరాయం ఏర్పడటంతో, డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ద్వారా భారత్ జట్టు 2 పరుగుల స్వల్ప తేడాతో పాకిస్తాన్‌ను మరోసారి ఓడించి శుభారంభం చేసింది. హాంగ్ కాంగ్ సిక్స్ 2025 టోర్నమెంట్‌లో భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన మ్యాచ్‌తో టోర్నీ ప్రారంభమైంది. మాంగ్ కాక్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి భారత్ ముందుగా బ్యాటింగ్ చేసింది. భారత జట్టును రాబిన్ ఉతప్ప, భరత్ చిప్లి ఓపెనింగ్ చేశారు. వీరు కేవలం మొదటి 2 ఓవర్లలోనే 34 పరుగులు చేసి ధనాధన్ ఆరంభం అందించారు. రాబిన్ ఉతప్ప కేవలం 11 బంతుల్లో 28 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడి మూడో ఓవర్‌లో అవుట్ అయ్యాడు. అతని తర్వాత వచ్చిన స్టువర్ట్ బిన్నీ మొదటి బంతికే ఫోర్ కొట్టి, రెండో బంతికి అవుట్ అయ్యాడు. దినేష్ కార్తీక్ 6 బంతుల్లో 17 పరుగులు జోడించడంతో,



భారత్ నిర్ణీత 6 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 86 పరుగుల భారీ స్కోరు సాధించింది. 87 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన పాకిస్తాన్ ఓపెనర్లు కూడా మంచి ఆరంభాన్ని



ఇచ్చారు. పాకిస్తాన్ మొదటి ఓవర్‌లోనే 18 పరుగులు చేసింది. స్టువర్ట్ బిన్నీ బౌలింగ్ చేసిన రెండో ఓవర్‌లో కేవలం 7 పరుగులు మాత్రమే ఇచ్చి కట్టడి చేయగలిగారు. మూడో ఓవర్‌లో షాబాజ్ నదీమ్ 16 పరుగులు ఇచ్చాడు. పాకిస్తాన్ 3 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 41 పరుగులు చేసింది. సరిగ్గా అదే సమయంలో వర్షం రావడంతో మ్యాచ్‌కి అంతరాయం ఏర్పడింది. వర్షం తగ్గకపోవడంతో మ్యాచ్ ఫలితాన్ని డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ద్వారా నిర్ణయించారు. ఈ పద్ధతి ద్వారా భారత్ జట్టు 2 పరుగుల తేడాతో విజేతగా నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో భారత్‌కు ఇది తొలి విజయం. హాంగ్ కాంగ్ సిక్స్ 2025 టోర్నమెంట్‌లో మొత్తం 12 జట్లు పాల్గొంటున్నాయి. వీటిని ఒక్కొక్క గ్రూప్‌లో మూడు జట్ల చొప్పున నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. భారత్, పాకిస్తాన్, కువైట్ గ్రూప్-సిలో ఉన్నాయి. ప్రస్తుతం పాకిస్తాన్ రెండు మ్యాచ్‌లలో ఒక విజయం సాధించి పాయింట్స్ టేబుల్‌లో మొదటి స్థానంలో ఉంది. భారత్ ఒక విజయంతో రెండో స్థానంలో ఉంది. ప్రతి గ్రూప్ నుంచి మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంటాయి.

## ఎమ్మెస్కే ప్రసాద్‌కు ఘోర అవమానం!

టీమిండియా మాజీ చీఫ్ సెలెక్టర్, తెలుగు తేజం ఎమ్మెస్కే ప్రసాద్‌కు ఘోర అవమానం ఎదురైంది. ప్రపంచకప్ విన్నర్, తెలుగు తేజం శ్రీచరణికి ఘన స్వాగతం పలికేందుకు గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన ఎమ్మెస్కే ప్రసాద్‌ను సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుంది. ఈ వ్యవహారంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఎమ్మెస్కే ప్రసాద్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. మాజీ క్రికెటర్, చీఫ్ సెలెక్టర్‌గా తనకు ప్రోటోకాల్ ఇవ్వకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెస్కే ప్రసాద్.. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) ప్రతినిధులపై కూడా బీసీసీఐకి ఫిర్యాదు చేసే యోచనలో ఉన్నారు.ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా ఎమ్మెస్కే ప్రసాద్ అద్భుత పనితీరు కనబర్చాడు. 2009 నుంచి 2014 వరకు ఈ బాధ్యతలు నిర్వర్తించిన ఎమ్మెస్కే ప్రసాద్.. క్రికెటర్లకు అనేక మౌళిక వసతులు కల్పించాడు. ఏసీ క్రికెట్ అకాడమీలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఏసీఏ మైదానాల అభివృద్ధికి కృషి చేశారు. ఈ పని తీరుకు రివార్డ్‌గానే అతనికి చీఫ్ సెలెక్టర్ పదవి దక్కింది. అలాంటి ఆటగాడిని సెక్యూరిటీ అడ్డుకోవడంపై క్రికెట్ అభిమానులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వికెట్ కీపర్ కమ్ బ్యాటర్ అయిన ఎమ్మెస్కే ప్రసాద్.. 1999-2000 మధ్య భారత్ తరపున ఆరు టెస్టు మ్యాచ్‌లు మరియు 17 వన్డేలు ఆడాడు. 2016 నుంచి 2019 వరకు భారత చీఫ్ సెలెక్టర్‌గా పని చేశారు.

# వన్డే సిరీస్ నుంచి కామెరాన్ గ్రీన్ ఔట్

భారత్ తో వన్డే సిరీస్ ప్రారంభానికి ముందే ఆస్ట్రేలియాకు భారీ షాక్ తగిలింది. భారత్‌తో వన్డే సిరీస్ ప్రారంభానికి 2 రోజుల ముందు ఆల్ రౌండర్ కామెరాన్ గ్రీన్ గాయం కారణంగా సిరీస్ నుండి వైదొలిగాడు. అతడి స్థానంలో వన్డే సిరీస్ కోసం మార్నస్ లాబుషేన్‌ను ఆస్ట్రేలియా జట్టులోకి తీసుకున్నారు.కండరాల గాయం వల్ల కామెరూన్ గ్రీన్ భారత్‌తో జరిగే వన్డే సిరీస్ నుంచి వైదొలిగాడు. వచ్చే నెలలో ప్రారంభం కానున్న ప్రతిష్టాత్మకమైన యాషెస్ సిరీస్‌కు ముందు ఆస్ట్రేలియా సెలెక్టర్లు ఎలాంటి రిస్క్ తీసుకోకూడదు అనుకుంటున్నారు. క్రికెట్ ఆస్ట్రేలియా ఒక ప్రకటనలో "కామెరాన్ గ్రీన్ కొంతకాలం పాటు రెస్ట్ తీసుకుంటాడు. ఆ తర్వాత యాషెస్ సిరీస్‌కు సిద్ధం కావడానికి షెఫీల్డ్ షీల్డ్ మూడో రౌండ్‌లో ఆడటానికి అవకాశం



ఉంటుందని" ఆసీస్ మేనేజ్‌మెంట్ ఓ ప్రకటనలో పేర్కొంది.కామెరూన్ గ్రీన్ స్థానంలో మార్నస్ లాబుషేన్‌ను ఆస్ట్రేలియా వన్డే జట్టులోకి తీసుకున్నారు. గురువారం క్వీన్స్‌లాండ్ తరపున షెఫీల్డ్ షీల్డ్ మ్యాచ్‌లో 159 పరుగులు చేశాడు. దేశవాళీ సీజన్‌లో లాబుషేన్ కు ఇది నాల్గవ సెంచరీ. 31 ఏళ్ల లాబుషేన్ 66 అంతర్జాతీయ వన్డే మ్యాచ్‌లలో ఆసీస్‌కు ఆడాడు. ఇందులో 34.64 సగటుతో, 83.56 స్ట్రైక్ రేట్‌తో 1871 పరుగులు సాధించాడు. లబుషేన్ భారత్‌తో 15 వన్డే మ్యాచ్‌లు ఆడాడు, అందులో 13 ఇన్నింగ్స్‌లలో 474 పరుగులు చేశాడు. ఇందులో 4 అర్ధ శతకాలు ఉన్నాయి. లాబుషేన్ 2023 ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత్‌పై 58 పరుగులు చేశాడు.

భారత్ – ఆస్ట్రేలియా వన్డే సిరీస్ జట్టు

భారత్: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్),



అక్షర్ పటేల్, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), హర్షిత్ రాణా, మహ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, యశస్వి జైస్వాల్.

ఆస్ట్రేలియా: మిచెల్ మార్ష్ (కెప్టెన్), జేవియర్ బార్ట్‌లెట్, కూపర్ కోనోలీ, అలెక్స్ కేరీ, బెన్ డ్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, మార్నస్ లాబుషేన్, జోష్ హేజిల్‌వుడ్, మిచెల్ ఓవెన్, మాట్ రెన్‌షా, ట్రావిస్ హెడ్, మాథ్యూ షార్ట్, మిచెల్ స్టార్క్, మాథ్యూ కునెమాన్, జోష్ ఫిలిప్.

భారత్ – ఆస్ట్రేలియా వన్డే సిరీస్ షెడ్యూల్

మొదటి వన్డే – అక్టోబర్ 19వ తేదీన (పెర్త్)

రెండవ వన్డే – అక్టోబర్ 23వ తేదీన (అడిలైడ్)

మూడవ వన్డే – అక్టోబర్ 25వ తేదీన (సిడ్నీ)

భారత్ – ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌లోని 3 మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయి. ఉదయం 8:30 గంటలకు కెప్టెన్లు టాస్‌కు వస్తారు.



# కోహ్లీ చరిత్ర సృష్టిస్తారా?

భారతదేశ దిగ్గజ బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లీ వన్డే క్రికెట్‌లో గొప్ప ఆటగాళ్ళలో ఒకరు. విరాట్ దాదాపు 7 నెలల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగి వస్తున్నారు. కోహ్లీ అక్టోబర్ 19 నుంచి ప్రారంభమయ్యే ఆస్ట్రేలియాతో 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో ఆడనున్నారు. విరాట్ టెస్ట్, టీ20 ఇంటర్నేషనల్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్నారు. ఇప్పుడు అతను వన్డే ఫార్మాట్‌లో మాత్రమే ఆడతారు. కోహ్లీని మళ్లీ ఇండియన్ జెర్సీలో చూడటానికి అభిమానులు చాలా ఉత్సాహంగా ఉన్నారు. అదే సమయంలో, ఆస్ట్రేలియాలో విరాట్ 4 పెద్ద రికార్డులు ఎదురు చూస్తున్నాయి. వాటిని అతను తన పేరు మీద రాసుకోనున్నారు. కుమార్ సంగాకర (14,234)ని వన్డేల్లో పరుగుల పరంగా అధిగమించి, విరాట్ కోహ్లీ వన్డే చరిత్రలో రెండో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్ కావచ్చు. సంగాకర వన్డేల్లో 14,234 పరుగులు చేశాడు. అదే సమయంలో, విరాట్ ఇప్పటివరకు 14,181 పరుగులు చేశాడు. కోహ్లీ, సంగాకర కంటే కేవలం 54 పరుగులు దూరంలో ఉన్నాడు, ఇది విరాట్ ఒక పెద్ద ఇన్నింగ్స్‌లో సాధించగలిగే ఒక మైలురాయి.విరాట్





కోహ్లీ వన్డే మ్యాచ్‌లలో 1,484 ఫోర్లు కొట్టాడు. 1,500 ఫోర్లు పూర్తి చేయడానికి కేవలం 16 ఫోర్లు మాత్రమే అవసరం. ఆస్ట్రేలియాలో విరాట్ 16 ఫోర్లు కొట్టడం ద్వారా ఒక ప్రత్యేకమైన విజయాన్ని తన పేరు మీద చేసుకోవచ్చు, ఇది అతని అద్భుతమైన వన్డే కెరీర్‌ను చూపుతుంది.విరాట్ కోహ్లీ ప్రస్తుతం సచిన్ టెండూల్కర్ సరసన ఉన్నాడు, ఎందుకంటే ఇద్దరు



దిగ్గజ బ్యాట్స్‌మెన్‌లు ఒక్కో ఫార్మాట్‌లో 51 సెంచరీలు సాధించారు. టెండూల్కర్ టెస్ట్ క్రికెట్‌లో 51 సెంచరీలు సాధించగా, కోహ్లీ వన్డేల్లో ఈ ఘనత సాధించాడు. మరో సెంచరీ



సాధించడంతో, విరాట్ కోహ్లీ ఒక ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు సాధించిన రికార్డును బద్దలు కొట్టి సచిన్ టెండూల్కర్‌ను అధిగమిస్తాడు.విరాట్ కోహ్లీ ఆస్ట్రేలియాలో 1000 వన్డే పరుగులు చేసిన మొదటి బ్యాట్స్‌మన్ కావచ్చు. విరాట్ ఆస్ట్రేలియాలో ఇప్పటివరకు 18 మ్యాచ్‌లు ఆడాడు, ఇందులో అతను 47.17 అద్భుతమైన సగటుతో 802 పరుగులు చేశాడు. ఆస్ట్రేలియాలో 1000 వన్డే పరుగులు పూర్తి చేయడానికి విరాట్‌కు 198 పరుగులు అవసరం. విరాట్ ఈ 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో పరుగులు పూర్తి చేస్తారని అందరూ ఆశిస్తున్నారు.



# బుమ్రా లేకుండా బరిలోకి టీమ్ ఇండియా

భారత్ –ఆస్ట్రేలియా మధ్య మొదటి వన్డే మ్యాచ్ అక్టోబర్ 19న పెర్త్‌లో జరగనుంది. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 విజేతగా నిలిచిన తర్వాత టీమ్ ఇండియా తన మొదటి వన్డే సిరీస్ ఆడనుంది. ఇది శుభమన్ గిల్ కెప్టెన్గా మొదటి వన్డే సిరీస్ కూడా కానుంది, అదే సమయంలో విరాట్ కోహ్లీ మరియు రోహిత్ శర్మ కూడా చర్చనీయాంశంగా మారనున్నారు. ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన టీమ్ ఇండియాలో యువత మరియు అనుభవం అద్భుతమైన కలయిక ఉంది. చాలా కాలంగా రోహిత్ శర్మ మరియు శుభ్‌మన్ గిల్ జోడీ వన్డేలలో ఓపెనింగ్ చేస్తూ వస్తున్నారు. గిల్ ప్రస్తుతం కెప్టెన్గా ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్లో అద్భుత ప్రదర్శన చేశాడు, అక్కడ అతను 754 పరుగులు చేశాడు. ఇప్పుడు కెప్టెన్గా తన మొదటి వన్డే సిరీస్లో కూడా అలాంటి ప్రదర్శననే ఆశిస్తున్నారు. రోహిత్ శర్మ గత కొంతకాలంగా విధ్వంసకర బ్యాటింగ్ చేస్తున్నాడు, అదే సమయంలో విరాట్ కోహ్లీ మరోసారి నంబర్–3 స్థానంలో ఆడనున్నాడు. అతను ఛాంపియన్స్ ట్రోఫీలో 54 కంటే ఎక్కువ సగటుతో 218 పరుగులు చేశాడు.ఛాంపియన్స్ ట్రోఫీలో టీమ్



ఇండియా టాప్ స్కోరర్ (243 పరుగులు) అయిన శ్రేయాస్ అయ్యర్ నంబర్–4 స్థానంలో బాధ్యతలను నిర్వర్తించవచ్చు, అతను వన్డే జట్టుకు వైస్ కెప్టెన్ కూడా. ఐదవ స్థానంలో 56.48



సగటుతో ఉన్న కెఎల్ రాహుల్ ఈసారి కూడా నంబర్–5 బాధ్యతను స్వీకరించవచ్చు మరియు వికెట్ కీపర్ పాత్రను కూడా పోషిస్తాడు. అక్షర్ పటేల్ స్పిన్ బౌలింగ్ ఆల్ రౌండర్తో పాటు వైట్ బాల్ మ్యాచ్లలో మంచి బ్యాటింగ్ కూడా చేశాడు. ఈ సంవత్సరం అతను ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్లో 53 సగటుతో పరుగులు చేశాడు. అదే సమయంలో, నితీష్ కుమార్ రెడ్డికి ఫాస్ట్ బౌలింగ్ ఎంపికగా %ాణ×% అరంగేట్రం చేసే అవకాశం లభించవచ్చు. అతను జట్టులో నాల్గవ ఫాస్ట్ బౌలర్ పాత్రను పోషిస్తాడు.బౌలింగ్ దాడికి మహ్మద్ సిరాజ్ నాయకత్వం వహిస్తాడు. రెండో ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ కావచ్చు, అతని లెఫ్ట్–ఆర్మ్ యాంగిల్ ఆస్ట్రేలియా పిచ్లపై ప్రభావవంతంగా ఉండవచ్చు, అలాగే అతని వద్ద స్వింగ్ కూడా ఉంది. మూడవ ఫాస్ట్ బౌలింగ్ స్లాట్ కోసం ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రానా మధ్య పోటీ ఉంటుంది. జట్టు ప్రధాన స్పిన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ కావచ్చు. ఈ సిరీస్లో బుమ్రా ఆడటం లేదని, ఎందుకంటే అతనికి విశ్రాంతినిచ్చారు.

# కగిసో రబాడను విడుదల చేయనున్న గుజరాత్

గుజరాత్ టైటాన్స్ జట్టులో శుభ్‌మాన్ గిల్, సాయి సుదర్శన్, జోస్ బట్లర్, మహ్మద్ సిరాజ్, ప్రసిత్ కృష్ణ వంటి స్టార్ ఆటగాళ్లు ఉండగా, కొద్దిమంది ఆటగాళ్లను మాత్రమే మినీ వేలానికి విడుదల చేస్తారు. 2025 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ జట్టు పాయింట్ల పట్టికలో బెంగుళూర్, పంజాబ్, ముంబై తర్వాత నాల్గవ స్థానంలో నిలిచింది. ఆ జట్టు 2022లో ఛాంపియన్‌షిప్ గెలుచుకుని 2023లో ఫైనల్‌కు చేరుకుంది. ఈ రెండింటినీ హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలో గుజరాత్ ఆడింది. 2024లో శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించాడు. 2024లో గుజరాత్ ప్లేఆఫ్‌కు చేరుకోలేదు. 2025 సీజన్‌లో వారు ప్లేఆఫ్‌కు చేరుకున్నారు. అద్భుతమైన టాప్–ఆర్డర్, మిడిల్–ఆర్డర్ బ్యాటింగ్ ఉన్నప్పటికీ, వారు ఫాస్ట్ బౌలింగ్‌తో నిరాశ చెందారు. ప్రసిద్ధ్ కృష్ణ, సిరాజ్ వంటి అద్భుతమైన భారతీయ ఫాస్ట్ బౌలర్లు ఉన్నప్పటికీ, విదేశీ బౌలర్ల అవసరం ఉంది. రబాడకు బ్యాకప్ ప్లేయర్ కూడా అవసరం. ఆ విషయంలో 2026 మినీ వేలానికి ముందు గుజరాత్ టైటాన్స్ ఈ 5 మంది ఆటగాళ్లను విడుదల చేయనుందని సమాచారం. ఆ 5 మంది ఆటగాళ్ల జాబితా ఇక్కడ ఉంది. కగిసో రబాడ గుజరాత్ టైటాన్స్ అతన్ని రూ. 9.25 కోట్లకు కొనుగోలు చేసింది. గత సీజన్‌లో అతను కేవలం 4 మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. 2 వికెట్లు మాత్రమే తీసుకున్నాడు. వ్యక్తిగత కారణాల వల్ల దక్షిణాఫ్రికాకు తిరిగి వచ్చినప్పుడు అతను సంచలనం సృష్టించాడు. ఆ సమయంలో అతను డ్రగ్ కేసులో కూడా చిక్కుకున్నాడు. అతను మంచి బౌలర్ అయినప్పటికీ, అతను కాంబినేషన్‌లో లేడు. కాబట్టి గుజరాత్ అతన్ని విడుదల చేయవచ్చు. కరీం జనత్ గుజరాత్ అతన్ని రూ. 75 లక్షలకు కొనుగోలు చేసింది. అయితే, విదేశీ ఆటగాడి స్థానంలో అతను అవసరం లేనందున గుజరాత్ అతన్ని విడుదల చేయాలని కోరుకుంటుంది. అతని స్థానంలో విదేశీ ఆల్ రౌండర్‌ను కొనుగోలు చేయాలని వారు ప్లాన్




చేస్తారు. జెరాల్డ్ కోయెట్జీ గత సీజన్‌లో కూడా అతను పేలవమైన ప్రదర్శన కనబరిచాడు. 4 మ్యాచ్‌ల్లో కేవలం 2 వికెట్లు మాత్రమే తీసుకున్నాడు. అతను తరచుగా గాయపడుతుండటం వలన గుజరాత్ అతన్ని విడుదల చేయాలని యోచిస్తోంది. గుజరాత్ అతన్ని రూ. 2.40 కోట్లకు కొనుగోలు చేయడం గమనార్హం. ఇషాంత్ శర్మ వయసు మీద పడుతుంది. కానీ అతను ఇంకా బాగా బౌలింగ్ చేస్తున్నాడు. మరోవైపు, అతని ఫిట్‌నెస్ పెద్ద సమస్య అవుతుంది. అతన్ని గుజరాత్ టైటాన్స్ రూ.75 లక్షలకు కొనుగోలు చేసింది. గుజరాత్ జట్టులో ఫినిషర్లకు కొరత లేదు. అతను 5, 6 స్థానాల్లో కూడా వస్తాడు. గుజరాత్ అతన్ని రూ. 1.70 కోట్లకు కొనుగోలు చేసింది. అతన్ని జట్టులో ఉంచే బదులు, తక్కువ ధరకు బ్యాకప్ ఆటగాడిని కొనుగోలు చేయవచ్చు. గత సీజన్‌లో అతనికి అవకాశం రాలేదు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక



# ఓటీటీలోకి సిద్ధు జొన్నలగడ్డ 'తెలుసు కదా'..



టాలీవుడ్ యూత్ స్టార్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన రొమాంటిక్ డ్రామా చిత్రం 'తెలుసు కదా' ఓటీటీ విడుదల తేదీ ఖరారైంది. థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన ప్రేక్షకులు త్వరలోనే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో వీక్షించే అవకాశం లభించింది. అక్టోబర్ 17న దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మిశ్రమ స్పందనలను అందుకుంది. అయితే థియేటర్‌లలో నిరాశపరిచిన ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రం నవంబర్ 14 నుంచి స్ట్రీమింగ్ కాబోతుంది. ఈ విషయాన్ని నెట్‌ఫ్లిక్స్ వెల్లడించింది. ఈ సినిమా దక్షిణ భారత భాషలన్నింటిలోనూ స్ట్రీమింగ్ కానున్నట్లు సమాచారం. ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన ఈ చిత్రంతో దర్శకురాలిగా టాలీవుడ్‌కు పరిచయమయ్యింది. సిద్ధు జొన్నల గడ్డతో పాటు రాశి ఖన్నా మరియు శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిం చా రు. వైవా హర్ష కీలక పాత్ర పోషించారు. ఎస్. ఎస్. తమన్ సంగీతం అందించగా.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ నిర్మించింది.





# బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ కొత్త అవతారం..

విభిన్నమైన పాత్రలతో బాలీవుడ్‌తో ప్రేక్షకులను అలరించిన బాలీవుడ్ కథానాయిక శ్రద్ధా కపూర్ ఇప్పుడు మరో కొత్త పాత్రలోకి అడుగుపెడుతుంది. అయితే ఆమె ఈసారి వెండితెరపై కాకుండా.. తెర వెనుక తన హంగామాను సృష్టించబోతున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ వాల్ట్ డిస్నీ స్టూడియోస్‌లో రూపుదిద్దుకున్న సూపర్ హిట్ యానిమేషన్ చిత్రం 'జూటోపియా' పిల్లల నుంచి పెద్దల వరకు అందరినీ ఆకట్టుకున్న ఈ సినిమాకు సీక్వెల్‌గా 'జూటోపియా 2' సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. డిస్నీ సంస్థ నుంచి రాబోతున్న 64వ యానిమేషన్ చిత్రమిది. ఈ చిత్రంలో కీలకమైన జూడీ హెూప్స్ అనే ఉత్సాహవంతులైన కుందేలు పోలీసు అధికారి పాత్రకు హిందీలో శ్రద్ధా కపూర్ తన వాయిస్ ఓవర్‌ని అందించబోతున్నారు.

# డబ్‌స్మాష్ నుంచి హీరోయిన్..

సోషల్ మీడియా డబ్‌స్మాష్ వీడియోల నుంచి వెండితెర హీరోయిన్‌గా ఎదిగిన నటి మృణాళిని రవి తాజాగా ఒక లగ్జరీ ఎలక్ట్రిక్ కారును కొనుగోలు చేసి వార్తల్లో నిలిచింది. ముఖ్యంగా మృణాళిని కొన్న కారు మోడల్ 'లిమిటెడ్ ఎడిషన్' కావడంతో ఇది మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. ప్రముఖ కార్ల తయారీ సంస్థ మహీంద్రా పేరిటా ఒక లగ్జరీ కారును విడుదల చేసిన విషయం తెలిసిందే. మహీంద్రా బ్యాట్ మ్యాన్ ఎడిషన్ అంటూ ఈ మోడల్ మార్కెట్‌లోకి రాగా.. ఈ మోడల్‌ను మహీంద్రా కంపెనీ 'ఫ్రీడమ్ పేరుతో నిర్వహించిన ఒక ఈవెంట్‌లో విడుదల చేసింది.



# హాలీవుడ్‌లో కూడా వివక్ష!

అగ్ర కథానాయిక దీపికా పదుకొణె హాలీవుడ్ ఇండస్ట్రీపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. భారతీయ నటీనటుల పట్ల అక్కడి వారు వివక్ష చూపిస్తుంటారని, అది అందరికీ తెలిసిన విషయమే అని పేర్కొంది. భారతీయ సినిమాలో తిరుగులేని గుర్తింపును దక్కించుకున్న ఈ మంగళూరు సోయగం హాలీవుడ్‌లో కూడా సత్తా చాటుతున్నది. 'త్రిబుల్ ఎక్స్: రిటర్న్ ఆఫ్ గ్జాండర్ కేజ్' వంటి చిత్రాలతో పాటు పలు అంతర్జాతీయ ఉత్పత్తులకు ఆమె బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ గ్లోబల్ ఐకాన్‌గా పేరు తెచ్చుకుంది. ఓ ఇంటర్నేషనల్ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో దీపికా పదుకొణె హాలీవుడ్ ఇండస్ట్రీ గురించి మాట్లాడింది. 'అందరూ అనుకుంటున్నట్లుగా హాలీవుడ్‌లో ప్రతిదీ నిజాయితీగా, సక్రమంగా ఏమీ ఉండదు. భారతీయ నటీనటులు అక్కడ వివక్షను ఎదుర్కొంటారు.



# విజయ్‌నే పెళ్లాడుతా

ఎట్టకేలకు రష్మిక.. తన మదిలో దాగున్న మాటను బయట పెట్టింది. విజయ్ దేవరకొండతో ఆమె ప్రేమలో ఉందని, వారిద్దరికీ గత నెలలో నిశ్చితార్థం జరిగిందని వార్తలొచ్చాయి. అయితే ఈ విషయాన్ని వారు అధికారికంగా ధృవీకరించలేదు. రీసెంట్‌గా జరిగిన ఓ చిట్‌చాట్‌లో అసలు విషయాన్ని బయటకు చెప్పేసింది రష్మిక. తాజాగా ఓ యూట్యూబ్ ఛానల్ చిట్‌చాట్‌లో పాల్గొన్న రష్మికను 'జీవిత భాగస్వామి ఎలా ఉండాలని కోరుకుంటున్నారు?' అని అడగ్గా.. 'ప్రపంచం నన్ను వ్యతిరేకించినా.. తను మాత్రం నాకోసం నిలబడాలి. అవసరం అయితే.. నా కోసం యుద్ధం చేయాలి. అలాంటి భాగస్వామే నాక్కావాలి' అని సమాధానమిచ్చారు రష్మిక. ఇంకా చెబుతూ 'మీకర్థమయ్యేలా చెప్పాలంటే.. నన్ను లోతుగా అర్థం చేసుకోవాలి.



# హైపరాక్టివ్ సైక్ సిద్ధార్థ

శ్రీనందు, యామిని భాస్కర్ జంటగా నటిస్తున్న చిత్రం 'సైక్ సిద్ధార్థ'. వరుణ్‌రెడ్డి దర్శకుడు. స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్ పతాకంపై శ్రీనందు, శ్యామ్‌సుందర్ రెడ్డి తుడి నిర్మిస్తున్నారు. శనివారం టీజర్‌ను రిలీజ్ చేశారు. ప్రతీ చిన్న విషయాన్ని హైపరాక్టివ్‌గా స్పందించే ఓ యువకుడు, అతని స్నేహితుల కారు ప్రయాణం నేపథ్యంలో టీజర్ ఆసక్తికరంగా సాగింది. తాను ఓ పరాజితుడినని చెప్పుకునే హీరోకు మిత్రులు ధైర్యాన్ని అందించడం ఈ క్రమంలో జరిగిన సంఘటనతో టీజర్ ఆకట్టుకుంది. నేటి యువతను దృష్టిలో పెట్టుకొని ఈ కథ రాసుకున్నానని, హీరో నందు పాత్రతో చాలా మంది యూత్ కనెక్ట్ అవుతారని, హైదరాబాద్ యాస సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని దర్శకుడు తెలిపారు. ప్రియాంక రెబెకా శ్రీనివాస్, సాక్షి అత్రీ, మౌనిక తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కె.ప్రకాష్ రెడ్డి, సంగీతం: స్మరణ్, రచన-దర్శకత్వం: వరుణ్ రెడ్డి.



## పరిశుద్ధ త్రిత్వ లూథరన్ చర్చ్ నందు యువజన ఆదివారం ఘనంగా నిర్వహించారు.....





**అక్షర కలం నాగార్జునసాగర్ ..**

యువత దైవచింతను కలిగి ఉండాలని అడుగుల చినదాసు అన్నారు. ఆదివారం యూత్ సండే సందర్భంగా సాగర్ హిల్ కాలనీలో ఉన్న త్రిత్వ లూథరన్ చర్చిలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నదాసు దైవ సందేశం అందిస్తూ యువత చెడు మార్గాలకు పోకుండా దైవచింతను కలిగి ఉండి సమాజాభివృద్ధికి తోడ్పడాలన్నారు. యేసు చూపిన మార్గంలో యువత నడిచి భావితరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రారంభ ప్రార్థనను కుమారి సుజాత, కార్యక్రమాన్ని నడిపించిన కే. శామ్యూల్ చార్లెస్ ,ఆరాధన నడిపించిన డాక్టర్ సిహెచ్ నిహారిక .ఈ కార్యక్రమం లో సంఘ కాపరి ఈ రమేష్ బాబు , సంఘ అడ్మిన్ డి కోటేశ్వరావు , సంఘ ట్రెజరర్ తదితరులు పాల్గొన్నారు.

# నిధుల్లేక నీరసం

## ముందుకు సాగని సాగునీటి ప్రాజెక్టుల పనులు ఐదేళ్లలో కేటాయింపులు ఘనం..ఖర్చు స్వల్పమే

: రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని ప్రభుత్వం విస్మరించింది. తమ పార్టీ అధికారంలోకి రాగానే ప్రాధాన్యతా క్రమంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక సాగునీటి ప్రాజెక్టులన్నిటినీ అటకెక్కించారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం నుండి కరువు ప్రాంతాలకు జలకళను పంచే హంద్రీనీవా సుజల స్రవంతి, గాలేరు నగరి స్రవంతి, రాయలసీమ ఎత్తిపోతల పథకం, వెలిగొండ ప్రాజెక్టు, పల్నాడు కరువు నివారణ ప్రాజెక్టు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఇలా ప్రతి ప్రాజెక్టు నిర్మాణం ఈ ఐదేళ్లకాలంలో నిధుల్లేక నీరసించిపోయాయి. బడ్జెట్ కేటాయింపుల్లో రూ.61,573 కోట్లు చూపినా.. రూ.33 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు లెక్కలు తెలుపుతున్నాయి. తాము అధికారంలోకి రాగానే పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ ఇచ్చి ప్రాజెక్టును సత్వరం పూర్తి చేస్తామని చెప్పినప్పటికీ చేసింది లేదు. పునరావాసానికి నిధులివ్వని కేంద్రాన్ని నిలదీసింది లేదు. రెండు దశలుగా నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పిన ప్రభుత్వం మొదటి దశకు సంబంధించి 41.15 మీటర్లు వరకూ వుండే పునరావాసానికి కూడా నిధులివ్వలేదు. 2019 నాటికి పూర్తి చేస్తామని టిడిపి ప్రభుత్వం చెబితే, 2021 నాటికి పూర్తి చేస్తామని వైసిపి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటనలు చేసినా.. 2026 నాటికి గానీ మొదటి దశ పనులు పూర్తికావని కేంద్ర ప్రభుత్వం ఏకంగా పార్లమెంటులో ప్రకటన చేసింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పోలవరం ప్రాజెక్టును అటకెక్కించి నట్లే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన ప్రాజెక్టులన్నింటినీ నిలిపేసింది. అలాగే వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి రెండు టన్నెల్ నిర్మాణాలు పూర్తయినా పునరావాసానికి సంబంధించి భూసేకరణ కోసం రూ.1,100 కోట్లు చెల్లించక పోవడంతో నీరు ఎప్పుడు వస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ప్రాజెక్టు పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజె క్టును అటకెక్కించేశారు. హంద్రీనీవా ప్రాజెక్టుకు సంబంధించి రెండో దశ విస్తరణ పనులను ప్రారంభించ కుండా కాంట్రాక్టరు మొండికేశారు. పనులు చేస్తే బిల్లులు రావనే కారణంతో చాలా పనులకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు పనులు చేయని పరిస్థితి వుంది. కొత్త ప్రాజెక్టులను అటకెక్కిం చడమే కాదు.. వున్న ప్రాజెక్టుల నిర్వహణకు నిధులివ్వలేదు. అలాగే పులిచింతల ప్రాజెక్టు, పింఛా డ్యామ్, అన్నమయ్య, గుండ్లకమ్మ తదితర ప్రాజెక్టులు ధ్వంసమయ్యాయి. సాగునీటి ప్రాజెక్టులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




# పోలవరం పునరావాసానికి నిధులివ్వరు

### గగ్గోలు పెడుతున్న కాంట్రాక్టర్లు

### రెండేళ్లుగా రూ.184 కోట్లు బకాయి

**అమరావతి :**

పోలవరం ప్రాజెక్టులో సహాయ పునరావాస పనులకు కష్టాలు తీరడం లేదు. చేసిన పనులకు బిల్లులు రాక చిన్నచిన్న కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. గత రెండేళ్లుగా ఎన్ని పర్యాయాలు విజ్ఞప్తులు చేసుకున్నా నిధులు విడుదల కావడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా తమకు రావాల్సిన నిధులపై ఆర్థికశాఖకు మొరపెట్టుకుంటూ సుదీర్ఘ లేఖ రాశారు. పనులు చేసేందుకు తీసుకున్న రుణాలతో కష్టాల్లోకి చేరుకుంటున్నామని, వాటిని తీర్చలేక సతమతమవుతున్నామని వారు చెబుతున్నారు. పునరావాస కేంద్రాల పనులకు 2022 ఆగస్టు నుంచిప నిధులు విడుదల కావడం లేదు. మొత్తం రూ.184 కోట్ల వరకు తమకు రావాల్సి ఉందని కాంట్రాక్టర్లు పేర్కొన్నారు. 2015-16 నాటి ధరల ప మేరకే ఇప్పటికీ పనులు చేస్తున్నామని, నిర్మాణ వ్యయం భారీగా పెరిగిపోయినా కొత్త రేట్లు అమలు కావడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అప్పట్నుంచి ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల్లో సవరణలు లేకపోవడంతో ఆర్థికంగా కూడా నష్టపోతున్నామని వారు లేఖలో



పేర్కొన్నారు. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తరువాత ఇదే పరిస్థితి కొనసాగడం ఆందోళన కలిగిస్తోందని వారు వాపోతున్నారు.

### పెండింగ్లో 80 బిల్లులు

చేసిన పనులకు సంబంధించి ఇప్పటి వరకు 80 వరకు బిల్లులు ఆర్థిక శాఖ వద్దనే పెండింగ్లో ఉన్నాయి. ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఈ పనులు చేశామని వారు అంటున్నారు. ఈ బిల్లులు రిజర్వు బ్యాంకు వద్దనే పెండింగ్లో ఉన్నట్లు వారు చెబుతున్నప్పటికీ, వాటిని పరిష్కరించాల్సింది మాత్రం రాష్ట్ర ఆర్థికశాఖేనని తెలుస్తోంది. గతంలో కాంట్రాక్టర్ల ఒత్తిడి మేరకు కేవలం రూ.16.27 కోట్లు చెల్లించి చేతులు దులుపుకొన్న అధికారులు మిగిలిన బిల్లులపై మాత్రం ఇప్పటికీ స్పందించడం లేదు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపించి తమకు రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# ‘కొల్లేరు’పై కల్లబొల్లి మాటలు !

## ప్రజలను మోసగిస్తున్న అధికార, ప్రతిపక్ష పార్టీలు

: కొల్లేరు ప్రజలను మరోసారి మోసగించేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలు సిద్ధమయ్యాయి. ఓట్ల కోసం నిస్సిగ్గుగా మాయమాటలు చెబుతున్నాయి. కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని, అక్కడి ప్రజలను ఆదుకుంటామని చెప్పి మళ్లీ హామీలు గుప్పిస్తున్నాయి. కొల్లేరు ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపకుండా వంచించడంలో ప్రధాన ముద్దాయి బిజెపినే. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న ఆ పార్టీకి కాంటూరు కుదింపు ఏమంత కష్టం కాదు. మాతోనే కొల్లేరు సమస్య పరిష్కారమంటూ కైకలూరు బిజెపి అభ్యర్థి మళ్లీ చెప్తుండడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొల్లేరు ప్రాంతం 77 వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. కొల్లేరులో బెడ్, బెల్ట్ గ్రామాలు 120కుపైగా ఉన్నాయి. ఈ గ్రామాల్లోని లక్షలాది మంది ప్రజలు కొల్లేరుపై ఆధారపడి జీవిస్తున్నారు. కొల్లేరులో సంప్రదాయ పద్ధతిలో రైతులు వరి సాగు చేసేవారు. జలగం వెంగళరావు ప్రభుత్వ హయాంలో కొల్లేరు గ్రామాల్లో సొసైటీలు ఏర్పాటు చేసి భూములను పంపిణీ చేశారు. భూములు చేపల చెరువులకు అనుకూలంగా ఉంటాయంటూ ప్రభుత్వమే బలవంతంగా చేపల చెరువులు తవ్వించింది. అయితే, 2005లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో కొల్లేరులోని చేపల చెరువులన్నింటినీ బాంబులు పెట్టి ధ్వంసం చేశారు. కొల్లేరు భూములనే కాకుండా దాదాపు పది వేల ఎకరాల్లోని పట్టా భూముల్లోని చెరువులను ధ్వంసం చేయడంతో అప్పటి నుంచి కొల్లేరు ప్రజల బతుకులు దుర్భరంగా మారాయి. ఉపాధి లేక కర్ణాటక, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలకు వలస వెళ్లి బతుకులు నెట్టుకొస్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత 2014లో టిడిపి, బిజెపి కలిసి ఎన్నికల్లో పోటీ చేశాయి. భీమవరంలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని అభ్యర్థిగా ఉన్న మోడీ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని హామీ ఇచ్చారు. దీంతో, కైకలూరు ఎమ్మెల్యేగా బిజెపి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌ను ప్రజలు గెలిపించారు. సర్వేల పేరుతో హడావుడి చేయడం తప్ప, కొల్లేరు ప్రజలకిచ్చిన మాటను నిలుపుకోలేదు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలంటూ అసెంబ్లీలో తీర్మానం చేసి రాష్ట్రంలోని టిడిపి, బిజెపి ప్రభుత్వం అప్పట్లో చేతులు దులుపుకుంది. ధ్వంసం చేసిన పట్టా భూములను రైతులకు అప్పగించలేదు. అధికారులు, రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతున్నా బాధిత ప్రజలకు నేటికీ న్యాయం జరగలేదు.

**ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో వైసిపి వెన్నుపోటు !**

2019 ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే కొల్లేరు ప్రజలకు న్యాయం చేస్తామంటూ వైసిపి హామీ ఇచ్చింది. అయితే, అధికారంలోకి వచ్చాక మూడో కాంటూరు కుదింపుపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేలేకపోయింది. కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీనీ గాలికొదిలేసింది. మూడో కాంటూరుకు కుదింపును పక్కనపెట్టి ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో కొల్లేరు ప్రజలకు వెన్నుపోటు పొడిచేందుకు సిద్ధమైంది. కొల్లేరును పదో కాంటూరు వరకూ విస్తరించేందుకు ఏరియల్ సర్వే నిర్వహించడంతోపాటు మండల కేంద్రాల్లో ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసింది. దాదాపు మరో 80కుపైగా గ్రామాలను ఎకోసెన్సిటివ్ జోన్‌లోకి చేర్చేందుకు ప్రణాళికలు రూపొందించింది. ప్రజలు వ్యతిరేకిస్తున్నా పట్టించుకోలేదు.

**మళ్లీ ఓట్ల కోసం మోసపూరిత మాటలు**

ప్రస్తుత ఎన్నికల్లో టిడిపి, బిజెపి, జనసేన కూటమిగా ఏర్పడి పోటీ చేస్తున్నాయి. పొత్తులో భాగంగా కైకలూరులో బిజెపి పోటీ చేస్తోంది. 2014లో గెలుపొందిన కామినేని శ్రీనివాస్‌కే మరోసారి టికెట్ దక్కింది. అప్పుడు ఐదేళ్లపాటు కొల్లేరు ప్రజలను మోసగించిన బిజెపి అభ్యర్థి%ే% కొల్లేరు సమస్య మాతోనే పరిష్కారమంటూ ఇప్పుడు మళ్లీ కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారు. వైసిపి, టిడిపి కూడా కొల్లేరు ప్రజలను మరోసారి మాటమాటలతో మభ్యపెట్టాలని చూస్తున్నాయి. ఈ



# ఎంజియూ "మెస్" లో నాణ్యత కరువు..!

## చీపురుతో చపాతి పెనం శుభ్రం చేస్తున్న వర్కర్లు.!

### అపరిశుభ్రతపై విద్యార్థి సంఘాల ఆందోళన

### ఆహార భద్రత ప్రమాణాలు గాలి వదిలేస్తున్నారని మండిపాటు

### నాణ్యమైన ఆహార పదార్థాలు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి

### డిమాండ్ చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు



**అక్షరకలం ప్రతినిధి, నల్గొండ**

నల్లగొండ జిల్లాలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీలోని మెస్ లో నాణ్యత ప్రమాణాలు లోపించాయి. ఆహార భద్రత ప్రమాణాలను గాలికి వదిలేసి ఇష్టాను సారంగా ఆహార పదార్థాలను తయారు చేస్తూ విద్యార్థులకు అందిస్తున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల వర్కర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని వారు మండిపడు తున్నారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీలో విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల విషయంలో కనీసం జాగ్రత్తలు పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వివరాల్లోకి వెళితే మహాత్మా గాంధీ యూనివర్సిటీ లోని బాయ్స్ హాస్టల్ లో విద్యార్థులకు పెట్టే చపాతీల పెనంను గదులు ఊడ్చే చీపురుతో కడుగుతున్న వీడియో ఒకటి ఆదివారం వైరల్ అయింది. దీనికి సంబంధించి పలువురు విద్యార్థి సంఘాల నాయకులు మీడియాతో మాట్లాడారు. ఆదివారం ఉదయం మహాత్మా గాంధీ యూనివర్సిటీలో బాయ్స్ హాస్టల్లో విద్యార్థులకు పెట్టే చపాతీలు పెనంను రూములు ఊడ్చే పొరకలతో కడుగుతూ విద్యార్థులకు కలుషిత ఆహారాన్ని తయారు చేయడం బాధాకరమన్నారు. ఇప్పటికే మాత్మ గాంధీ యూనివర్సిటీలో విద్యార్థులకు అందవలసిన మెనూ సక్రమంగా అందడం లేదని అనేకమార్లు పత్రికలలో వచ్చినా హాస్టల్ నిర్వహణలో ఎలాంటి మార్పు రాకపోవడం విచారకరమన్నారు. విశ్వవిద్యాలయంలో నే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటూ ఉంటే సాధారణ వసతి గృహాల్లో పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని వాపోయారు. తక్షణమే ఇలాంటి వంటలు చేసి విద్యార్థులకు అందిస్తున్న వర్కర్లను మార్చాలని, యూనివర్సిటీ అధికారులు స్పందించి పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన మెను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. లేనిపక్షంలో విద్యార్థి



సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

**ప్రాసెస్ గోయింగ్ ఆన్....**

**డి. రమేష్ (మెస్ డైరెక్టర్ మహాత్మా గాంధీ యూనివర్సిటీ నల్గొండ )**

సెక్యూరిటీ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్యూరిటీలు అందరూ విషయంపై పరిశీలన చేస్తున్నారు. రిపోర్టు రెడీ అవుతుంది. వాస్తవమని తేలితే వారిపై చర్యలు ఉంటాయి. నేడు (సోమవారం) 10 గంటలకు విసి, రిజిస్టర్ లు వస్తారు. నిజమని తెలితే చర్యలు తీసుకుంటామని వారు చెప్పారు. అవునా, కాదా అనేది రిపోర్టులో వెల్లడవుతుంది.

# రామడుగు వీరభద్రాచారికి ఘన సన్మానం



**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం: ప్రముఖ పారంపర్య ఆయుర్వేద వైద్యులు రామడుగు వీరభద్రాచారిని విశ్వకర్మ ఎంప్లాయిస్ ప్రొఫెషనల్స్ డెవలప్మెంట్ సర్వీస్ ఖమ్మం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. కార్తిక వన సమారాధన చెరుకూరివారి మామిడి తోటలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ పారంపర్య ఆయుర్వేద వైద్యులు రామడుగు వీరభద్రాచారిని విద్యుత్ శాఖ ఖమ్మం ఎస్ ఇ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, వేదాస్ అధ్యక్షులు చెన్నోజు పుల్లయ్య , ప్రధాన కార్యదర్శి జయంతి శ్రీనివాస్ , కోశాధికారి సున్నం వెంకట రమేష్ , రాష్ట్ర సంఘం నాయకులు చిట్టోజు రమేష్ తోపాటు సంఘ సభ్యులు వీరభద్రాచారి ని శాలువా కప్పి పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానం చేశారు. పారంపర్య వైద్యులు రామడుగు వీరభద్రాచారి మాట్లాడుతూ ప్రతి ఇరవై ఏడు రోజులకోసారి వచ్చే పుష్యమి నక్షత్రం రోజున ఒక సంవత్సరం నుండి పదహారు సంవత్సరాల లోపు వయసుగల పిల్లలకు ఆయుర్వేద ఇమ్యూనిటి చుక్కలమందు రామభద్ర ఆయుర్వేద మూలికాయోగ పీఠం ఖమ్మం ఆధ్వర్యంలో ఉచితంగా వేస్తున్నట్లు దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విశ్వకర్మ పంచ వృత్తుల వారు యాంత్రికరణ దాటికి తట్టుకోలేక అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఇది మంచిది కాదని, పంచ వృత్తుల వారికి మనోధైర్యం కల్పించేందుకు ఖమ్మం లోని వీడియోస్ కాలనీలో ఉన్న తమ నివాసంలోఉచితంగా కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నమని దీనిని సద్వినియోగం చేసుకోవాలని వీరభద్ర చారి పిలుపునిచ్చారు. ఆయుర్వేద మూలికాయోగ పీఠం చేస్తున్న ఉచిత సేవలకు గుర్తింపుగా ఘన సన్మానం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రజా నాట్యమండలి నూతన కమిటీ ఎన్నిక



**చిట్యాల: అక్షర కలం,**

కళ కాసుల కోసం కాదు,ప్రజలందరి కోసం అని నినదించి, పీడిత ప్రజలను చైతన్య వంతం చేసేది ప్రజా నాట్య మండలి అని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కుమ్మరి శంకర్ అన్నారు.చిట్యాల మండల కేంద్రంలో ఆదివారం నాడు జరిగిన ప్రజా నాట్య మండలి మండల మహాసభ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక,కర్షక, విద్యార్థి, యువజన, మహిళా ఉద్యమాలకు వెన్నంటి ఉండి ,పాలక వర్గ విధానాలను ప్రజలకు వివరించే కళా సంపద ప్రజా నాట్య మండలి అని అన్నారు . మహాసభల ప్రారంభ సూచకంగా ఏర్పాటు చేసిన ప్రజానాట్యమండలి జెండా ను శంకర్ ఆవిష్కరించారు.అనంతరం ప్రజా నాట్య మండలి చిట్యాల మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు.నూతన మండల అధ్యక్షులు గా మేడి లింగస్వామి, కార్యదర్శి గా జిట్ట స్వామి, ఉపాధ్యక్షులు గా పేర్వారం రాములు,వీరమళ్ళ మణెమ్మ,ఎం నవీన్ కుమార్, సహాయ కార్యదర్శిలుగా నాగిళ్ళ కిరణ్,పెరిక సరిత, మేడి రాంబాబు, కోశాధికారిగా గుండె పరమేష్ లతో పాటు మరో పది మంది తో కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి రాష్ట్ర కమిటీ సభ్యురాలు చింత విజయ, మహిళా సంఘం మండల అధ్యక్షురాలు రుద్రారపు పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం...

### - బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు తథ్యం...

### - కొల్చారం మండల యువత విభాగం అధ్యక్షులు తుంకలపల్లి సంతోష్ రావు..

**కొల్చారం, నవంబర్, 09 (అక్షరకలం):-**

జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో మాగంటి సునీతమ్మ గెలుపు తత్యమని తుంకులపల్లి సంతోష్ రావు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రోజుల నుండి ప్రచారంలో ఉన్నామని ప్రజల నుండి బిఆర్ఎస్ పట్ల అపూర్వ స్పందన దివంగత జూబ్లీహిల్స్ ప్రజలకు ఎన్నో సేవలు చేశారని ఇక్కడి ప్రజలు ఆ విషయం మరిచిపోలేదని ప్రజలందరూ తప్పకుండా బిఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేశామని తమతో అన్నట్లు సంతోష్ రావు అన్నారు. పోయిన సంవత్సరం ఎంత మెజారిటీ వచ్చిందో అంతకంటే ఎక్కువ ఈసారి మెజారిటీ వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు ఇక్కడి ప్రజలు కాంగ్రెస్ పార్టీని భారతీయ జనతా పార్టీని నమ్మడం లేదని మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు నడిచిన 10 సంవత్సరాల తెలంగాణకు పేరు ప్రఖ్యాతలు తెచ్చే మాట వాస్తవం కాదా అని అన్నారు. తమను నమ్ముకున్న బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ సతీమణి తప్పకుండా గెలిపిస్తామని అక్కడి ప్రజలు చర్చించుకుంటున్నారని అన్నారు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి దాదాపు 10 15 రోజుల నుండి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని తప్పకుండా బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలిచి తీరుతుందని సంతోష్ రావు దీమా వ్యక్తం చేశారు.



# ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాల పై అవగాహన: -మద్దూరు ఎస్సై విజయ్ కుమార్



**అక్షర కలం నారాయణపేట జిల్లా ప్రతినిధి, నవంబర్,09**



మద్దూరు టౌన్ లో ఎస్సై విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, వాహన పత్రాలు, హెల్మెట్ వినియోగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని సూచిస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై విజయ్ కుమార్ మాట్లాడుతూ... ప్రజల ప్రాణ భద్రత మనందరి బాధ్యత అని ఆటో డ్రైవర్లు ఎల్లప్పుడూ జాగ్రత్తగా వాహనాలు నడపాలనీ చిన్న పాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీస్తుంది అని తెలిపారు. అదేవిధంగా ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను, విద్యార్థులను, కూలీలను ఎక్కించికోరాదని అలాగే ప్రయాణికులతో మర్యాదపూర్వక ప్రవర్తన, చట్ట ఉల్లంఘనలకు పాల్పడరాదని సూచించారు. రాష్ డ్రైవింగ్ చేయరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదు, ఆటో డ్రైవర్లు యూనిఫామ్ ధరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# భారీ ర్యాలీ

**అక్షర కలం**



నారాయణపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు యస్.రాజేందర్ రెడ్డి , జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా తమకు అప్పగించిన బూత్ నెంబర్ 102, 103, 104, 105, 150 మరియు 196 బూత్ లకు సంబంధించి ఎన్నికల ప్రచారం చివరి రోజును పురస్కరించుకొని హిందూ, ముస్లిం, క్రిస్టియన్ లకు చెందిన 2వేల మంది సోదరి, సోదరులతో కలిసి మాజీ మంత్రులు వి .శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి , మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి , మర్రి జనార్దన్ రెడ్డి , పట్నం నరేందర్ రెడ్డి తో కలిసి నారాయణపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు యస్.రాజేందర్ రెడ్డి రెహమత్ నగర్ డివిజన్ లో డప్పు వాయిదాల మధ్య భారీ ఎత్తున ఊరేగింపుగా బిఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ సీరియల్ నంబర్ 3 లోని కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని భారీ ర్యాలీ నిర్వహించారు.



# చిత్తశుద్ధితో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### ఎస్సిఈయు (సిఐటియు) బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్ వెంకటస్వామి

**అక్షర కలం, మందమర్రి నవంబర్ 09:**



సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే స్ట్రక్చరల్ సమావేశాల్లో గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి నేతలు కార్మికుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) బ్రాంచ్ అధ్యక్షులు సాంబారు వెంకటస్వామి సూచించారు. ఏరియాలోని ఆర్కెపి సిహెచ్పి లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సింగరేణి సిఎండి తో నిర్వహించిన స్ట్రక్చరల్ సమావేశంలో కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సింది పోయి బహిష్కరించడం సరైనది కాదన్నారు. నవంబర్ నెలలో డైరెక్టర్ (పా) తో జరుగనున్న స్ట్రక్చరల్ సమావేశంలో సంవత్సరంలో 150/190 మస్టర్లు చేయని వారికి చార్జ్ షీట్, నెలలో 16/20 మాస్టర్లు చేయని వారికి కౌన్సిలింగ్ పెట్టే విధానంపై ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయించాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం డైరెక్టర్ (పా) తో నవంబర్లో జరిగిన సమావేశంలో అంగీకరి%శీ%చిన క్యాడర్ స్కీముల కమిటీ నిర్ణయాన్ని తెలియజేయాలని, ప్రతినెల మెడికల్ బోర్డు జరిపించాలని, నూతన బదిలీ పాలసీ విధానాన్ని సవరించేలా యాజమాన్యాన్ని ఒప్పించాలన్నారు. ఎన్నికలు నిర్వహించి రెండు సంవత్సరాల కాల పరిమితి వచ్చే నెలతో పూర్తవుతుందని, ఇప్పటికైనా ఏఐటీయూసీ తమ మ్యానిఫెస్టోలో పెట్టిన డిమాండ్లన్నీ పరిష్కరించాలని లేదంటే కార్మికుల నుండి వ్యతిరేకత తప్పదని తెలిపారు. గుర్తింపు సంఘం ఇకనైనా యాజమాన్యానికి అనుకూలంగా ఉంటూ, కార్మిక సమస్యలు గాలికి వదిలేసి, కేవలం ఓడిన సంఘాలను విమర్శించడం వలన ఏమీ ఒరగదని, సమస్యలు పరిష్కరించనప్పుడు ప్రతిపక్షంగా చేసే విమర్శలు గెలిచిన వారు ఎదురుకోక తప్పదన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని క్వార్టర్ లేని కార్మికులకు ఇప్పటివరకు ఇంటి కిరాయి ఇప్పించలేదని, 20 లక్షల వడ్డీ లేని రుణం ఊసే లేదని, యాక్టింగ్ పదోన్నతులు లేవని, రిఫరల్ విధానం సరిగా లేదని, క్యాంటీన్లో నాణ్యమైన టిఫిన్ అందుబాటులోకి తేవడం లాంటి విషయాల పైన ఒప్పందాలు చేసుకొని, కార్మికులకు తీపి కబురు అందించాలన్నారు. ఈ సందర్భంగా యూనియన్ లో కొత్తగా చేరిన జోగేష్ ను ఉపాధ్యక్షులు రామగిరి రామస్వామి యూనియన్ కండువా కప్పి, సాదరంగా ఆహ్వానించగా, యూనియన్ సిహెచ్పి నూతన ఇంచార్జ్ అయిందాల శ్రీనివాస్, పిట్ కార్యదర్శిగా గుజ్జ సతీష్ ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి అల్లి రాజేందర్, ఉపాధ్యక్షులు వడ్లకొండ ఐలయ్య,చింతం రుకుమయ్య, లింగాల రమేష్, సత్యనారాయణ, సయ్యద్ అమీర్ లు పాల్గొన్నారు.

# ముగిసిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం....





**కొల్చారం, నవంబర్ 09( అక్షర కలం ):**

ఆదివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో భాగంగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి ఆదివారం బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఎర్రగడ్డ డివిజన్ లోని ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం విస్తృతంగా నిర్వహించారు, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఇంటింటికీ తిరిగి ఓటర్లకు తెలియజేస్తూ, మాగంటి సునీతను బలపరుస్తూ , కారుగుర్తుకు ఓటు వేయాలని చెప్పారు. ఎమ్మెల్యే తో పాటు కొల్చారం మండలం చెందిన బి ఆర్ఎస్ పార్టీ నాయకులు మండల యువత విభాగం అధ్యక్షులు తుంకులపల్లి సంతోష్ రావు , కొమ్ముల యాద గౌడ్ , గౌరీ శంకర్ బి ఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం అందరికీ చేరే విధంగా చర్యలు తీసుకోవాలి

### తెలంగాణ బలహీనవర్గాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజలింగు మోతె

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 09:**



న్యాయం అందరికీ చేరే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ బలహీనవర్గాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజలింగు మోతె తెలిపారు. ఆదివారం జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని రామకృష్ణాపూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు న్యాయం అందుబాటులో ఉండేలా వ్యవస్థను బలపరచడం, గ్రామ స్థాయి వరకు ఉచిత న్యాయ సేవా కేంద్రాలు, లోక్ అదాలత్‌లు, లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడం ద్వారా బలహీన వర్గాలు న్యాయం పొందేలా అధికారులు చూడాలన్నారు. పాలకులు ప్రజల్లో న్యాయ అవగాహన పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలని, పాఠశాలలు, కళాశాలలు, గ్రామ సభలు, మహిళా సంఘాలు వంటి వేదికల ద్వారా హక్కులు, బాధ్యతలపై విద్య అందించాలన్నారు. న్యాయ సేవలలో పారదర్శకత, వివక్ష లేకుండా సేవలు అందించడం అధికారుల ప్రాథమిక బాధ్యత అని అన్నారు. ప్రతి పౌరుడు చట్టం ముందు సమానుడనే భావనను అమలు చేయడం వారి కర్తవ్యమన్నారు. మహిళలు, బాలలు, దివ్యాంగులు, దళితులు, గిరిజనులు, వృద్ధులు వంటి వర్గాలకు న్యాయం అందించడంలో ప్రత్యేక దృష్టి అవసరమన్నారు. అధికారులు ఈ వర్గాలకు న్యాయ సహాయం పొందే మార్గాలను సులభతరం చేయాలన్నారు. న్యాయ సేవల సంస్థలు, పోలీసు శాఖ, సామాజిక సంక్షేమ విభాగం, ఎన్జీఓలు వంటి సంస్థలతో కలిసి పని చేయడం ద్వారా సమగ్ర న్యాయ సేవలు అందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బలహీనవర్గాల సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు తోకల రవి పాల్గొన్నారు.

## మత రాజకీయాలను తిప్పికొట్టాలి..బండారు రమేష్ సిపిఎం రాష్ట్ర నాయకులు

**వలిగొండ నవంబర్ 09 అక్షరకలం:**

మతం పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజల్లో అనైక్యత సృష్టిస్తున్న మత రాజకీయాలను తిప్పి కొట్టాలని,సిపిఎం రాష్ట్ర నాయకులు బండారు రమేష్ అన్నారు.మండల పరిధిలోని సంగెం గ్రామంలో నిర్వహించిన ప్రజానాట్యమండలి జిల్లా స్థాయి సాంస్కృతిక వైజ్ఞానిక శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో మత స్వేచ్ఛ ప్రతి పౌరునికి ఉందని,కానీ దాన్ని రాజకీయాలకు వాడుకోకూడదని,చెప్తున్నప్పటికీ దేశానికి పాలకులుగా ఉన్న బిజెపి మతం పేరుతో,దేశంలో ప్రజల మధ్యన ఉద్రిక్తతలు సృష్టిస్తుందన్నారు.మతం వేరని,రాజకీయాలు వేరని,దృష్టిని మర్చిపోయి పాలకులుగా ఉన్న వారే మతాన్ని రాజకీయాలకు ముడిపెట్టడం దుర్మార్గమన్నారు.మతం పేరుతో రాజకీయాలు చేస్తున్న రాజకీయ పార్టీల విధానాలను ప్రజలు అర్థం చేసుకోవడంతో పాటు దాన్ని ఓడించడమే ఏకైక కర్తవ్యమన్నారు.శిక్షణ తరగతులు దేశపాక రవి వ్యవహరించగా,ఈ శిక్షణా తరగతుల్లో ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంటిపాక శివ, ఈర్లపల్లి ముత్యాలు,సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి,సిపిఎం శాఖ కార్యదర్శి భీమనబోయిన జంగయ్య,పిఎన్ఎం జిల్లా మండల నాయకులు,గోషిక కరుణాకర్,గంటేపాక శ్రీకృష్ణ,మేడిముకుంద,రాధారపు మల్లేశం,రుద్రపల్లి రామలింగం,ఏటెల్లీ నరసింహ,ఎర్ర వెంకటేశం,తదితరులు పాల్గొన్నారు.




## తైక్వాండో ద్వారా విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి.




**చిట్యాల ,: అక్షర కలం ప్రతినిధి**

ప్రభుత్వం క్రీడ శాఖకు పెద్దపీట వేయడం జరుగుతుందని నల్లగొండ జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి డివైస్ ఓ మహమ్మద్ అక్బర్ తెలిపారు. ఆదివారం నాడు చిట్యాల పట్టణ కేంద్రంలో గల జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో జిల్లా తైక్వాడ్ కలర్ బెల్ట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. చిట్యాల, రామన్నపేట, నార్కట్పల్లి నుంచి 40 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 10 ఎల్లో, 5 బ్లూ వన్, 5 ఎల్లో వన్, 9 గ్రీన్, 6 గ్రీన్ వన్ , 4 బ్లూ, 2 బ్లూ వన్, 2 రెడ్ బెల్టులను విద్యార్థులు సాధించారు. విజయం సాధించిన విద్యార్థులకు బెల్టులను ప్రధానం చేశారు.ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రానిచ్చి ప్రభుత్వం రెండు శాతం స్పోర్ట్స్ కోటాను ఉన్నత చదువులకు. ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ సుధాకర్, కోచ్ పి పనింద్ర కుమార్, డి వైష్ణవ రెడ్డి తదితరు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

**వలిగొండ నవంబర్ 09 అక్షరకలం:**

మండల పరిధిలోని అరుర్ సబ్ స్టేషన్ పరిధిలోని అరుర్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా 33/11 కేవీ ఆరూర్ సబ్ స్టేషన్, 33/11 కెవి వెలువర్తి సబ్ స్టేషన్, 33/ 11 కెవి పులిగిల్ల సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు ఆరూరు,అప్పారెడ్డి పల్లి,జంగారెడ్డిపల్లి, ముద్దాపురం,వెలువర్తి, నర్సాయిగూడెం,పులిగిల్ల,కంచనపల్లి,మొగిలిపాక గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుంది. ఉదయం 09.00 గంటల నుండి మధ్యాహ్నం 01.00 గంటల వరకు విద్యుత్ వినియోగదారులు,రైతులు సహకరించాలని,విద్యుత్ శాఖ ఏఈ నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు..

## ఆడపిల్ల వివాహానికి చేయూత



**వలిగొండ నవంబర్ 09 అక్షరకలం:**

మండల పరిధిలోని రెడ్లరేపాక గ్రామానికి చెందిన షేక్ జాఫర్ కుమార్తె వివాహం భువనగిరిలో ఏకే ప్యాలెస్ (పంక్షన్ హాల్) లో ఘనంగా జరిగింది.ఈ వివాహానికి అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుర్రం లక్ష్మారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి ఆడపిల్ల పెళ్లి కానుకగా పది వేల రూపాయలను వధువు తల్లిదండ్రులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నోముల మల్లేష్,ఖమ్మంపాటి రమేష్, కందుల శ్రీను,మహ్మద్ జానీపాషా,మాద ప్రశాంత్, దంతూరి నర్సింహ,బందారపు వెంకటేష్,మహ్మద్ కైఫ్, పాల్గొన్నారు.

## త్వరగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి




**చెన్నూర్ నవంబర్ 09 అక్షర కలం ప్రతినిధి:-**

చెన్నూరు నియోజకవర్గం భీమారం మండల బూర్గుపెల్లి గ్రామంలో రోడ్డు సౌకర్యం లేక నరకయాతన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎమ్మెల్యే బాల్క సుమన్ 2023లో బూరుగుపల్లి నుండి దంపూర్ గ్రామం వరకు 3కోట్ల 34లక్షలు రూపాయలు ప్రొసీడింగ్ ఇవ్వడం జరిగింది. ఎన్నికలు రావడం తో ఆగిన పనులు ఇప్పటికి పూర్తి చెయ్యలేక పోతున్న పాలకులుబూర్గుపెల్లి నుండి దాంపూర్ గ్రామం వరకు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిందని, గతంలో ఉన్న పాలకులు నూతన రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలిచారని, అది కార్యరూపం దాల్చలేదని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం నూతన రోడ్డు నిర్మాణం చేస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి శిలాఫలకం ఏర్పాటు చేసారే తప్ప తమ సమస్య మాత్రం తీరలేదని ఆదివారం రైతులు వాపోయారు. ఇరు గ్రామాలకు ప్రధాన రహదారి అవడంతో కనీసం నిడిచి వెళ్లే పరిస్థితులు కూడా లేవని, పొలాలకు వెళ్లి వ్యవసాయం కూడా చేయలని పరిస్థితులు తలెత్తాయని,అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని,ఇకనైనా మంత్రి వివేక్ వెంకటస్వామి స్పందించి నూతన రోడ్డు నిర్మాణం చేపట్టి తమ కష్టాలను తీర్చాలని, లేనట్లయితే గ్రామస్తులమంతా కలసి నిరసన కార్యక్రమాలు చేపడుతామని రైతులు హెచ్చరించారు.

## కాంక్రీట్ మిక్సింగ్ మిల్లర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి

**మందమర్రి/ చెన్నూర్ నవంబర్ 09 అక్షర కలం ప్రతినిధి:-**

మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ ట్రాన్స్మిషన్ లైన్ లో కాంక్రీట్ పనిచేయడానికి బీహార్ నుండి కొంతమందితో కలిసి కాచు ప్రసాద్ అనే వ్యక్తి 43 సంవత్సరాలు, పాట్నా బీహార్ నుండి పనిచేయడానికి వచ్చాడు. మృతుడు ఆదివారం మధ్యాహ్నం ఊరు మందమర్రి సబ్ స్టేషన్ వెనకాల ఉన్న స్థలంలో కాంక్రీట్ పని చేసి డ్యూటీ పని వారితో మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత పని ప్రదేశానికి దగ్గరలో ఉన్న పత్తి చేనులో పడుకున్నాడు, సమయం అందాజ మూడున్నర గంటల సమయంలో కాంక్రీట్ మిక్సింగ్ మిల్లర్ అక్కడికి రాగా ఆ వాహనం డ్రైవర్ నిర్లక్ష్యంగా చూసుకోకుండా నిద్రపోతున్న కాచు ప్రసాద్ తల మీద నుండి వెళ్ళింది.



ఈ సంఘటన గురించి సమాచారం రాగానే మందమర్రి సీఐ, ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని, స్థలాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మృతుని బంధువులకు సమాచారం అందించారు. వారు వచ్చిన తర్వాత ఫిర్యాదు తీసుకొని దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

## మంత్రులు బట్టి,పొంగులేటి బచ్చోడు గ్రామాన్ని మండలం చేస్తానన్న ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి.

### బచ్చోడు మండల సాధన కమిటీ

**అక్షర కలం/పాలేరు:**

2021 లో ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో కాంగ్రెస్ పార్టీ సీఎల్పీ లీడర్ ఈనాటి ఉప ముఖ్యమంత్రి ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క. 2023 నవంబర్ 9న కాంగ్రెస్ పార్టీ పాలేరు నియోజకవర్గ అభ్యర్థిగా ప్రచారంలో భాగంగా బచ్చోడు వచ్చిన సందర్భంగా పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి బచ్చోడు గ్రామాన్ని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల లోపు బచ్చోడు గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తానని ఇద్దరు మంత్రులు హామీ ఇచ్చినారు ఇచ్చిన హామీని అమలు చేయాలని బచ్చోడు గ్రామాన్ని నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఆదివారం బచ్చోడు మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో బచ్చోడు గ్రామ సెంటర్ అమరజీవి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర రాస్తారో చేయటం జరిగింది. ఈ రాస్తారోకోలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా), భారత రాష్ట్ర సమితి ( బిఆర్ఎస్), భారత కమ్యూనిస్టు మార్క్ లిస్ట్ పార్టీ (సిపిఐ.ఎం), సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా నాయకులు తిమ్మిడి హనుమంతరావు పాల్గొని మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కేసీఆర్ ముఖ్యమంత్రి ఉన్న సమయంలో చిన్న మండలాలు. చిన్న జిల్లాలు అయితే ప్రజలకు పరిపాలన సౌలభ్యం కోసం అందుబాటులో ఉంటాయని ఏర్పాటు చేశారు. తిరుమలాయపాలెం మండలం పెద్దగా ఉన్నందున 25 గ్రామ పంచాయతీల తోటి బచ్చోడు గ్రామాన్ని సెంటర్ చేసి నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఇచ్చిన హామీని మంత్రులు వెంటనే అమలు చేయాలని భవిష్యత్తులో పాదయాత్రలు. నిరాహార దీక్షలు కూడా చేయటానికి సిద్ధంగా ఉన్నామని . మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇచ్చిన హామీ రెండు సంవత్సరాలు ఈరోజుతో పూర్తవుతున్నదని తిమ్మిడి హనుమంతరావు అన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మంత్రులు కానీ. కాంగ్రెస్ పార్టీ కానీ సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని బచ్చోడు గ్రామం మండలం అయితే 25 గ్రామాలకు పరిపాలన సౌలభ్యం కు సెంటర్ గా ఉంటుందని అలాంటి బచ్చోడు గ్రామాన్ని మండలం చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఉందని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు జక్కుల యాదగిరి మాట్లాడుతూ ప్రజలందరూ రాజకీయాల అతీతంగా కులమతాలకు అతీతంగా వర్గాలు ప్రజలు పోరాటాల్లో పాల్గొని బచ్చోడు మండలాన్ని సాధించాల్సిన అవసరం ఉందని అన్నారు. సిపిఎం నాయకులు తాటికొండ అనంత చారి మాట్లాడుతూ కూసుమంచి మండలంలోని ఐదు గ్రామపంచాయతీలు తిరుమలాయపాలెం మండలంలోని 20 గ్రామపంచాయతీలో కలుపుకొని మొత్తం 25 గ్రామపంచాయతీల తోటి బచ్చోడు గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తే ప్రజలకి పరిపాలన సౌలభ్యం అందుబాటులో ఉంటుందని గ్రామం మారుమూల ఉన్నటువంటి దాన్ని సుబ్లేడు గ్రామాన్ని మండలం చేస్తానంటే సహించేది లేదని బచ్చోడు మండలం కోసం




ప్రాణ త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ బచ్చోడు గ్రామ అధ్యక్షుడు జక్కుల యాదగిరి. అంగిరేకుల రమణారావు. మాస్ లైన్ నాయకుడు వెన్న బోయిన శ్రీనివాసరావు. వెంకటరమణ. గొర్రెపాటి వీరయ్య. సిపిఎం గ్రామ కార్యదర్శి గుండమాల ఉపేందర్ . తాటికొండ ధర్మాచారి. న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్. గొర్రెపాటి వీరస్వామి. కొత్తపల్లి శ్రీను. పి డి ఎస్ యు ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి తిమ్మిడి రఘుబాబు.ఆటో యూనియన్ నాయకులు దారమళ్ళ శ్రీరాములు. కోటయ్య. రవి. రమేష్. కిషన్. పుట్ట బంతి వెంకన్న. రామనబోయిన హుస్సేన్. దుండి ఉప్పయ్య. పసుల లింగయ్య. పుట్ట బంతి రాజు. అబ్బాస్. తదితరులు.

# జూబ్లీహిల్స్ లో రానున్నది.. కాంగ్రెస్ ఘన విజయమే

## ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి

## రాష్ట్ర మంత్రులు పొంగులేటి, అజారుద్దీన్ తో కలిసి విస్తృత ప్రచారం

**అక్షర కలం/ హైదరాబాద్:**



హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో రానున్నది కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘన విజయమేనని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో భాగంగా.. గత 15 రోజులుగా ప్రచారం చేస్తున్న ఎంపి రఘురాం రెడ్డి.. ఆదివారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ తో కలిసి కొల్లూరు కాలనీలో.. విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో.. ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి విశేష కృషి జరుగుతోందని తెలిపారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతున్నాయని, అన్ని ప్రాంతాల్లో లబ్ధిదారులకు సన్న బియ్యం అందజేసేందుకు రేషన్ షాపు లు ఏర్పాటు చేశామని, జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో.. మాజీ ఎమ్మెల్సీ భూపతి రెడ్డి, నాయకులు భరత్, తదితరులు పాల్గొన్నారు.

# "సర్"కు సన్నద్ధం

## ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కోసం ఏర్పాట్లు

## నాలుగు కేటగిరీలుగా విభజించి తయారీ

## 2002 ఓటరు లిస్టు ప్రామాణికంగా కసరత్తు

## బోగస్ ఓట్లకు చెక్పడే అవకాశం.!

## నల్లగొండ జిల్లాలో 15.20 లక్షల ఓటర్లు

**అక్షరకలం ప్రతినిధి, నల్గొండ**

నకిలీ ఓట్ల తొలగింపు, తప్పుల సవరణే లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) చేపట్టగా.. దీనికోసం నల్గొండ జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. త్వరలో అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు జాబితాను పరిశీలించనున్నారు. దీంతో బోగస్ ఓట్లకు చెక్ పడే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం రెండు దశాబ్దాలకు ఒకసారి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే నిర్వ హిస్తుంది. గతంలో 2002లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ జరగగా.. 23 ఏళ్ల తర్వాత మళ్లీ నిర్వహించబోతున్నారు. అప్పటి జాబితాలను పరిగణలోకి తీసుకుని సవరణ చేయనున్నారు. దీనిపై రాష్ట్ర ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి పలు దఫాలుగా కలెక్టర్, ఎన్నికల అధికారులతో వీసీ నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

### ఓట్లు గల్లంతు...

ఏటా ఓటర్ల జాబితా సవరించే కార్యక్రమం నడుస్తోంది. అయితే చాలాచోట్ల బోగస్ ఓట్లు ఉన్నాయని, అలాగే ఓట్లు గల్లంతయ్యాయనే ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. ఎన్నికల సమయంలో ఓటు వేయడానికి వెళ్లిన ప్రజలు తమ ఓట్లు గల్లంతయ్యాయంటూ ఆందోళనలనకు దిగుతుండడం సర్వసాధారమైపోయింది. మరి కొందరికి పట్టణాల్లో రెండు, మూడు వార్డుల్లో ఓట్లు ఉండటం, అలాగే పట్టణాల్లో ఓట్లు ఉన్న వారికి పల్లెల్లోనూ ఓట్లు ఉండటం వంటివి చూస్తుంటాం. మున్సిపాలిటీ ఎన్నికలు జరిగి నప్పుడు పట్టణాల్లో ఓటు వేయడం, పంచాయతీ ఎన్నికలు జరిగినప్పుడు పల్లెల్లో ఓటు వేయడం ద్వారా పలువురు ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారి ఓట్లు కొందరు రాజకీయ నాయకులు తమ అవసరాల కోసం పట్టణాల్లో నమోదు చేయిస్తుంటారు. పట్టణాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగినప్పుడు వారంతా వచ్చి ఓట్లు వేయడం ద్వారా గెలుపోటములను శాసిస్తుంటారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ద్వారా బోగస్ ఓటర్లు బయట పడే అవకాశాలు ఉంటాయి. వాటిని తొలగించడం ద్వారా బోగస్ ఓట్లకు చెక్ పడే అవకాశాలు ఉంటాయని భావిస్తున్నారు.




### బీఎల్ ఓలకు జాబితాలు...

2002 ఓటర్ల జాబితా ప్రామాణికంగా సమగ్ర సవరణ జరగనుంది. క్షేత్రస్థాయిలో పనిచేసే బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ ఓ)కు ఓటర్ల జాబితాలను అందించనున్నారు. ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ద్వారా ఓటర్లు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన ఓట్లు ఎక్కడెక్కడ ఉన్నాయన్నది వెల్లడవుతుంది. ఓటర్ల జాబితా సవరణ సందర్భంగా తమ కుటుంబసభ్యుల ఓట్లు ఎక్కడ నమోదై ఉన్నాయి. ఇప్పుడు వారు ఎక్కడ ఉన్నారన్న వివరాలు వెల్లడించాల్సి ఉంటుంది. ఇదే సమయంలో బూత్ లెవల్ అధికారులు అడిగినప్పుడు తమకు సంబంధించిన ఆధారాలనూ చూప్వాల్సి ఉంటుంది. ఎలక్షన్ కమిషన్ సూచించిన 11 రకాల ధ్రువీకరణ పత్రాల్లో ఏదైనా ఒకటి చూపించాలి. ఇదే సమయంలో కుటుంబ సభ్యుల ఓట్లు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలిసిపోతుంది. అన్నీ సక్రమంగా ఉంటే కుటుంబ సభ్యుల ఓట్లన్నింటినీ ఒకే జాబితాలో చేర్చే అవకాశం ఉంటుంది.

### ఏ, బీ, సీ, డీ కేటగిరీలు...

ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కోసం 2002 ఓటర్ల జాబితాతోపాటు 2025 ఓటర్ల జాబితాల్లో నమోదైన వారి వివరాలను ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా విభజించి సవరణ చేస్తారు. ఇప్పటికే నల్గొండ జిల్లావ్యాప్తంగా సవరణ ప్రక్రియ మొదలైంది. బూత్ లెవల్ అధికారులు(బీఎ లీఓ)లు ఈ పనిలో నిమగ్నమయ్యారు. 40 ఏళ్ల పైబడి ఉండి, 2002 లో, 2025 లో ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదైన వారు ఏ కేటగిరిలో, 40 ఏళ్ల పైబడి 2002 ఓటర్ల జాబితాలో పేరు లేకుండా 2025 లో ఓటరుగా నమోదైన వారి వివరాలను బీ కేటగిరిలో ఉంటారు. 21 - 38 ఏళ్ల లోపు వారు 1987 నుంచి 2004 మధ్య కాలంలో జన్మించిన వారిని సీ కేటగిరిలో, 18-20 ఏళ్లలోపు అంటే 2004 తర్వాత జన్మించిన వారి జాబితాను డీ కేటగిరీలో చేరుస్తారు.

### 15.20 లక్షలు..

నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం సుమారు 15.20 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. 2002లో ఓటర్ గా ఉండి 2025 లో కూడా ఓటరుగా ఉన్నవారు దాదాపు 4.10 లక్షల మంది ఉన్నారు. ఇందులో వీరి కుటుంబ సభ్యులు 1.20 లక్షల మందిని ఓటర్లు గా అధికారులు నమోదు చేశారు.

### షెడ్యూల్ మీదే ఆధారం...

నల్లగొండ జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం ఇంకా ప్రారంభం కాలేదు. దీనికి సంబంధించిన షెడ్యూల్ వచ్చాకే ప్రారంభమవుతుందని, షెడ్యూల్ త్వరలోనే వస్తుందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. షెడ్యూల్ వచ్చాక బిఎల్వోలు డోర్ టు డోర్ వెళ్లి వివరాలను తెలుసుకొని నమోదు చేస్తారు. 2002 ఓటర్ జాబితాలో ఉండి 2025 లో ఉన్న ఓటర్లు ఎంతమంది అన్నది అధికారులు ఇప్పటికే మ్యాపింగ్ చేశారు.

# లంబాడీల వనభోజనం మహోత్సవ కార్యక్రమం విజయవంతం.







**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం రఘునాథపాలెం ఆర్ జి బి మామిడి తోటలో ఆదివారం లంబాడి కులా ఉద్యోగ , ఉపాధ్యాయ , రాజకీయ , వ్యాపార వర్గాలకు చెందిన వేలాడి కుటుంబాలు ఏకమై కార్తీక వన భోజన మహోత్సవ కార్యక్రమాన్ని ఎంతో అంగరంగ వైభవంగా సాంప్రదాయ , సాంస్కృతిక పద్ధతిలో ఘనంగా జరుపుకున్నారు . మర్చిపోతున్న లంబాడీల వేసా, భాష , సంప్రదాయలను ఈతరం పిల్లలకు అర్థమయ్యేలా కట్టుబాట్లను నేర్పించి ఉన్నత చదువులు చదివించి దేశానికి సమాజానికి ఉపయోగపడేలా చూడాలి అన్నారు . రాజకీయ రంగంలో సైతం ఐక్యమత్యంగా ఉండి రాజాధికారం దిశగా అడుగులు వేయాలని తెలిపారు . ఈ కార్యక్రమంలో కన్వీనర్ పోరిక రాములు నాయక్ , కో కన్వీనర్ భూక్య మంగ్యా నాయక్ , ట్రెజరర్ మంగిలాల్ జాదవ్ , ప్రముఖులు మాజీ ఎమ్మెల్యేలు చంద్రావతి , హరిప్రియ నాయక్ , ఖమ్మం మాజీ మేయర్ పాపాలాల్ , టీఎస్ టిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బానోత్ వీరు నాయక్ , కుల సంఘం నాయకులు రాజకుమార్ జాదవ్ , బిక్షపతి రాథోడ్ , బాల్ సింగ్ , జి రమేష్ , కిషన్ నాయక్ , దశరధి నాయక్ , చక్రవర్తి , హదిరామ్ , పాపాలాల్ , రామారావు , బన్సీ లాల్ , సీతారాం , దేవా సింగ్ , నాగు , దాసు , గౌతమి , జ్యోతి , ఇందిరా తదితరులు పాల్గొన్నారు .

# ఘనంగా ఏటిఏ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..కల్లూరి జయబాబు



**ా అక్షర కలం/ భద్రాచలం**

ఈరోజు న భద్రాచలం మండల అధ్యక్షులు రేసు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ పద్నాలుగో వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమను స్థానిక అంబేద్కర్ సెంటర్ నందు ఏర్పాటు చేశారు . ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఏటిఏ రాష్ట్ర అధ్యక్షులు కల్లూరి జయబాబు పాల్గొని ఏ టి ఏ జెండాను ఆవిష్కరించి, మాట్లాడారు. ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ రెండువేల పన్నెండు సంవత్సరంలో స్థాపించిన నాటి నుండి నేటి వరకు అనేక ఆదివాసి ఉపాధ్యాయల సమస్యలను పరిష్కరించిందని, ఏజెన్సీలో వంద. శాతంపదోన్నతులు సాధించి పెట్టిందని, ఏజెన్సీ ప్రాంత ఉద్యోగులకు అదనపు అడిషనల్ ఏజెన్సీ అలవెన్స్ జీవోను సాధించిపెట్టిందని, జీవో నెంబర్ మూడు పునరుద్ధరణకు అనేక ఉద్యమ కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. అదేవిధంగా భవిష్యత్తులోఏజెన్సీ ప్రాంతంలో లోకల్ క్యాడర్ నందు ఆదివాసులకు ఉద్యోగ కల్పనకు భారత రాజ్యాంగం ఆర్టికల్ రెండువందల నలభై నాలుగు(ఒక్కటి) అనుసరించి ఐదవ షెడ్యూల్ పేరా (రెండు) ప్రకారంగా ప్రత్యేక చట్టం తీసుకురావడానికి ట్రైబల్ అడ్వైజరి కౌన్సిల్ తీర్మానం చేసి, రాష్ట్ర అసెంబ్లీ ఆమోదంతో "ప్రత్యేక చట్టం" తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . గత జీవో ఎంఎస్ నెంబర్ 3 ప్రకారంగా పొందిన లోకల్ బాడీ ఉద్యోగులలో రాష్ట్రవ్యాప్తంగా పరిశీలిస్తే ఇరవై రెండుశాతం కంటే ఎక్కువ రిజర్వేషన్ పొందలేదని, తెలంగాణ రాష్ట్రంలో మొత్తం అరువందల పది మండలాల్లో కేవలం ఏజెన్సీ ప్రాంతం యాభై మండలాల్లో మాత్రమే ఉందని, ఈ చిన్న ఏరియాలో సుప్రీం కోర్ట్ జడ్జిమెంట్ యాభై శాతం రిజర్వేషన్ మించలేదని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మరొక జీవో ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న గ్రేడ్ -రెండవ భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల అఫ్ గ్రేడేషన్ ప్రక్రియకు ప్రత్యేక చొరవ చూపాలని, అప్గ్రేడ్ అయిన కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలకు ఉపాధ్యాయ మరియు బోధనేతర సిబ్బంది పోస్టులు మంజూరు చేసి నియమకాలు చేపట్టాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏటిఏ రాష్ట్ర కార్యదర్శులు సోయం హనుమంతరావు, కల్లూరి బొర్రయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి సవలం వీరస్వామి, జిల్లా సంయుక్త కార్యదర్శి కొర్స చిట్టిబాబు, సోడి శ్రీదేవి, కాక కృష్ణవేణి, కారం గాంధీ, సోయం కృష్ణ, సోడి సత్యప్రసాద్, సోయం రమేష్ బాబు, నాగభూషణం, రఘు, కుర్సం శ్రీను , గట్టుపల్లి శేషగిరిరావు పాల్గొన్నారు.

# ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు ఎర్ర జెండా ప్రత్యామ్నాయం..

**అక్షర కలం/ కారేపల్లి:**

ప్రపంచంలో ఈ భూమి మీద ఎక్కడైనా ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలకు వాటి పరిష్కారానికి ప్రత్యామ్నాయం ఎర్రజెండా మాత్రమే చూపగలదని సిపిఎం సింగరేణి మండల కార్యదర్శి కే నరేంద్ర వక్కానించారు. అరాచక శక్తుల చేత చంపబడిన సిపిఎం నాయకుడు నిత్య స్ఫూర్తి ప్రదాత, పోరాట యోధుడు కామ్రేడ్ వినోద రావు రవికుమార్ 29వ వర్ధంతి పార్టీ మండల కమిటీ సభ్యులు, బాజు మల్లాయిగూడెం శాఖ కార్యదర్శి వల్లబోయిన కొండలరావు అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో కే నరేంద్ర మాట్లాడుతూ నేడు ప్రపంచంలో అమెరికా సామ్రాజ్యవాదం ఆయుధాలతో తనకు ప్రత్యామ్నాయం చూపే తన మిత్రులను తన ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి చేస్తున్న ఉక్రెయిన్ రష్యా, ఇజ్రాయిల్ అనేక దేశాల మీద దాడులు చేస్తున్నాయని ఇది మొదటి రకమని, టారిఫ్ లతో ట్రంప్ మరో రకమైన యుద్ధం చేస్తున్నాడని ఈ కారణంగా అమాయకులు, పేదలు మరణిస్తూ ప్రపంచ ప్రజలకు సమస్యగా పెట్టుబడిదారీ విధానం మారిందని దీనికి ప్రత్యామ్నాయంగా సోషలిజం అవలంబిస్తున్న పేదరిక నిర్మూలన, అమెరికా సామ్రాజ్యవాధాన్ని ఎదిరిస్తూ చైనా, వియత్నం, క్యూబా, ఉత్తరకొరియా, లావోస్ వంటి కమ్యూనిస్టు దేశాలు, ప్రపంచీకరణను వ్యతిరేకిస్తూ ప్రత్యామ్నయం చూపుతున్న వామపక్ష ప్రభుత్వాలైన వెనిజులా ,బొలివియా, శ్రీలంక వంటి దేశాలు ప్రపంచ ప్రజలకు స్ఫూర్తినిస్తున్నాయని ఈ కారణంగా అభివృద్ధి నిరోధక అతి మితవాద విధానాలతో పేట్రేగిపోతున్న ట్రంప్, నరేంద్ర మోడీ వంటి వారు మతం, కులం, ప్రాంతాన్ని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తూ అధికారంలోకి వచ్చి అశ్రితపక్షపాతంతో కార్పొరేట్లకు ప్రజా సంపదను దోచిపెడుతూ ప్రజలకు ఏదో చేస్తున్నట్టుగా నమ్మబలుకుతూ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పేదరికాన్ని నిర్మూలించడంలో భారతదేశంలో కేరళ వామపక్ష ప్రభుత్వం, చైనా కమ్యూనిస్టు ప్రభుత్వం చేసిన కృషి ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని అది ఎర్రజెండా గొప్పతనం అని కొనియాడారు. ఎన్నికల్లో గెలుపు కోసం అనేక అడ్డదారులు తగ్గుతూ రాజ్యాంగ సంస్థలను




దుర్వినియోగ పరుస్తూ, రాజ్యాంగాన్ని తూలనాడుతూ వ్యవహరిస్తున్న తీరు నేటి బీహార్ ఎన్నికలు సాక్ష్యం అని విమర్శించారు. అట్టడుగున ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఇతర కులాలలో పేదలు వారి ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడటం నేటి కమ్యూనిస్టుల కర్తవ్యం గా ఉండాలని అదే వినోద రావు రవికుమార్ కి ఇచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. కేంద్రంలో బిజెపి అయినా, రాష్ట్రంలో కాంగ్రెస్ అయినా ప్రజలిచ్చిన అధికారాన్ని దుర్వినియోగపరుస్తూ ఇచ్చిన హామీలను అమలు జరపకుండా అధికార ప్రతిపక్షాలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం మినహా ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. నేడు ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవటం కోసం ప్రజలను చైతన్యపరిచి పోరాడుతామని హెచ్చరించారు. వినోద రావు రవికుమార్ స్తూపం ముందు జెండాను పార్టీ నాయకులు షేర్ వెంకటేశ్వర్లు ఎగురవేశారు. ఈ వర్ధంతి సభలో పార్టీ సీనియర్ నాయకులు రాచబంటి పుల్లయ్య, ఎర్రిపోతు భద్రయ్య, మన్యం బ్రహ్మయ్య, పోతురాజు చంద్రావు, మండల కమిటీ సభ్యులు యనమనగండ్ల రవిబాబు,అజ్మీర శోభన్ బాబు, శాఖ కార్యదర్శి రేమల్లె వీరస్వామి, సోషల్ మీడియా కన్వీనర్ ధరావత్ వినోద్ కుమార్, రాచర్ల విజయ్ ,ఎస్ కే సైదులు, రేమల్ల బాబు, పుప్పాల మల్లయ్య, మాచర్ల రమేష్, వినోద రావు రవికుమార్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# నూతన కమిటీ ఏకగ్రీవం.

**అక్షర కలం /భద్రాచలం**

ఈరోజు భద్రాచలం పట్టణ క్లాత్ %౮% రెడిమేడ్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక సందర్భంగా అసోసియేషన్ సభ్యులందరూ కలిసి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన క్లాత్ రెడీమేడ్ అసోసియేషన్ అధ్యక్షులుగా దొడ్డిపట్ల కోటేష్, (ఆర్ కె షాపింగ్ మాల్), కార్యదర్శిగా గుడుమాసు ప్రసాద్, (లక్ష్మీ టెక్స్ టైల్స్), కోశాధికారిగా దొడ్డిపట్ల శ్రీనివాస్,(బాలదుర్గ టాప్ ఇన్ టౌన్ ). ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు దోడిపట్ల కోటేష్ మాట్లాడుతూమా ఈ ఎన్నికను ఏకగ్రీవంగా జరిపించినటువంటి పాత కమిటీ సభ్యులకు, అసోసియేషన్ సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ లోని ఏ ఒక్కరికి సమస్య వచ్చిన ముందుండి పరిష్కరించేందుకు నా వంతు కృషి చేస్తానని,భద్రాచలంలోని వస్త్ర వ్యాపారలను మెరుగుపరిచేందుకు కమిటీ సభ్యుల సూచనలు మేరకు మంచి ఆలోచన నిర్ణయాలు తీసుకుంటానని, అసోసియేషన్ సభ్యులందరూ కలిసి తనకు ఇచ్చిన ఈ గొప్ప బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం క్లాత్ %౮% రెడిమేడ్ అసోసియేషన్ లోని సభ్యులందరూ పాల్గొన్నారు.



అక్షరకలం
APTELRNI No. 2009/27246

## ఫింగర్ ప్రింట్స్ డివైస్ తో తనిఖీలు: మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి

జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు .





**అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 09.**

మక్తల్ మండల కేంద్రంలో ముందస్తు నేరాల నియంత్రణలో భాగంగా దొంగతనాల నివారణనే లక్ష్యంగా, పాత నేరస్తులను గుర్తించడానికి బ్లూ కోర్ట్స్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి తెలిపారు. ఈరోజు మక్తల్ బస్టాండు ప్రధాన చౌరస్తాలలో మక్తల్ పోలీసులు మనోహర్, శ్రీహరి లు అకస్మికంగా ఫింగర్ ప్రింట్స్ డివైస్ తో తనిఖీలు నిర్వహించడం జరిగింది. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను తగిన రీతిలో పరిశీలించి, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఫింగర్ ప్రింట్ డివైస్ తో వ్యక్తుల వేలిముద్రలు సేకరించి క్రిమినల్ రికార్డులతో సరి పోలాచ్రు. పౌరులు ఎటువంటి అనుమానాస్పద వ్యక్తులు గమనించిన వెంటనే లోకల్ పోలీసులకు లేదా డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కార్తీక వనభోజనాలకు గౌరవ శాసనమండలి వైస్ చైర్మన్ తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్ గారిని ముఖ్యఅతిథిగా ఆహ్వానించిన హుజూర్ నగర్ ముదిరాజ్ సంఘం నాయకులు



**హుజూర్నగర్**

తెలంగాణముదిరాజ్ మహాసభ హుజూర్ నగర్ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్తీకవన భోజనాలకు ముఖ్యఅతిథిగా ఆహ్వానిస్తూ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్ గారిని కలిసిన హుజూర్ నగర్ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం నాయకులు ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిడిగం నాగయ్య ముదిరాజ్ హుజూర్ నగర్ నియోజకవర్గ ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్యార్మీ షరీఫ్ వేడుక



**అక్షర కలం, ఆమనగల్లు :**

ఆమనగల్లు పట్టణంలో పీర్ల మసీద్ కాలనీలో మహబూబ్ సుభాని దర్గా వద్ద ఆదివారం గ్యార్మీ షరీఫ్ వేడుక అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. అంజుమనే గులాబీ ముస్తఫా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు పట్టణ ముస్లిం మైనార్టీ నాయకులు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహబూబ్ సుభాని దర్గా వద్ద నుండి జెండాతో పట్టణంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గాలో జెండాను ప్రతిష్టించి మత గురువు హాఫీజ్ మౌలానా వాహేద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు సలాం, దువా ,చేపట్టారు. అంజుమనే గులామే ముస్తఫా కమిటీ ఆధ్వర్యంలో ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జామియా మజీద్ అధ్యక్షులు మహమ్మద్ మాసూమ్, మైనార్టీ సోదరులు అలీబేగ్, చోటే బేగ్ ,జబ్బార్, బాబా షర్ఫుద్దీన్, సయ్యద్ ఖలీల్,నయీం, రజాక్, అఫ్జల్, షఫీ ఉల్లా, ఎజాస్, అలీమ్, కలీం, అంజుమన్ గులామే కమిటీ సభ్యులు అక్రమ్ బేగ్, బాబా, బాబా, అజహర్, అబ్బాస్, అమీర్ పాషా, అసద్, అంజద్, సోహెబ్, సోహెల్ ,గౌస్, రవుఫ్,పాషా, ముధసిర్, ముజంమిల్, ఆబేద్, ముబషీర్, రిజ్వాన్, తదితరులు ఉన్నారు.



# ఉచిత న్యాయ సహాయంతో పాటు చట్టాలపై అవగాహన కార్యక్రమాలు

### జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి పురుషోత్తం రావు

**అక్షరకలం ప్రతినిధి, నల్గొండ**




రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియపరచడం, చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి పురుషోత్తం రావు అన్నారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ వారి ఆదేశాలతో న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నల్లగొండ లోని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించడంతో పాటు ప్రజలకు చట్టాలపై అవగాహనా కల్పిస్తున్నట్లు అయన వివరించారు. లోక్ అదాలత్ నిర్వహిచడం, కుటుంబ వివాదాలను కౌన్సిలింగ్ ద్వారా పరిష్కరించడం జరుగుతుందన్నారు. న్యాయ సహాయం అవసరం ఉన్న వాళ్ళు న్యాయ సేవ సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చు అన్నారు. ఈ నెల 15వ తేదీన జరిగే ప్రత్యేక లోక్ అదాలత్ లో సివిల్ తగాదాలు, రాజి పడదగిన క్రిమినల్ కేసులు, మోటారు వాహన ప్రమాద కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, చెక్ బౌన్స్ కేసులు మొదలగునవి పరిష్కరించుకోవాలని అయన కోరారు. పారా లీగల్ వాలంటీర్లు ప్రజలకు న్యాయ సహాయం అందిస్తూ న్యాయ సేవ అధికార సంస్థ కు, ప్రజలకు మధ్యన వారధిగా పనిచేయాలని అయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కట్ట అనంత రెడ్డి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ఎన్. భీమార్జున్ రెడ్డి, న్యాయ సేవ అధికార సంస్థ నామినేటెడ్ మెంబెర్ కట్ట వెంకట్ రెడ్డి, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ఎం. లెనిన్ బాబు న్యాయ వాదులు, పారా లీగల్ వాలంటీర్లు, స్వచ్చంద సంసథల ప్రతినిధులు, మొదలగు వారు పాల్గొన్నారు.

# మోడీ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలపై కార్మిక వర్గం తిరగబడాలి

### 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

### సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎండి. సలీం

### 29,30 తేదీల్లో జిల్లా మహాసభలు

### 29న కార్మిక ప్రదర్శన

**అక్షరకలం ప్రతినిధి, నల్గొండ**




ఈనెల 29, 30 తేదీలలో సిఐటియు నల్గొండ జిల్లా 13వ మహాసభలు నల్గొండ పట్టణంలో జరుగుతున్న సందర్భంగా 29న కార్మిక ప్రదర్శన జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎండి. సలీం పిలుపునిచ్చారు. ఆదివారం నల్గొండ పట్టణ ఎగుమతి దిగుమతి అమాలి వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం దొడ్డి కొమరయ్య భవన్లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై కార్మిక వర్గ హక్కుల సాధన కోసం కార్మిక వర్గం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 1970లో ఐక్యత పోరాటం నినాదంతో సిఐటియు ఆవిర్భవించిందని నాటినుండి నేటి వరకు కార్మిక వర్గాన్ని ఒక వర్గంగా ఐక్యం చేయడం కోసం వారి హక్కుల కోసం అనేక ఉద్యమాలు నిర్వహించి విజయాలు సాధించిందని అన్నారు. బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి కార్మిక వర్గాన్ని పెట్టుబడుదారులు మరింత దోపిడీ చేసుకోవడానికి అవకాశం ఇచ్చిందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, దేశంలో సహజ వనరులన్నీ బడా కార్పొరేట్ పెట్టుబడుదారులకు అప్పనంగా అప్పజెప్తోందని అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందర కార్మిక వర్గానికి అనేక హామీలు ఇచ్చిందని ఏ ఒక్క హామీ అమలు చేయకుండా కార్మికులను మోసం చేసిందని విమర్శించారు. కార్మిక వర్గ సమస్యల పై చర్చించడానికి నవంబర్ 29,30 తేదీలలో నల్లగొండలో జరిగే సిఐటియు జిల్లా మహాసభలు సందర్భంగా 29న జరిగే కార్మిక ప్రదర్శనలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, పట్టణ కన్వీనర్అవుట రవీందర్, నల్లగొండ పట్టణ ఎగుమతి దిగుమతి అమాలి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఆవురేశు మారయ్య, కార్యదర్శి బొమ్మకంటి లక్ష్మీపతి, కోశాధికారి మేడబోయిన వీరబాబు, కృష్ణయ్య, వీరయ్య, చంద్రయ్య, అశోక్, నాగరాజు, శంకర్, వెంకన్న, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



# జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో ముగిసిన ఎన్నికల ప్రచారం....

### - నవీన్ యాదవ్ గెలుపు ఖాయం ఎంపి....

**కొల్చారం, నవంబర్ 09( అక్షర కలం):-**



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా ఆదివారం ఉదయం ఎన్నికల ప్రచారం సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించారు. వార్డుల్లో గల్లి గల్లికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి జోరుగా ఇంటింటి ప్రచారం నిర్వహించడంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గం కార్యకర్తలతో ఎంపీ ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎంపీ సురేష్ షేట్కర్, మాజీ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మొహి నుద్దీన్ కలిసి మధ్యాహ్నం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి చేతి గుర్తుకు ఓటు వేయాలని ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో ప్రజల నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మంచి స్పందన వచ్చిందని, తప్పకుండా చేయి గుర్తుకు ఓటు వేస్తామని అన్నారని తెలిపారు. ప్రచారంలో ఎంపీ సురేష్ సెట్కర్, మాజీ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మొహియుద్దిన్ లు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పది సంవత్సరాలు అధికారంలో బి ఆర్ఎస్ , బిజెపి పార్టీలు ప్రజలకు ఓర్గబెట్టిందేమీ లేదని వారు తెలిపారు. గత పోయిన అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని వారు గుర్తు చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు ప్రజలు పట్టం కడతారని వారు తెలిపారు. ఈ ప్రచారంలో ఎంపీ తో పాటు మాజీ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మొ యినుద్దీన్, జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు వాళ్ల సంతోషంతో తప్పకుండా నవ్వి యాదవ్ అన్న గెలుస్తాడని నమ్మకంతో విజయోత్సవం చేస్తున్నారు. ఈ ప్రచారంలో ఎంపీ సురేష్ షే ట్కర్ మాజీ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మొయి నుద్దిన్, అసెంబ్లీ నియోజకవర్గం ప్రజలు పాల్గొన్నారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955